ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 06.05.2026 | సంపుటి : 12 సంచిక : 286 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370








## మోడీ విజయం చరిత్రాత్మకం.. నిర్ణయాత్మకం

- బెంగాల్, అసోం ఏడ్డీయే విజయాలపై ట్రంప్ అభినందనలు

2లో..

## బెంగాల్, అసోంలలో ఓట్ చోరీ

- జనాదేశ్‌ను చోరీచేసిన బీజేపీ
- రాహుల్ విమర్శలు



# ఓడించిన ప్రజలను గెలిపించిన స్టాలిన్

**మొదటి రోజే సొంత నియోజకవర్గం కొళత్తూరులో పర్యటన**




"కొళత్తూర్‌కు నాకు మధ్య ఉన్న అనుబంధం గెలుపోటములకు అతీతమైనది. ఇక్కడి ప్రజలు గత 15 ఏళ్లుగా నాకు అండగా నిలిచారు. ఇక్కడి నుంచే పదేళ్లు ప్రతిపక్షంలో, ఐదేళ్లు అధికారంలో ఉన్నాను. నా శక్తి మేరకు అభివృద్ధి పథకాలను విజయవంతంగా అమలు చేశాను. తమిళనాడులో దీన్నొక ఆదర్శమంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు మౌలిక వసతులను కల్పించా. ప్రజలు లేవనెత్తిన ప్రతి సమస్యనూ నెరవేర్చినందుకు సగర్వంగా ఈరోజు నా నియోజకవర్గంలో ప్రజల్ని వ్యక్తిగతంగా కలిసి కృతజ్ఞతలు తెలిపాను.ఎప్పుడూ మీకు అండగా ఉంటాను"- స్టాలిన్

### తనను ఆదరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన మాజీ ముఖ్యమంత్రి

**చెన్నై(జనంసాక్షి):**ఎన్నికల్లో ఓడిన మరుసటి రోజే డీఎంకే చీఫ్ ఎంకే స్టాలిన్ తన సొంత నియోజకవర్గం కొళత్తూరులో పర్యటించారు. అక్కడి ప్రజలతో కలిసి మాట్లాడారు. 15 ఏళ్ల పాటు తనను ఆదరించినందుకు గాను కృతజ్ఞతలు తెలియజేస్తూ పలు వీధుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా తన పర్యటన ఫొటోలతో 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. "కొళత్తూర్‌కు నాకు మధ్య ఉన్న అనుబంధం గెలుపోటములకు అతీతమైనది. ఇక్కడి ప్రజలు గత 15 ఏళ్లుగా నాకు అండగా నిలిచారు. ఇక్కడి నుంచే పదేళ్లు ప్రతిపక్షంలో, ఐదేళ్లు అధికారంలో ఉన్నాను. నా శక్తి మేరకు అభివృద్ధి పథకాలను విజయవంతంగా అమలు చేశాను. తమిళనాడులో దీన్నొక ఆదర్శమంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు మౌలిక వసతులను కల్పించా. ప్రజలు లేవనెత్తిన ప్రతి సమస్యనూ నెరవేర్చినందుకు సగర్వంగా ఈరోజు నా నియోజకవర్గంలో ప్రజల్ని వ్యక్తిగతంగా కలిసి కృతజ్ఞతలు తెలిపాను. ప్రతి వీధిలో వెళ్తూ నేను ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలు, పార్కులు, లైబ్రరీలు, మ్యారేజ్ హాల్స్, బస్టాండ్లు, ఆస్పత్రులు, స్కూళ్లు, కాలేజీలను చూసి నా విధుల్ని ఎంతో విశ్వాసంతో నిర్వర్తించాననే

మిగతా 2లో..

# స్కిల్స్ పెంచుకుంటే ఉద్యోగాలకు కొదవలేదు





## అనేక రంగాల్లో అపార అవకాశాలున్నాయి

- మానవ వనరుల అభివృద్ధి కోసం పోషకాహార లోపం సమస్యను తగ్గించుకోవాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికపై నిర్వహించిన సమావేశంలో మాజీ ఆర్బీఐ గరవ్నర్ రఘురామరాజన్

**హైదరాబాద్(జనంసాక్షి):**నైపుణ్యాలు మెరుగుపర్చుకుంటే అనేక రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని రిజర్వు బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ స్పష్టం చేశారు. మానవ వనరుల అభివృద్ధి కోసం పోషకాహార లోపం సమస్యను తగ్గించుకోవాలని ఆయన సూచించారు. తెలంగాణ భవిష్యత్తు ప్రణాళిక పైన నిర్వహించిన సమావేశంలో రఘురామ్ రాజన్ పలు సూచనలు చేశారు. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రఘురామ్ రాజన్‌తో పాటు డీప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

మిగతా 2లో..

# నేను రాజీనామా చేయను

## భీష్మించిన మమత బెనర్జీ



- బెంగాల్లో నేను ఓడిపోలేదు...రాజీనామా చేయను
- బీజేపీ కుట్రలతో గెలిచింది.. తొత్తుగా మారిన ఎన్నికల సంఘం
- ప్రధాన విలన్ ఎన్నికల కమిషనరే
- బీజేపీ అన్నిరకాల దౌర్జన్యాలు చేసింది తనపై కూడా దాడికి తెగబడింది
- మీడియా సమావేశంలో మమతా బెనర్జీ వ్యాఖ్యలు

వార్త 2 లో

# కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్‌ను అపాయింట్‌మెంట్ కోరిన విజయ్

- మెజార్టీ కోసం 15 రోజులు గడువు కోరిన టివికె
- 7న ప్రమాణం చేస్తామని ప్రకటించిన టీవీకే
- పొత్తు కోసం ఎవరినీ అడుక్కోబోమని స్పష్టీకరణ
- శాసనసభా పక్ష నేతగా విజయ్ ఎన్నిక
- ప్రధాని మోదీ, రాహుల్‌లకు విజయ్ కృతజ్ఞతలు

**చెన్నై(జనంసాక్షి):** తమిళనాడులో అత్యధిక స్థానాలు సాధించిన టీవీకే పార్టీ మెజారిటీకి కొద్ది దూరంలో ఉంది. ఇదే సమయంలో పార్టీ లెజిస్లేటివ్ లీడర్‌గా విజయ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ పార్టీ ప్రకటించింది. మంగళవారం జరిగిన పార్టీ సమావేశంలో విజయ్‌ను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ

మిగతా 2లో..



# రైతును రాజు చేసే వరకు విశ్రమించబోం

## నాలుగు రోజుల్లో వారి సమస్యలు పరిష్కరిస్తాం

సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతుల పక్షపాతంగా పనిచేస్తున్న సంగతి మీకు తెలియంది కాదు. ఆనాటి ప్రభుత్వం ఏవైతే అరకొర పనులు చేస్తే వాటన్నింటిని కొనసాగిస్తునే ఉన్నాం. గత ప్రభుత్వ హయాంలో లక్ష రూపాయల రుణమాఫీ చేయడానికి పదేళ్లు పడితే ఈ ప్రజాప్రభుత్వంలో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం 25 లక్షల రైతన్నలకు రూ.21 వేల కోట్లు ప్రభుత్వం వచ్చిన తొమ్మిది నెలల్లోనే మాఫీ చేశాం"
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి,

- ఎకరానికి రూ.12 వేలతో పాటు వ్యవసాయ పరికరాలు ఇస్తున్నాం
- తెలంగాణలో రైతుపక్షపాత ప్రభుత్వం నడుస్తోంది
- రాష్ట్రస్థాయి మెగా రైతు మేళాలో మంత్రి పొంగులేటి వెల్లడి

**హన్మకొండ(జనంసాక్షి):**సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతుల పక్షపాతి ప్రభుత్వం నడుస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రూ.లక్ష రుణమాఫీ చేసేందుకు గత ప్రభుత్వానికి పదేళ్లు పట్టిందని ఆయన ఎద్దేవా చేశారు. వారు(బీఆర్ఎస్) రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టినా రైతులకు రూ.21 వేల కోట్లు చెల్లించామన్న ఆయన వరి వేసిన రైతులకు మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. హనుమకొండలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి మెగా రైతు మేళాను ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.గత ప్రభుత్వ హయాంలో వరి వేస్తే ఉరి అన్నారని, తాము మాత్రం రైతును రాజు చేసే వరకు విశ్రమించబోమని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రైతులకు ఎకరానికి రూ.12 వేలతో పాటు వ్యవసాయ పరికరాలు ఇస్తూ, కేంద్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంటుకు రూ.1200 కోట్లు చెల్లిస్తున్నామన్నారు. మూడు, నాలుగు రోజుల్లో రైతుల

మిగతా 2లో..





## బెంగాల్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటు మే 9న..

- బెంగాల్, అసోంలకు బిజెపి పరిశీలకుల నియామకం
- అమిత్ షా, జెపి నడ్డాలకు పార్టీ బాధ్యతలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** పశ్చిమబెంగాల్‌లో మే 9న భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య వెల్లడించారు. నోబెల్ పురస్కార గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా ఆ రోజున నూతన సీఎం ప్రమాణస్వీకారం చేస్తారని

మిగతా 2లో..

### ఒక్క ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వక పోవడం

# తెలంగాణపై వివక్షే

## ప్రాణహిత-చేవెళ్లకు జాతీయ హోదా కల్పించాలి



- పోలవరంకు జాతీయ హోదా ఇచ్చి, తెలంగాణను విస్మరిస్తే ఎలా ?
- ధాన్యాన్ని కేంద్రం తీసుకోకుండా కొర్రీలు పెట్టడం సరికాదు
- నిధుల విడుదలలో జాప్యం చేయడం రైతుల్ని మోసం చేయడమే
- కేంద్రం ప్రభుత్వంపై ధ్వజమెత్తిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**రాజన్నసిరిసిల్లబ్యూరో(జనంసాక్షి):**ప్రధానమంత్రి మోడీ తెలంగాణ పర్యటనను పురస్కరించుకుని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డిజైన్ చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తక్షణమే జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. సిరిసిల్లా జిల్లా గంబిరావుపేట గ్రామంలోని పంతులుగారి తోటలో బయోస్ట్రాటమ్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటేడ్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి మంగళవారం డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్ లతో కలిసి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణలోని ఒక ప్రధాన సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తామని నాటి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామిని నెరవేర్చాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందని ఆయన గుర్తు చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించినప్పటికీ, తెలంగాణలో ఏ ఒక్క ప్రాజెక్టుకు కూడా ఆ హోదా కల్పించకపోవడం తెలంగాణ రాష్ట్రం పట్ల చూపుతున్న వివక్షతకు నిదర్శన మన్నారు. తెలంగాణలో రైతులు పండించే ప్రతి పంటను కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం తీసుకోకుండా కొర్రీలు పెట్టడం, నిధుల విడుదలలో జాప్యం చేయడం రైతుల్ని మోసం చేయడమేనని ఆయన

మిగతా 2లో..

## హైడ్రా భారీ ఆపరేషన్

- అక్రమ మైనింగ్‌పై కఠిన చర్యలు
- ఒకేరోజు 6 ప్రాంతాల్లో దాడులు

**రాజేంద్రనగర్(జనంసాక్షి):**హైదరాబాద్‌లో అక్రమ మైనింగ్‌పై హైడ్రా కొరడా ఝుళిపిస్తోంది. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న స్టోన్ క్రషింగ్, ఆర్ఎంసీ యూనిట్లపై భారీ స్థాయిలో చర్యలు చేపట్టింది. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, మైనింగ్, రెవెన్యూ శాఖల ఫిర్యాదులతో రంగంలోకి దిగిన హైడ్రా, ఒకే రోజు 6 ప్రాంతాల్లో దాడులు నిర్వహించి 6 క్రషింగ్ యూనిట్లతో పాటు, 12 ఆర్ఎంసీ ప్లాంట్లను తొలగించింది. భవిష్యత్తులో ఆ ప్రాంతాల్లో స్టోన్ క్రషింగ్ చేయడానికి వీలు లేకుండా యంత్ర సామగ్రిని ధ్వంసం చేసింది. రూ.వందల కోట్లలో ప్రభుత్వ

మిగతా 9లో..




# హైదరాబాద్‌లో బీఏఎస్ఎఫ్ గ్లోబల్ సర్వీస్ హబ్

## తెలంగాణ ప్రభుత్వంతో కీలక ఒప్పందం
## 3వేల మందికి ఉద్యోగాలు : మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్‌లో జర్మనీకి చెందిన అంతర్జాతీయ దిగ్గజం బీఏఎస్ఎఫ్ గ్లోబల్ సర్వీస్ హబ్‌ను ఏర్పాటు చేయనుంది. ఈమేరకు తెలంగాణ ప్రభుత్వానికి కీలక ఒప్పందం కుదిరింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 3,000 మందికి కొత్త ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఐటీ మంత్రి శ్రీధర్ బాబుకు సంస్థ ప్రతినిధులు లెటర్ ఆఫ్ ఇంటెంట్ అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను స్థాపించనున్నట్లు ప్రకటించారు.

మిగతా 2లో..



## ఏరోస్పేస్ దిగ్గజాలకు తెలంగాణ వ్యూహాత్మక భాగస్వామి

'ఐటీపీ ఏరో - ఇండియా' ప్లాంట్ కు మంత్రి శ్రీధర్ బాబు భూమిపూజ

2లో..

# హార్మూజ్ మళ్లీ ఉద్రిక్తం


- జలసంధిపై ట్రంప్ నిర్ణయానికి నిరసనగా యూఏఈపై ఇరాన్ దాడులు
- ముగ్గురు భారతీయులకు గాయాలు

**దుబాయ్(జనంసాక్షి):** హార్మూజ్ జలసంధి మళ్లీ ఉద్రిక్తంగా మారింది. ఈ జలసంధిలో చిక్కుకుపోయిన వాణిజ్య నౌకలను సురక్షితంగా బయటకు తీసుకొస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో చేసిన ప్రకటనతో వాతావరణం వేడెక్కింది. ఆపరేషన్‌కు.. 'ప్రాజెక్టు ఫ్రీడం' అని ట్రంప్ పేరు పెట్టారు. దీన్ని మానవతా దృక్పథంతో చేపట్టామని, ఇందులో భాగంగా తమ యుద్ధనౌకలు జలసంధిలోకి వెళతాయని తెలిపారు. రెండు వాణిజ్య నౌకలు సురక్షితంగా జలసంధి దాటినట్లు అమెరికా సైన్యం వెల్లడించింది. దీన్ని ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఏ నౌక కూడా జలసంధి దాటలేదని స్పష్టం చేసింది. అమెరికా చేపట్టిన 'ప్రాజెక్టు ఫ్రీడం'ను ఇరాన్ ఖండించింది. తమ అనుమతి లేకుండా ఓ అమెరికా నౌక జలసంధిలోకి రావడానికి ప్రయత్నించిందని.. దానిపై క్షిపణులతో దాడి చేశామని ప్రకటించింది. దీన్ని అమెరికా సైన్యం ఖండించింది. ఒక్క నౌకపైనా దాడి జరగలేదని తెలిపింది. జలసంధిలో తమ కార్యకలాపాలకు అడ్డు తగిలేందుకు ప్రయత్నించిన



ఏడు ఇరాన్ చిన్న నౌకలను ధ్వంసం చేశామని వెల్లడించింది. మరోవైపు అమెరికా నౌకలపై దాడి చేస్తే ఇరాన్‌ను సర్వనాశనం చేస్తామని ట్రంప్ బెదిరించారు. ఈ నేపథ్యంలో యూఏఈపై సోమవారం ఇరాన్ నాలుగు క్షిపణులను ప్రయోగించింది. ఇందులో మూడింటిని అడ్డుకున్నామని.. ఓ క్షిపణి సముద్రంలో పడిందని యూఏఈ పేర్కొంది. ఫుజైరా ఆయిల్ ఇండస్ట్రీ జోన్‌లోని ఓ చమురు శుద్ధి కేంద్రంపైనా ఇరాన్ డ్రోన్ దాడులు నిర్వహించింది. ఈ దాడితో

మిగతా 2లో..




### ఇద్దరు భారతీయ జర్నలిస్టులకు

## పులిట్జర్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారతీయ ఇలుస్ట్రేటర్ ఆనంద్ ఆర్కే, జర్నలిస్టు సుపర్ణ శర్మ.. 2026 పులిట్జర్ అవార్డును గెలుచుకున్నారు. ఇలుస్ట్రేటెడ్ రిపోర్టింగ్ అండ్ కామెంటరీ విభాగంలో వాళుఈ అవార్డు చేజిక్కించుకున్నారు. ట్రాప్డ్ అనే కథనం కోసం ఆ ఇద్దరు జర్నలిస్టులతో కలిసి నాటాలీ ఒబికో పియర్సన్ కూడా పనిచేశారు. ఈ ముగ్గురూ అవార్డును షేర్ చేసుకున్నారు. డిజిటల్ అరెస్టుకు చెందిన కథనాన్ని

మిగతా 9లో..




## రాష్ట్రస్థాయి మెగా రైతు మేళా ప్రారంభం

**హనుమకొండ ప్రతినిధి, మే 5 (జనం సాక్షి) :** హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళాను మంగళవారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మరియు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సితక్క లతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మేళాలో ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, సాంకేతిక స్టాళ్లను సందర్శించి, రైతులతో మమేకమయ్యారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ రైతు సంక్షేమ పథకాలపై అధికారులు అందిస్తున్న వివరాలను ఆసక్తిగా పరిశీలించారు. రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, మేళా ద్వారా రైతులకు అందుతున్న అవగాహన కార్యక్రమాలు వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తాయని మంత్రులు పేర్కొన్నారు. రైతులు కొత్త పద్ధతులను అవలంబించి దిగుబడులు పెంచుకొని, ఆదాయాన్ని మెరుగుపరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ రెడ్డి, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర స్థాయి అధికారులు, సురేంద్ర మోహన్, యస్మిన్ బాషా, హన్మకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు చాహాత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు పక్షపాతిగా రాష్ట్ర ప్రజాపాలన ప్రభుత్వం

- రైతు సంక్షేమమే లక్ష్యంగా పలు కార్యక్రమాలు
- రైతు డిక్లరేషన్ లో ఇచ్చిన హామీలన్నీ అమలు
- రాష్ట్ర స్థాయి రైతు మేళాలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**హనుమకొండ ప్రతినిధి మే 5 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుపక్షపాతిగా వ్యవహరిస్తూ రైతు సంక్షేమమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సెన్స్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళాను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్కలతో కలసి ప్రారంభించారు. ఈ మేళాలో ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, సాంకేతిక స్టాళ్లను మంత్రులు సందర్శించి, రైతులతో మమేకమయ్యారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ రైతు సంక్షేమ పథకాలపై అధికారులు అందిస్తున్న వివరాలను ఆసక్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ 2022 మే 6న ఇదే మైదానంలో రాహుల్ గాంధీ లక్షలాది మంది సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తరుపున రైతు డిక్లరేషన్ ప్రకటించారని అన్నారు. రైతులను నడిరోడ్డు మీద సంకెళ్లు వేసి చంటి పిల్లలతో నడిపించుకుని పోయిన ప్రభుత్వానికి రైతులు బుద్ధి చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని చెప్పారని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం. ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ప్రభుత్వం రైతు పక్షపాతి గా వ్యవహరిస్తూ రైతుకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నదని అన్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీ చేయడానికి పది సంవత్సరాలు తీసుకుంటే ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 9 నెలల లోపే రెండు లక్షల రుణమాఫీ 25 లక్షల మంది రైతులకు 21 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేశామని తెలిపారు. గత ప్రభుత్వం వరి వేస్తే ఉరే అని ప్రకటిస్తే ప్రజా ప్రభుత్వంలో వరి ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయడంతో పాటు సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం రైతు బంధు పేరుతో సంవత్స రానికి రూ.10,000 ఎకరానికి ఇస్తే ప్రజా ప్రభుత్వంలో రైతు భరోసా పేరుతో 12 వేల రూపాయలు అందిస్తున్నామని అన్నారు. గత ప్రభు త్వం చేసిన అరకొరా సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలను తీసుకువచ్చి వ్యవసాయ పనిముట్లను అందిస్తున్నామని అన్నారు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో మూడు రోజులపాటు నిర్వహించే రైతు మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవా లని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కావ్య, నగర మేయర్ సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అవినాష్ రెడ్డి, కుడా చైర్మన్, ఇనుగాల వెంకట్రామ రెడ్డి, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్, హార్టికల్చర్ సెక్రటరీ యాస్మిన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో చిన్నారి కిడ్నాప్ కలకలం

### తల్లి ఒడిలో ఉండగా అర్ధరాత్రి ఎత్తుకెళ్లిన దుండగులు



**హైదరాబాద్, మే 5 (జనంసాక్షి)** :హైదరాబాద్‌లో చిన్నారి కిడ్నాప్ కలకలం సృష్టించింది. కుత్బుల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రహదారి పక్కన అర్ధరాత్రి తల్లి ఒడిలో నిద్రిస్తున్న ఆరు నెలల చిన్నారిని దుండగులు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. మల్లారెడ్డి ఆస్పత్రి ఎదురుగా రోడ్డు పక్కన ఉన్న మార్బుల్ షాపు వద్ద ఆదివారం అర్ధరాత్రి నవనీత అనే మహిళ తన నలుగురు పిల్లలతో నిద్రిస్తున్నది. తల్లి నిద్రలో ఉన్న సమయంలో ఒడిలో నిద్రిస్తున్న ఆరు నెలల చిన్నారి ఆశను ఎవరో దుండగులు ఎత్తుకెళ్లారు. కాసేపటికి మెలకువ వచ్చిన నవనీత చుట్టుపక్కల వెతకగా పాప కనిపించకపోవడంతో ఆందోళనకు గురైంది. వెంటనే కుత్బుల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తల్లి నవనీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాల విస్తరణకు చర్యలు

### రోజుకు 15 లక్షల మందికి పనులు లక్ష్యం: మంత్రి సీతక్క

**హైదరాబాద్, మే 5 (జనంసాక్షి):** గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తృతంగా పెంచేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క వెల్లడించారు. ప్రస్తుతం ఉపాధి హామీ పనుల్లో రోజుకు సుమారు 9 లక్షల మంది కూలీలు పాల్గొంటుండగా, ఈ సంఖ్యను తక్షణం 15 లక్షలకు పెంచేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

గ్రామాల్లో పనుల ప్రణాళికను వేగవంతం చేసి, అవసరమైన అనుమతులు, సాంకేతిక ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయడం ద్వారా మరిన్ని పనిదినాలు సృష్టించాలని సూచించారు. కూలీలకు నిరంతర ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రతి జిల్లాలో ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.


మంగళవారం వరంగల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా పరిషత్ సీఈఓలు, డీఆర్‌డీఓలు, డీపీఓలు, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం, మిషన్ భగీరథ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, ఉపాధి హామీ, సెర్ప్ కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు.

**నిధుల వినియోగంపై కఠిన ఆదేశాలు**

15వ ఆర్థిక సంఘం నిధులను కేవలం అనుమతించిన పనులకే వినియోగించాలని మంత్రి స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిధులను మళ్లించిన ఘటనలపై వెంటనే నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీలకు సుమారు రూ.1590 కోట్ల విద్యుత్ బకాయిలు ఉన్నట్లు పేర్కొన్న మంత్రి, వీటిని అత్యవసరంగా చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధ చర్యలు అవసరమని తెలిపారు. ఏప్రిల్, మే నెలలకు కేంద్రం మంజూరు చేసిన 6 కోట్ల పనిదినాల్లో ఏప్రిల్‌లో కోటిన్నర పనిదినాలు సాధించడం సానుకూలమని పేర్కొన్న మంత్రి, మే నెలలో పూర్తి లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు.

## నిర్మాత ఆర్‌బీ చౌదరి దుర్మరణం

### రాజస్థాన్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి



**హైదరాబాద్, మే5 (జనంసాక్షి) :** చిత్ర పరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ నిర్మాత ఆర్‌బీ చౌదరి (76) దుర్మరణం చెందారు. రాజస్థాన్‌లోని ఉదయ్ పుర్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన ప్రాణాలు కోల్పోయారు. సూపర్ గుడ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై తమిళ, తెలుగు, మలయాళంలో ఎన్నో విజయవంతమైన చిత్రాలను ఆయన నిర్మించారు. పలు సినిమాలను డిస్టిబ్యూట్ చేశారు. 'రంగం' ఫేమ్ హీరో జీవా.. ఆర్‌బీ చౌదరి తనయుడే. మరో తనయుడు రమేశ్ 'విద్యార్థి' చిత్రంలో హీరోగా నటించారు. వీరితోపాటు మరో ఇద్దరు కుమారులున్నారు. రాజస్థానీ అయిన ఆర్‌బీ చౌదరి 1950లో మద్రాసులో జన్మించారు. పూర్తి పేరు రతన్‌లాల్ భగత్‌రామ్ చౌదరి. సినిమాల్లోకి రాకముందు స్టీల్, జ్యువెల్లరీ తదితర వ్యాపారాలు నిర్వహించారు. ఆయన నిర్మించిన తొలి సినిమా 'ఆదిపాపమ్' (మలయాళం). 1988లో విడుదలైంది. 1990లో 'పుదు వసంతం'తో కోలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. 'నవ వసంతం' పేరుతో తెలుగులో రీమేక్ చేశారు. 'సుస్వాగతం'తో ఘన విజయాన్ని అందుకున్నారు. అది మొదలు 'సూర్యవంశం', 'రాజా', 'శీను', 'నువ్వు వస్తావని', 'నిన్నే ప్రేమిస్తా', 'ప్రియమైన నీకు', 'శివరామరాజు', 'గోరింటాకు', 'సంక్రాంతి'.. ఇలా కుటుంబమంతా కలిసి చూడదగ్గ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు. 'శుభాకాంక్షలు'లాంటి హిట్ సినిమాలకు సమర్పకుడిగానూ వ్యవహరించారు. టాలీవుడ్‌లో రీమేక్ సినిమాలతోనే ఆర్‌బీ చౌదరి ఎక్కువగా విజయాలు అందుకున్నారు. దీనికి గల కారణాన్ని ఓ సందర్భంలో తెలిపారు. తనకు తమిళం బాగా వచ్చు కాబట్టి తొలుత కోలీవుడ్‌లో నిర్మిస్తానని, వాటిలో తెలుగు ప్రేక్షకులను మెప్పించే అంశాలుంటే తప్పక రీమేక్ చేస్తుంటానని చెప్పారు. సూపర్‌గుడ్ ప్రొడక్షన్స్, సూపర్‌గుడ్ కంబైన్స్, మెగా సూపర్ గుడ్‌ఫిల్మ్స్.. బ్యానర్ల పేర్లు మారినా ఆయన సినిమాల్లోని వినోదం మాత్రం తగ్గలేదు. ఆయన నిర్మాణంలో గతేడాది 99వ సినిమా 'మకుటం' మొదలైంది. ఇందులో విశాల్ హీరో.

## గృహప్రవేశాలు... లబ్ధిదారులకు సన్మానం

### మంత్రుల చేతుల మీదుగా డబుల్ బెడ్ రూం ఇండ్ల ప్రారంభోత్సవం



**వరంగల్ ప్రతినిధి, మే 5 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం పే దలకు సొంతింటి కలను నెర వేర్చేందుకు వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని పైడిపల్లి గ్రామంలో నిర్మించిన రెండు పడక గదుల ఇండ్లను మంగళవారం రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రివర్యులు, జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అటవీ,పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు దివ్యాంగులకు కేటాయించిన 2 పడక గదుల ఇండ్ల గృహప్రవేశాలు చేసి లబ్ధిదారులకి ఇవ్వడం జరిగింది. అందుకు లబ్ధిదారులు సొంత ఇంటి కల సాకారం అయినందుకు లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. పైడిపల్లిలో మొత్తం 6 బ్లాకులు నిర్మించగా, ప్రతి బ్లాక్‌లో 12 కుటుంబాలకు చొప్పున మొత్తం 70 ఇండ్ల నిర్మాణం జరిగింది. ఈ సందర్భంగా వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు మాట్లాడుతూ దివ్యంగులు కోరిన విధంగా అనుకున్న సమయానికి లబ్ధిదారులకు రెండు పడక గదులు ఇండ్లను అందించినందుకు సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన ప్రభుత్వం పేదల పాలిట పెన్నిధి అని అన్నారు. 70 ఇండ్ల నిర్మాణానికి రూ. 371 లక్షలు వ్యయంతో నిర్మించిన ఈ గృహాలను దివ్యాంగులకు కేటాయించడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట శాసనసభ్యులు కె. ఆర్. నాగరాజు, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ మరియు జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్పాయ్, జెడ్పి సీఈవో హౌసింగ్ పీడీ రామ్ రెడ్డి హౌసింగ్ డి ఇ తదితరులు పాల్గొన్నారు.

## అటవీ భూముల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

**అచ్చంపేట, మే 5 (జనంసాక్షి)**
నాగర్ కర్నూల్ జిల్లాలోని అటవీ ప్రాంత భూముల సంరక్షణ, ఈకో సెన్సిటివ్ జోన్స్, చెంచులకు కల్పించే పునరావాస గ్రామాల అభివృద్ధి పనులపై, సంబంధిత శాఖల అధికారులు, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర తో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అటవీ భూముల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, అక్రమ ఆక్రమణలను నివారించే విధానాలు, పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడే కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అటవీ భూముల సర్వే, సరిహద్దుల గుర్తింపు, భూముల రికార్డుల నవీకరణ వంటి అంశాలపై రెవిన్యూ అటవీ శాఖలు సంయుక్తంగా ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, అటవీ వనరులను సంరక్షించడంలో స్థానికుల భాగస్వామ్యాన్ని పెంపొందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అక్రమంగా చెట్లను నరికే చర్యలపై కఠినంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ అధికారులు హెచ్చరించారు. ఈకో సెన్సిటివ్ జోన్స్ పరిధిలో పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అటవీ ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు, తవ్వకాలు, చెట్ల నరికివేత వంటి చర్యలను కట్టడి చేయాలని, రెవెన్యూ, పోలీసు, అటవీ సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి, నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని పేర్కొన్నారు.

## ఇచ్చిన హామీలకు.. పాలనకు పొంతన లేదు

### కాంగ్రెస్ సర్కార్‌ను సాగనంపడమే ఉత్తమం
### గజ్వేల్ బిజెపి సభలో ఈటెల రాజేందర్ వ్యాఖ్య



**సిద్దిపేట, మే 5 (జనంసాక్షి) :**
తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి చెప్పిన మాటలకు ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఆయన చేస్తున్న పనులకు ఎక్కడా పొంతన లేదని ప్రజలు చెప్పుకొనే పరిస్థితి వచ్చిందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీని ఎన్ని శాపనార్థాలు పెట్టినా వెస్ట్ అని.. మళ్ళీ ఎన్నికలు వచ్చినప్పుడు ఓడిస్తే తప్ప మనకు మన:శాంతి లేదని ప్రజలు అనుకుంటున్నారని చెప్పారు.

మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో బీజేపీ నేతల సమావేశంలో ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ.. రిటైర్ ఉద్యోగులకు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద నగదు చెల్లించక పోవడంతో కోర్టు జోక్యం చేసుకుని తీవ్ర వ్యాఖ్యలు చేసే పరిస్థితి వచ్చిందంటే.. ప్రభుత్వాన్ని ఎట్లా నడుపుతున్నారో వాళ్లకే తెలియాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న పనులు చేసుకునే కాంట్రాక్టర్లకు బిల్లులు అందక గతంలోనే కాదు.. నేడు కూడా వారు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని ఎంపీ ఈటల ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్లకే కాంగ్రెస్ పార్టీ ప్రజల చేత ఛీ కొట్టించుకునే పరిస్థితులు వచ్చాయని పేర్కొ న్నారు. తెలంగాణ రాష్ట్రం బాగుపడాలంటే ఏకైక మార్గం బీజేపీ అధికారంలోకి రావడం ఒక్కటే మార్గమని ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారన్నారు. పశ్చిమ బెంగాల్‌లో అరాచకం, దుర్మార్గాలు జరిగినా.. ఇది నా జాగీరు అని అహంకారంగా పాలించిన టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీని ప్రజలు ఓడించారని ఎంపీ ఈటల తెలిపారు. తమిళనాడులో స్టాలిన్ మీద ఒక సామాన్యుడు గెలిచాడంటే డీఎంకే ప్రభుత్వంపై ప్రజలకు ఎంత వ్యతిరేకత ఉందో స్పష్టమైందన్నారు. తమిళనాడు ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయ పార్టీలకు కనువిప్పు కావాలని తాను కోరుకుంటున్నానని ఆయన తెలిపారు. కుటుంబ రాజకీయాలు నడిపేవారు.. ఈ రాష్ట్రానికి తామే ఓనర్లమనే పద్ధతిలో అన్ని వాళ్లే చేసుకునే వారికి, లక్షల కోట్ల రూపాయలు స్కాంలు చేసి డబ్బులు సంపాదించి.. వాటితో ఎన్నికల్లో గెలవాలని కుట్ర చేసే వారికి తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అత్యుత్తమ ఉదాహరణ అని ఎంపీ ఈటల రాజేందర్ చెప్పారు. తమిళనాడు ఎన్నికల ఫలితాలు.. చిన్న విషయం కాదన్నారు. దీనిపై లోతుగా ఆలోచించాల్సిన విషయమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలు ఎంత అప్రమత్తంగా, ఎంత షార్ప్‌గా ఉన్నారో ఈ ఫలితాలను బట్టి మనకు అర్థమవుతుందని ఎంపీ ఈటల రాజేందర్ చెప్పారు.

## కోహీర్‌లో గ్యాస్ సిలిండర్ల చోరీ

**సంగారెడ్డి, మే5 (జనంసాక్షి) :** సంగారెడ్డి జిల్లా కోహీర్ పట్టణంలో గ్యాస్ సిలిండర్ల దొంగలు హల్‌చల్ చేశారు. సీఐ తెలిపిన వివరాలు.. పట్టణ పరిధి భీంనగర్ కాలనీలోని మనీషా ఇండేన్ గ్యాస్ సిలిండర్ల గోదాం ప్రవేశద్వారం వద్ద దుండగులు సీసీ కెమెరాను ధ్వంసం చేసి లోపలికి చొరబడ్డారు. తలుపులు పగులగొట్టి 82 సిలిండర్లు ఎత్తుకెళ్లారు. గోదాం తలుపులు తెరిచి ఉండటాన్ని ఉదయం డెలివరీ బాయ్స్ చూసి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు సమాచారం ఇచ్చారు. పౌర సరఫరాల శాఖ అధికారులు, స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.లల

## నార్వే వర్క్ వీసా ఇప్పిస్తానని చెప్పి
# 35 మందిని మోసం చేసిన ప్రైవేట్ కన్సల్టెన్సీ

### విచారణకు ఆదేశించిన సీఎం ప్రజావాణి ఇంచార్జ్ చిన్నారెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 35 మంది పట్టభద్రులకు నార్వే దేశానికి వర్క్ వీసా మీద ఉపాధిని కల్పిస్తానని చెప్పి ఐ బుక్ అనే ప్రైవేట్ కన్సల్టెన్సీ మోసం చేసిందని బాధితులు మంగళవారం సీఎం ప్రవాసి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ప్రవాసి ప్రజావాణి సమన్వయకర్త బొజ్జా అమరేందర్ రెడ్డి ఈ ఫిర్యాదును కూలంకషంగా పరిశీలించి సీఎం ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ కు ఎండార్స్ మెంట్ చేసి బాధితులకు న్యాయం చేయాలని, సమగ్ర విచారణ జరపాలని సూచించారు. ఐ బుక్ కన్సల్టెంట్ ఒక్కొక్కరి నుంచి ఐదు లక్షల రూపాయల చొప్పున వసూలు చేశారని, నకిలీ వర్క్ పర్మిట్, నకిలీ నార్వే వీసా అపాయింట్మెంట్ లెటర్ ఇచ్చారని, తాము మోసపోయామని అర్థం చేసుకున్న తర్వాత కెపిహెచ్బి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా 146/2026 ద్వారా ఎఫ్ ఐ ఆర్ నమోదు అయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వచ్చిన మైనారిటీ గురుకుల నాన్ టీచింగ్ సిబ్బంది, మైనారిటీస్ గురుకుల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందికి పిఎఫ్, ఈఎస్ఐ, హెల్త్ కార్డుల సౌకర్యాలు కల్పించడంతో పాటు నిబంధనల ప్రకారం వేతనాలు పెంచాలని కోరుతూ సిబ్బంది పెద్ద ఎత్తున సీఎం ప్రజావాణికి వచ్చి ఇంచార్జ్ డాక్టర్ జీ.చిన్నారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో జరిగిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మైనార్టీ గురుకుల పాఠశాలల నాన్ టీచింగ్ సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోసం చిన్నారెడ్డిని విజ్ఞప్తి చేయగా సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో ఫోన్ లో మాట్లాడి సమస్యల పరిష్కారం కోసం చిన్నారెడ్డి కృషి చేశారు.

## జంతువులను వేటాడుతున్న ముఠా అరెస్ట్



**హైదరాబాద్, మే 5 (జనంసాక్షి):** షాద్‌నగర్, మక్తల్ అటవీ ప్రాంతాల్లో జంతువులను వేటాడి, వాటి మాంసం తింటున్న ఆరుగురు సభ్యుల ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నాలుగు ఎయిర్ గన్‌లు, రైఫిల్, 20 తూటాలు, కారు, 8 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో నలుగురు హైదరాబాద్‌కు చెందిన వారు కాగా, ఒకరు నారాయణ్‌పేట, మరొకరు జడ్చర్లకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. వీరిలో ప్రధాన నిందితుడు మహ్మద్ ముజాఫర్ హుస్సేన్.. ఈ ముఠాను ఏర్పాటు చేసినట్టు దర్యాప్తులో తేలింది. వీరంతా జింకలు, నెమళ్లు, కుందేళ్లు, పావురాలను వేటాడుతున్నట్టు గుర్తించారు. జంతువులను వేటాడుతున్న సమయంలో నిందితులు తీసుకున్న వీడియోలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఎప్పటి నుంచి జంతువులను వేటాడుతున్నారనే వివరాలను సేకరిస్తున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
6 మే 2026

# అమ్మకానికి ఆరోగ్యం - ఆస్పత్రుల్లో నోట్ల వేట

వైద్య రంగంలోని వాస్తవ పరిస్థితిని విశ్లేషిస్తే, గణాంకాల వెనుక గుండెను కలచివేసే చేదు నిజాలు కనిపిస్తున్నాయి. నేడు దేశంలో సుమారు 68% కుటుంబాలు కేవలం వైద్య ఖర్చుల భారంతోనే అప్పుల ఊబిలో కూరుకుపోతుండటం అత్యంత ఆందోళనకరమైన విషయం. ముఖ్యంగా కార్పొరేట్ ఆస్పత్రులలో సగటున ఐదు రోజుల ICU బిల్లు రూ.3.5 లక్షలకు చేరుతుండటంతో, సామాన్యుడి ప్రాణం ఖరీదైన వ్యవహారంగా మారింది. దారుణం ఏమిటంటే, సుమారు 40% శస్త్రచికిత్సలు అవసరం లేకపోయినా కేవలం వ్యాపార లాభాల కోసమే జరుగుతున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ వైద్య దోపిడీ పర్యవసానంగా, ఏటా ఒక కోటి కంటే ఎక్కువ మంది ప్రజలు తమ ఆస్తులను అమ్ముకొని, వైద్యం చేయించుకోలేక నిరుపేదలుగా మారి దారిద్ర్య రేఖకు దిగువన పడిపోతున్నారు. ఇది కేవలం ఆరోగ్య సంక్షోభం మాత్రమే కాదు, ఒక సామాజిక విపత్తుగా మారుతోంది. హైదరాబాద్‌లోని ఒక తళతళలాడే కార్పొరేట్ ఆస్పత్రి. అద్దాల మేడలు, ఖరీదైన సోఫాలు, ఏసీల చల్లదనం. కానీ అక్కడ గుండెలు మండుతున్నాయి. తన తండ్రి ప్రాణాలను కాపాడుకోవాలని ఆశగా వచ్చిన రమేష్ (పేరు మార్చబడింది), ఐదు రోజుల తర్వాత చేతికి వచ్చిన రూ.4.8 లక్షల బిల్లు చూసి నిలువునా నీరైపోయాడు. అందులో రూమ్ రెంట్ పేరుతో రూ.60,000, డాక్టర్ విజిట్ చార్జీల కింద రూ.85,000 వేశారు. దారుణం ఏమిటంటే, బయట మెడికల్ షాపులో రూ.120కి లభించే ఒక సాధారణ మందు బిళ్ళకు ఆస్పత్రి ఫార్మసీ రూ.580 వసూలు చేసింది. ఇది ఒక్క రమేష్ కథ మాత్రమే కాదు. నేడు తెలుగు రాష్ట్రాల్లోనూ, దేశవ్యాప్తంగానూ మధ్యతరగతి, సామాన్య వర్గాలు అనుభవిస్తున్న నిత్య నరకం. ఆస్పత్రికి వెళ్తే ప్రాణం నిలుస్తుందన్న నమ్మకం కంటే, ఆస్తి కరిగిపోతుందన్న భయమే ఇప్పుడు రోగిని ఎక్కువగా వేధిస్తోంది. భారతదేశంలో ప్రైవేట్ ఆరోగ్య రంగం గత రెండు దశాబ్దాల్లో ఒక ఇండస్ట్రీ గా ఎదిగింది. సాంకేతికత పెరిగింది, రోబోటిక్ సర్జరీలు వచ్చాయి, అత్యాధునిక స్కానింగ్ మిషన్లు అందుబాటులోకి వచ్చాయి. ఇవన్నీ వినడానికి అద్భుతంగా ఉన్నా, ఈ సదుపాయాలన్నీ సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుకున్నాయి. మన రాజ్యాంగం ఆరోగ్యాన్ని ఒక ప్రాథమిక హక్కుగా గుర్తించింది. కానీ నేడు ఆ హక్కును కార్పొరేట్ వ్యాపారం తన కబంధహస్తాల్లో నలిపేస్తోంది. రోగి పడకపై ప్రాణాలతో కొట్టుమిట్టాడుతుంటే, ఆస్పత్రి యజమాని కన్ను మాత్రం గిరగిర తిరిగే బిల్లింగ్ మీటర్ పైనే ఉంటుంది. NITI ఆయోగ్ నివేదికల ప్రకారం, భారతీయులు తమ ఆరోగ్య ఖర్చులలో దాదాపు 63% సొంత జేబులోంచే (Out of pocket expenditure) చెల్లిస్తున్నారు. ప్రపంచంలోనే ఇది అత్యంత దారుణమైన నిష్పత్తి. ఏటా దాదాపు 6 కోట్ల మంది కేవలం



హాస్పిటల్ బిల్లులు కట్టలేక, అప్పుల ఊబిలో కూరుకుపోయి దారిద్ర్య రేఖకు దిగువన పడిపోతున్నారు. ఇవి కేవలం అంకెలు కావు, ఛిద్రమైన వేలాది కుటుంబాల జీవిత గాథలు. ప్రైవేట్ ఆస్పత్రులు రోగిని ఆర్థికంగా పిండేయడానికి ఒక పక్కా వ్యూహంతో పనిచేస్తుంటాయి. ఇందులో ప్రధానంగా ఐదు అంశాలు గమనించాలి. ప్యాకేజీల ప్రహసనం మొదట చేర్చుకునేటప్పుడు ఒక తక్కువ ధర చెప్పి, ఆ తర్వాత అదనపు సేవలు ,కన్సల్టెంట్ చార్జీలు అంటూ బిల్లును అమాంతం పెంచేస్తారు. పరీక్షల జాతర అవసరం ఉన్నా లేకపోయినా MRI, CT స్కాన్‌లతో పాటు, ప్రతిరోజూ రక్త పరీక్షల పేరుతో వేల రూపాయలు గుంజుతారు. ఆస్పత్రిలోని ల్యాబ్‌లకు ఇచ్చే టార్గెట్లు దీనికి ప్రధాన కారణం. మందుల మాఫియా ఎంఆర్పీ ధరల పేరుతో ఆస్పత్రి ఫార్మసీలు సాగిస్తున్న దోపిడీ వర్ణనాతీతం. బయట దొరికే జనరిక్ మందులను కాదని, కమిషన్లు ఎక్కువగా వచ్చే బ్రాండెడ్ మందులనే రోగుల మీద రుద్దుతున్నారు. ICU దిగ్బంధనం రోగి కోలుకుంటున్నప్పటికీ మరో రెండు రోజులు అబ్జర్వేషన్‌లో ఉంచాలి అని చెప్పడం ద్వారా లక్షల్లో ఆదాయం పొందుతారు. ఇది నైతికతను మంటగలిపే వ్యాపార నీతి. రిఫరల్ కమీషన్లు చిన్న ఆస్పత్రుల నుండి పెద్ద ఆస్పత్రులకు రోగిని పంపడానికి ఇచ్చే కటింగ్ కూడా చివరికి రోగి బిల్లులోనే కలుస్తుంది. తెలంగాణలో జరిగిన ఒక వాస్తవ సంఘటన చూస్తే పరిస్థితి అర్థమవుతుంది. సికింద్రాబాద్‌కు చెందిన సుధారాణి తన భర్తకు అప్పెండిక్స్ ఆపరేషన్ కోసం వెళ్తే, రూ.1.2 లక్షలు అవుతుందని చెప్పారు. కానీ డిశ్చార్జ్ సమయానికి అది రూ.3.8 లక్షలకు చేరింది. ఎందుకు అని అడిగితే, ఆస్పత్రి సిబ్బంది నుండి వచ్చిన సమాధానం కోర్టుకు వెళ్ళి చూసుకోండి అని. ఇంతటి బరితెగింపు వెనుక వ్యవస్థల లోపం స్పష్టంగా కనిపిస్తోంది. మన దేశంలో ప్రైవేట్ ఆస్పత్రులను నియంత్రించడానికి జశ్రీఅఅఱఎఝశ్రీ జుఝఎశ్రీఅంష్ట్రఎవతం ా్‌చూష, 2010 వంటి బలమైన చట్టాలు ఉన్నాయి. ఇవి వైద్య సేవల నాణ్యతను, ధరలను నియంత్రించాలి. కానీ చాలా రాష్ట్రాల్లో ఈ చట్టం కాగితాలకే పరిమితమైంది. రాజకీయ బలం, కార్పొరేట్ శక్తుల ఒత్తిడి వల్ల అధికారులు తనిఖీలు చేయడానికి వెనుకాడతారు. నష్టపోయిన రోగి Consumer Protection Act కింద కోర్టుకు వెళ్ళవచ్చు. కానీ అప్పటికే ప్రాణాలను కాపాడుకోవడానికి ఆస్తులు అమ్ముకున్న వ్యక్తికి, మళ్ళీ న్యాయపోరాటం చేసే ఓపిక, డబ్బు ఎక్కడి నుండి వస్తాయి? అందుకే 95% దోపిడీ కేసులు బయటకు రాకుండానే సమాధి అయిపోతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2024లో ధరల పారదర్శకతపై కొన్ని ఆదేశాలు జారీ చేసినా, క్షేత్రస్థాయిలో అవి ఇంకా అమలు కావడం లేదు. చట్టం ఉన్నంత మాత్రాన సరిపోదు, దానిని అమలు చేసే చిత్తశుద్ధి ప్రభుత్వ యంత్రాంగంలో ఉండాలి. ఈ వ్యవస్థాత్మక దోపిడీని అరికట్టాలంటే కేవలం చట్టాలు సరిపోవు. బహుముఖ వ్యూహం అవసరం. ప్రతి ఆస్పత్రి రిసెప్షన్ వద్ద ఏ చికిత్సకు ఎంత ఖర్చవుతుందో తెలిపే బోర్డులు ఉండాలి. స్టాండర్డ్ ట్రీట్‌మెంట్ ప్రోటోకాల్ అమలు చేయాలి. రోగుల ఫిర్యాదులను 24 గంటల్లో పరిష్కరించేలా ఒక స్వతంత్ర హెల్త్ రెగ్యులేటరీ అథారిటీని ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ ఆస్పత్రులు ఎప్పుడైతే కార్పొరేట్ స్థాయి వసతులతో పనిచేస్తాయో, అప్పుడే ప్రైవేట్ ఆస్పత్రుల ఆగడాలకు అడ్డుకట్ట పడుతుంది. ప్రజలకు నమ్మకమైన ప్రత్యామ్నాయం ఉన్నప్పుడే దోపిడీ తగ్గుతుంది. ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ వంటి పథకాల కింద చికిత్స అందించేటప్పుడు ఆస్పత్రులు అదనపు వసూళ్లు చేయకుండా కఠినంగా మానిటర్ చేయాలి. వైద్య విద్యలోనే హ్యూమనిజం (మానవత్వం) గురించి ప్రత్యేక బోధనలు ఉండాలి. డాక్టర్ కేవలం యంత్రం కాదు, ప్రాణం పోసే దైవం అనే భావన పెరగాలి. పశ్చిమ బెంగాల్‌లో సామాన్య ప్రజలు ఐక్యమై రోగి హక్కుల మానిఫెస్టో ను రూపొందించారు. దాని ఫలితంగానే అక్కడ ప్రభుత్వం ప్రత్యేక రెగ్యులేటరీ కమిషన్‌ను నియమించింది. తెలుగు రాష్ట్రాల్లో కూడా అటువంటి సామాజిక ఉద్యమం రావాలి. సోషల్ మీడియాలో పోరాటాలు మాత్రమే సరిపోవు, వ్యవస్థపై ఒత్తిడి తెచ్చే చైతన్యం అవసరం. చివరగా, ఆరోగ్యం అనేది అమ్ముకునే సరుకు కాదు,అది పౌరుల ప్రాథమిక హక్కు. ఆస్పత్రికి వెళ్ళేటప్పుడు భయం భయంగా కాకుండా, హక్కుతో వెళ్ళే రోజు రావాలి. ఆస్పత్రులు రోగులను కస్టమర్లుగా కాకుండా, మనుషులుగా చూడాలి. ప్రాణం పోసే చేతులే జేబులు గుల్ల చేస్తే, సమాజం ఎటు వెళ్తున్నట్లు? ఇది ఆలోచించాల్సిన సమయం మాత్రమే కాదు, ప్రశ్నించాల్సిన సమయం కూడా. మనం మౌనంగా ఉన్నంత కాలం ఆక్సిజన్ కంటే ఎక్కువగా బిల్లింగ్ పేపర్లే బయటకు వస్తుంటాయి. మన ప్రాణానికి రేటు కట్టే హక్కు ఎవరికీ లేదు. వ్యవస్థ మేల్కొనేలా చేద్దాం, వైద్యంలో మానవత్వాన్ని కాపాడుకుందాం.

డా .సూర్యదేవర రామకృష్ణ,
9490754169

## తమిళ జన నాయగన్ దళపతి
# విజయ్ చారిత్రక విజయం

**2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు భారత రాజకీయ చరిత్రలో ఒక నూతన అధ్యాయాన్ని లిఖించాయి. సుదీర్ఘ కాలంగా డీఎంకే (DMK), ఏఐఏడీఎంకే (AIADMK) మధ్య సాగుతున్న ద్విధ్రువ రాజకీయాలకు తెరదించుతూ, తన తొలి ప్రయత్నంలోనే తమిళగ వెట్రి కళగం (TVK) అధినేత సి. జోసెఫ్ విజయ్ (దలపతి విజయ్) సంచలన విజయాన్ని నమోదు చేశారు. తమిళ నాడులో విజయ్ ప్రస్థానం, 2026 ఎన్నికల విశ్లేషణ తమిళనాడు రాజకీయాల్లో సినిమా తారల ప్రభావం కొత్తేమీ కాకపోయినా, ఎంజీఆర్ తర్వాత ఆ స్థాయిలో ప్రజల ఆదరణ పొంది, నేరుగా ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించబోతున్న ఘనత విజయ్‌కే దక్కింది. అధికార డీఎంకే కోటను బద్దలు కొట్టి, టీవీకే పార్టీ ఘనవిజయం సాధించడం వెనుక బలమైన కారణాలు ఉన్నాయి.**

**విజయ్ విజయాన్ని ఖరారు చేసిన మేనిఫెస్టో ముఖ్యాంశాలు:**

విజయ్ తన మేనిఫెస్టోలో కేవలం హామీలు మాత్రమే కాకుండా, క్షేత్రస్థాయి సమస్యలపై దృష్టి సారించారు. అవే ఆయనను యువతకు, మహిళలకు చేరువ చేశాయి. మహిళా సంక్షేమం కోసం ప్రతి నెలా మహిళలకు 2,500 రూపాయల ఆర్థిక సాయం, పెళ్లి కానుకగా 8 గ్రాముల బంగారం మరియు పట్టుచీర హామీ మహిళా ఓటర్లను విశేషంగా ఆకర్షించింది. గ్యాస్ సబ్సిడీ భాగంగా ఏడాదికి 6 గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందజేస్తామని ప్రకటించడం పేద, మధ్యతరగతి కుటుంబాలలో భరోసా నింపింది. యువతకు ఉపాధిని కల్పించడానికి తమిళనాడును ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చి లక్షలాది ఉద్యోగాల కల్పన చేస్తామన్న హామీ యువతలో ఉత్సాహం నింపింది. నీట్ (చీజుజు) రద్దు పోరాటం భాగంగా విద్యార్థుల భవిష్యత్తు కోసం నీట్ పరీక్ష రద్దుకు గట్టిగా నిలబడతామని మాటివ్వడం గ్రామీణ విద్యార్థుల మనసు గెలుచుకుంది. పాత రాజకీయ వ్యవస్థలోని అవినీతిని అంతం చేస్తానని, పారదర్శకమైన ఃన్యూ ఏజ్ః పాలిటిక్స్ తీసుకొస్తానని విజయ్ ఇచ్చిన పిలుపు సామాన్యులను కదిలించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వం లోని ఎన్డీఏ ప్రభుత్వం తలపతి విజయ్ జన నాయగన్ సినిమాని అనేక కారణాలతో విడుదల కాకుండా అడ్డుపడిన, కేంద్ర సంస్థలైన ఈడీ తో విజయ్ నీ ముప్పు తిప్పల పెట్టిన విజయ్ ఎక్కడ కూడా ఆత్మస్థైర్యం పోగొట్టుకోకుండా, తన అభిమానులు నిరుత్సాహ పడకుండా ఎన్నికల ప్రచారంలో భాగంగా కొండంత ధైర్యాన్ని నూరిపోశాడు. అందుచేత సినిమా ప్రపంచంలో జన నాయగన్ సినిమాని కేంద్ర ప్రభుత్వం అడ్డుకున్న తమిళ ప్రజల గుండెల్లో కొలువై ఉన్న జోసెఫ్ విజయ్ రాజకీయ పెను భూకంపాన్ని కేంద్ర ప్రభుత్వం ఎదురుకోలేకపోయింది. అంతేకాకుండా సంఘంలో సామాజిక రాజకీయ సాంస్కృతిక పరివర్తన కోసం కృషి చసిన రాణి వేలు నాచియార్, అంజలై అమ్మాళ్,కామరాజ్,ఇ.వి రామస్వామి పెరియార్, అంబేద్కర్ వంటి మహనీయులని స్ఫూర్తిగా తీసుకొని వారి ఆశలమేరకు పనిచేస్తానని తమిళ ప్రజలని బలంగా నమ్మించగలిగాడు. 75 ఏళ్ల క్రితం డీఎంకే పార్టీ సాంస్కృతిక పునాదులకి అభిముఖంగా రెండు సంవత్సరాల క్రితం పార్టీ ఏర్పాటు చేసిన దళపతి విజయ్ తమిళ వేట్రీ కజగం పార్టీ కూడా మహనీయుల సిద్ధాంత మార్గంలోని తన సాంస్కృతిక రాజకీయ ప్రయాణం ఉంటుందని తమిళ ప్రజలనే కాదు యావత్ భారతీయుని నమ్మించ గలిగాడు. ఇది విజయ్ లోని గుణగణాలకి నీతినిబద్ధతకి నిజాయితీగల నాయకత్వానికి నిదర్శనంగా చూడాలి.

**డీఎంకే ఓటమికి ప్రధాన కారణాలు:**

అధికారంలో ఉన్న డీఎంకే పార్టీ ఈ ఎన్నికల్లో వెనుకబడటానికి అనే క కారణాలు విశ్లేషకులు చెబుతున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత ఐదేళ్ల పాలనలో కొన్ని హామీలు నెరవేర్చకపోవడం, నిత్యావసర ధరల పెరుగుదల ప్రజల్లో అసంతృప్తిని పెంచింది. వారసత్వ రాజకీయా లపై విరక్తి పెరిగి, ఉదయనిధి స్టాలిన్ ఎదుగుదల మరియు కుటుంబ పెత్తనంపై కొంతమంది ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు. ఇది విజయ్ వంటి కొత్త నాయకుడికి కలిసొచ్చింది.

విజయ్ మాస్ అప్పీల్ ఏంటి అంటే విజయ్‌కి ఉన్న భారీ ఫ్యాన్ బేస్ కేవలం సినిమాకే పరిమితం కాకుండా, ఒక సైన్యంలా పనిచేసింది. డీఎంకే కేడర్ కంటే టీవీకే కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుగ్గా వ్యవహరించారు. ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ స్వయంగా తన సొంత నియోజకవర్గం కొల్తూర్‌లో టీవీకే అభ్యర్థి చేతిలో ఓడిపోవ డం డీఎంకే పతనానికి పరాకాష్టగా నిలిచింది. ఇది మాత్రమే కాకుండా కీలకమైన అంశాలు ఏంటంటే 75 ఏళ్ల డీఎంకే పార్టీ చరిత్రలో కరుణానిధి మరణ అనంతరం పెరియార్, అన్నదొరై పేర్లకు మాత్రమే ప్రాముఖ్యత ఇచ్చి అంబేద్కర్ కి గౌరవ సామాజిక విలువని ఇవ్వకపోవడం, ఎన్నికల సందర్భంగా ఓట్ల కోసం మాత్రమే అంబే ద్కర్ నామస్మరణ చేయడంతో దళితుల ఓట్లు చీలి, దళిత హీరో ఐన తలపతి విజయ్ వైపు మొగ్గు చూపారు, నిరుద్యోగ యువతలో ఉన్న ప్రభుత్వ వ్యతిరేకత విజయ్ గుణగణాలకి, నీతి నిబద్ధతకి ఆకర్షితులను చేసి డీఎంకే పార్టీ ఘోర ఓటమికి ముఖ్యమైన కారణంగా సామాజిక రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**నవ తమిళనాడు దిశగా అడుగులు:**

విజయ్ విజయం తమిళనాడు రాజకీయాల్లో ఒక సరికొత్త మార్పుకు సంకేతం. కుల, మత రాజకీయాలకు అతీతంగా తమిళులే మన బలం అనే నినాదంతో ఆయన ముందుకు సాగారు. సంప్రదాయ రాజకీయ పార్టీల వ్యూహాలను తిప్పికొట్టి, సామాన్యుడి గొంతుకగా మారడం వల్లే ఈ అద్భుత విజయం సాధ్యమైంది. అంతిమంగా తమిళనాడు ప్రజలు మార్పును కోరుకున్నారని ఈ తీర్పు స్పష్టం చేస్తోంది. డీఎంకే, ఏఐఏడీఎంకే వంటి దిగ్గజ పార్టీలను కాదని ఒక సినీ నటుడికి పట్టం కట్టడం అనేది సామాన్య విషయం కాదు. ఇప్పుడు అందరి దృష్టి విజయ్ పైన, ఆయన అందించబోయే ఃవెట్రిః (విజయం) పాలనపైన ఉంది. అయితే తమిళనాడులో ఎక్కువ సీట్లు సాధించిన లార్జెస్ట్ పార్టీగా టీవీకే అవతరించగా, DMK 60 సీట్లతో రెండవ స్థానాన్ని, AIADMK 47 సీట్లతో మూడవ స్థానంలో ఉండగా, కాంగ్రెస్ ఐదు సీట్లు గెలుచుకుంది. లోకల్ పార్టీ లు సింగిల్ డిజిట్స్ గెలుచుకున్నాయి అయితే కాంగ్రెస్ లేదా లోకల్ పార్టీలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం దలపతి విజయ్ కి కష్టతరం కాదు అనే విధంగా రాజకీయ ఫలితాలు ఉన్నాయి. తమిళనాడులో దళపతి విజయ్ అతి తక్కువ కాలం నుండి ప్రభుత్వాన్ని సింగిల్ గా ఏర్పాటు చేసేలా ప్రభావం చూపిస్తాడని రాజకీయ విశ్లేషకులు మేధావులు కూడా ఊహించలేదు కానీ తమిళనాడులో ఇలాంటి ఆశ్చర్యకరమైన రాజకీయ ప్రక్షాళన జరగడం తమిళనాడులో కొత్తేమీ కాదు, 75 ఏళ్ల స్వాతంత్ర భారతంలో ప్రాంతీయ పార్టీలైన డీఎంకే, అన్న డీఎంకే పాలన చూసి తమిళ ప్రజలు విసుగెత్తిపోయారు. అంతేకాకుండా తమిళనాడులో అక్షరాస్యత శతం ఎక్కువగా ఉండటం వల్ల నేటి జంజి జనరేషన్ కి చెందిన యువత కుల మత పార్టీలకతీతంగా టీవీకె పార్టీ విజయ్ నాయకత్వ గుణగణాలు చూసి అతి స్వల్ప కాలంలోనే విజయ్ ద్వారా తమిళనాడులో గొప్ప సామాజిక రాజకీయ పరివర్తన జరగాలని భావించినట్లుగా తాజా రాజకీయ ఫలితాలు నిరూపణ చేస్తున్నాయి.

పుల్లెంల గణేష్ (సోషల్, పొలిటికల్ ఏనాలిస్ట్)
9553041549

# తిరిగి రాయలేని చరిత్ర ఎన్టీఆర్... నేటి ప్రభంజనం దళపతి!

భారతీయ రాజకీయ రంగం అనేది ఒక చదరంగం లాంటిది. ఇందులో ప్రతి ఒక్కరూ పావులు కదిపే ప్రయత్నం చేస్తారు. కానీ ఆటను మలుపు తిప్పి చరిత్రను తిరిగి రాయడం మాత్రం కొద్దిమందికే సాధ్యం. సినిమా గ్లామర్ రాజకీయాల్లో ఒక శక్తివంతమైన ఆయుధం అనిపించినప్పటికీ, అది ఒక్కటే విజయానికి చాలు కాదు. నాయకత్వం, ప్రజలతో అనుబంధం, సామాజిక బాధ్యత-ఇవి కలిసినప్పుడే నిజమైన రాజకీయ శక్తి అవతరిస్తుంది.

ఈ నేపథ్యంలో, నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) సృష్టించిన చరిత్రాత్మక ప్రభంజనం, నేటి తరంలో దళపతి విజయ్ సాధిస్తున్న రాజకీయ ప్రయాణం-ఈ రెండూ నాయకత్వ స్వభావాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి.

**ఎన్టీఆర్ - ఒక యుగాన్ని మార్చిన మహానాయకుడు**

ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో ఎన్టీఆర్ పేరు ఒక వ్యక్తి పేరు మాత్రమే కాదు-ఒక విప్లవం. ఆయన రాజకీయాల్లోకి అడుగుపెట్టిన క్షణం నుంచి ప్రజాస్వామ్యానికి కొత్త అర్థం వచ్చింది. రాజకీయాలు అంటే కొద్దిమంది ఉన్నత వర్గాలకే పరిమితమన్న భావనను ఆయన పూర్తిగా చెరిపేశారు. సామాన్య ప్రజల దగ్గరకు రాజకీయాలను తీసుకెళ్లి, "మనమూ పాలనలో భాగమే" అనే ఆత్మవిశ్వాసాన్ని నింపిన నాయకుడు ఎన్టీఆర్. 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించి, కేవలం తొమ్మిది నెలల్లోనే రాష్ట్రవ్యాప్తంగా విపరీతమైన ప్రజా మద్దతు సంపాదించడం ఆయన అసాధారణ నాయకత్వానికి నిదర్శనం. "చైతన్య రథం" పై వేల కిలోమీటర్లు పర్యటిస్తూ ప్రజల్లో చైతన్యం రగిలించారు.

1983 ఎన్నికల్లో కాంగ్రెస్ ఆధిపత్యాన్ని కూలదోసి, తొలిసారిగా ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం భారతీయ రాజకీయాల్లో ఒక మైలురాయి. తరువాతి ఎన్నికల్లో కూడా వరుస విజయాలతో ఆయన ప్రజల విశ్వాసాన్ని మరింత బలపరిచారు. ఎన్టీఆర్ ప్రయాణం కేవలం రాజకీయ విజయాలకే పరిమితం కాదు-అది



తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక.

**సినిమా గ్లామర్ జం రాజకీయ స్థిరత్వం**

ఎన్టీఆర్ తరువాత చాలా మంది సినీ తారలు రాజకీయాల్లోకి వచ్చారు. కానీ వారిలో చాలా మందికి ఆయనలాంటి ప్రభావం చూపడం సాధ్యపడలేదు. ఇది ఒక ముఖ్యమైన సత్యాన్ని తెలియజేస్తుంది-గ్లామర్ ఓటు తెచ్చిపెట్టవచ్చు, కానీ విశ్వాసాన్ని మాత్రం సంపాదించాలి. రాజకీయాల్లో నిలదొక్కుకోవాలంటే ప్రజల సమస్యలపై అవగాహన, దీర్ఘకాలిక దృష్టి, సేవా భావం అవసరం. ఇవి లేకపోతే, ఎంతటి స్టార్ ఇమేజ్ ఉన్నా అది నిలవదు.

**నేటి ప్రభంజనం - దళపతి విజయ్**

తమిళనాడులో దళపతి విజయ్ రాజకీయ ప్రవేశం ఒక కొత్త చర్చకు దారితీసింది. యువతలో ఆయనకు ఉన్న విపరీతమైన ఆదరణ, సామాజిక అంశాలపై ఆయన చూపుతున్న చైతన్యం-ఇవి ఆయన రాజకీయ భవిష్యత్తుకు బలం ఇస్తున్నాయి. విజయ్ ప్రయాణం ఇంకా ప్రారంభ దశలో ఉన్నప్పటికీ, ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు, ప్రజలతో కలిసిపోవాలనే ప్రయత్నం గమనార్హం. అయితే, ఎన్టీఆర్ స్థాయికి చేరుకోవడం అనేది ఒకపెద్ద సవాలు. ఎందుకంటే,

ఎన్టీఆర్ ఒక యుగాన్ని మార్చాడు
ప్రజాస్వామ్యాన్ని సామాన్యుడి దగ్గరకు తీసుకెళ్లాడు
తన నాయకత్వంతో వ్యవస్థను మార్చాడు
విజయ్ కూడా ఇలాంటి మార్పును తీసుకురాగలడా? అన్నది కాలమే చెప్పాలి.

**నాయకత్వం అంటే ఏమిటి?**

- ఎన్టీఆర్ నుంచి మనం నేర్చుకోవాల్సిన ముఖ్యమైన పాఠాలు:
- ప్రజలతో నేరుగా సంబంధం ఉండాలి
- మాటలకు కట్టుబడి ఉండాలి
- సంకల్పం స్పష్టంగా ఉండాలి
- వ్యవస్థను మార్చే ధైర్యం ఉండాలి
- నాయకత్వం అంటే కేవలం అధికారంలో ఉండటం కాదు-
- ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడం.


ఎన్టీఆర్ సృష్టించిన చరిత్ర తిరిగి రాయడం సులభం కాదు. ఆయన ఒక నాయకుడు కాదు-ఒక భావోద్వేగం, ఒక ఆత్మగౌరవం.

నేటి తరంలో దళపతి విజయ్ వంటి నాయకులు ఆ మార్గంలో నడవడానికి ప్రయత్నిస్తున్నారు. కానీ చరిత్రను మళ్లీ రాయాలంటే, ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించాలి. రాజకీయాల్లో గెలుపు ఓటులతో వస్తుంది... కానీ చరిత్రలో నిలిచేది విశ్వాసంతోనే.

రచయిత:
నసుబోలు రాజశేఖర్
హెచ్.ఓ.డి, అసోసియేట్ ప్రొఫెసర్
ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్
శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాల,
తాడేపల్లిగూడం
9885739808 / 8330969808



# రాజకీయమొక గాలి దుమారం



## ప్రజాస్వామ్య వ్యవస్థలో వికృత ధోరణులు!

రాజకీయమొక గాలి దుమారం అనే మీ వ్యాఖ్య సామాన్య భావోద్వేగం కాదు, అది సమాజపు లోతైన అనుభవాల ప్రతిధ్వని. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయాలు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే సాధనంగా ఉండాలి, కానీ అనేక సందర్భాల్లో అవి రంకుల బేరంగా మారి నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయి. అధికార పోరాటం కేవలం సేవా ధోరణి ఆధారంగా కాకుండా ప్రయోజనాల ఆధారంగా సాగినప్పుడు రాజకీయ రంగం బొంకుల బోనంగా కనిపిస్తుంది. ఒకప్పుడు సిద్ధాంతాలపై నిలిచిన పార్టీల మధ్య పోటీ ఇప్పుడు వ్యక్తిగత విమర్శలు, అపనిందలు, ద్వేష ప్రచారాలుగా మారుతున్నది. ఓడలు బండ్లు, బండ్లు ఓడలు అన్నట్లు పరిస్థితులు తారుమారవుతున్నాయి, కానీ ఈ మార్పు ప్రజా ప్రయోజనాల దిశగా కాకుండా అధికార కేంద్రీకరణ దిశగా సాగుతోంది. పాలక పార్టీలు తమ వైఫల్యాలను క్షాలణ యంత్రంలా శుభ్రం చేసుకోవడానికి రంగులు మార్చే హంగుల తంత్రాలను వినియోగిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రజాస్వామ్యం రూపకల్పనలో ఉన్న అసలు ఆత్మ కనిపించకుండా పోతుంది. ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన నాయకులు ప్రచార యంత్రాలుగా మారినప్పుడు పాలనలో నాణ్యత తగ్గిపోతుంది. రాజకీయమొక గాలి దుమారం అన్న భావన ప్రజల నిరాశను ప్రతిబింబిస్తుంది. ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికల ప్రక్రియతో పరిమితం కాకుండా బాధ్యతాయుత పాలనగా మారాలి. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో అది అధికారం కోసం జరిగే పోటీగా మారినట్లు కనిపిస్తుంది. ఈ పరిణామం ప్రజాస్వామ్యానికి ప్రమాద సంకేతం. ప్రజల భాగస్వామ్యం తగ్గితే వ్యవస్థ బలహీనమవుతుంది. అందుకే ఈ పరిస్థితులను లోతుగా విశ్లేషించడం అవసరం.

ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయాల ప్రధాన లక్ష్యం ప్రజల సంక్షేమం కావాలి, కానీ ధన, విభజన, భజన అనే మూడు అంశాలు ప్రధానంగా మారినప్పుడు సురాజకీయం దూరమవుతుంది. డబ్బు ప్రభావం ఎన్నికలపై అధికంగా పెరిగినప్పుడు సామాన్య అభ్యర్థులకు అవకాశాలు తగ్గిపోతాయి. ఎన్నికలు ఖర్చుతో కూడిన ప్రక్రియగా మారినప్పుడు ప్రజాస్వామ్యం ధనిక వర్గాల ఆధీనంలోకి వెళ్లే ప్రమాదం ఉంది. విభజన రాజకీయాలు కుల, మత, ప్రాంత ఆధారంగా ప్రజలను విడదీసి ఓట్ల కోసం వినియోగిస్తున్నాయి. అవగాహన లేని ఓటు ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తుంది. ప్రజలు రాజకీయాలపై విశ్వాసం కోల్పోతే ఎన్నికల ప్రక్రియపై ఆసక్తి తగ్గుతుంది. ఇది ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకర పరిస్థితి. ప్రజల భాగస్వామ్యం లేకుండా ప్రజాస్వామ్యం ఖాళీ నిర్మాణంగా మారుతుంది. రాజకీయ నాయకులు సేవా భావంతో పనిచేయాలి, కానీ స్వార్థ ప్రయోజనాలు పెరిగినప్పుడు వ్యవస్థ దెబ్బతింటుంది. ప్రజాస్వామ్యం బలపడాలంటే పారదర్శకత అవసరం. బాధ్యతాయుత నాయకత్వం లేకపోతే వ్యవస్థలో అవినీతి పెరుగుతుంది. అవినీతి పెరిగితే అభివృద్ధి నిలిచిపోతుంది. ఈ పరిస్థితుల్లో ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతింటాయి. అందుకే రాజకీయ వ్యవస్థలో సంస్కరణలు అత్యవసరం.

సురాజకీయం సాధ్యమవ్వాలంటే ప్రజలు చైతన్యవంతులుగా మారాలి, నాయకులు నైతిక విలువలను పాటించాలి, సంస్థలు స్వతంత్రంగా పనిచేయాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలో విద్య కీలక పాత్ర పోషిస్తుంది, ఎందుకంటే అవగాహన ఉన్న పౌరులు సరైన నిర్ణయాలు తీసుకోగలరు. ఓటు హక్కు కేవలం హక్కు మాత్రమే కాదు, అది బాధ్యత కూడా. ప్రజలు వ్యక్తిగత ప్రయోజనాల కంటే సామాజిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఓటు వేయాలి. రాజకీయ పార్టీలు సిద్ధాంతాల ఆధారంగా పనిచేయాలి, వ్యక్తి ఆధారిత రాజకీయాలను తగ్గించాలి. పారదర్శక విధానాలు అమలు చేయాలి, ప్రజలతో ప్రత్యక్ష సంభాషణ పెంచాలి. అవినీతి నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలి. మీడియా స్వతంత్రంగా పనిచేయాలి, నిజ సమాచారాన్ని ప్రజలకు అందించాలి. న్యాయ వ్యవస్థ బలంగా ఉండాలి, రాజకీయ ప్రభావానికి లోనుకాకూడదు. ప్రజాస్వామ్యం బలపడాలంటే అన్ని వ్యవస్థలు సమన్వయంతో పనిచేయాలి. ప్రజల సమస్యలు పరిష్కరించడం ప్రభుత్వ ప్రధాన కర్తవ్యం కావాలి. సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు కావాలి. అభివృద్ధి సమానంగా పంచబడాలి. సామాజిక న్యాయం సాధించాలి. రాజకీయాల్లో యువత భాగస్వామ్యం పెరగాలి. నైతిక విలువలు తిరిగి స్థాపించాలి. ప్రజల విశ్వాసం తిరిగి పొందాలి. అప్పుడే రాజకీయమొక గాలి దుమారం అనే భావన మారి ప్రజాస్వామ్యం నిజమైన సురాజకీయంగా మారుతుంది.

ఇలాంటి పరిస్థితుల్లో ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది అయిన నమ్మకం తిరిగి స్థాపించాల్సిన అవసరం అత్యంత కీలకంగా మారుతుంది. రాజకీయ నాయకత్వం ప్రజల సేవకు ప్రతిబింబంగా నిలవాల్సిన సమయంలో అది అధికారం కేంద్రీకరణకు సాధనంగా మారితే వ్యవస్థపై విశ్వాసం క్షీణిస్తుంది. ప్రజలు రాజకీయాలను కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే గుర్తు చేసుకునే స్థితి ఏర్పడితే అది ప్రజాస్వామ్యానికి ముప్పు. ప్రజల జీవితాల్లో ప్రతిరోజూ ప్రభావం చూపే నిర్ణయాలు తీసుకునే వ్యవస్థగా రాజకీయాలు మారాలి. కానీ ప్రస్తుతం అవి ప్రచార కార్యక్రమాల చుట్టూ తిరిగే ప్రక్రియగా కనిపిస్తున్నాయి. ప్రజల అవసరాలు, సమస్యలు, ఆశలు అన్నీ పక్కనపెట్టి రాజకీయాలు వ్యక్తిగత ప్రతిష్ట పోటీగా మారడం వల్ల సమాజంలో అసంతృప్తి పెరుగుతోంది. ఈ చక్రం కొనసాగుతూ ఉంటే సమాజంలో అసమానతలు మరింత పెరుగుతాయి. అందువల్ల ప్రజాస్వామ్య వ్యవస్థలో సంస్కరణలు కేవలం చట్టపరమైన మార్పులతోనే సాధ్యం కాదు, అది మనసుల మార్పుతో కూడి ఉండాలి. ప్రజలు తమ హక్కులను మాత్రమే కాకుండా బాధ్యతలను కూడా గుర్తించాలి. ఓటు వేయడం ఒక సాధారణ ప్రక్రియ కాదు, అది భవిష్యత్తును నిర్ణయించే శక్తి. సురాజకీయం ఒక కలగా కాకుండా వాస్తవంగా మారుతుంది. ప్రజలు రాజకీయాలను అనుమానంతో కాకుండా విశ్వాసంతో చూడగలిగే పరిస్థితి ఏర్పడుతుంది. ఇదే నిజమైన ప్రజాస్వామ్య విజయం.

ముగింపుగా పరిశీలించినప్పుడు ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థలో వచ్చిన మార్పులను సమగ్రంగా అర్థం చేసుకోవాలంటే చారిత్రక ప్రయాణాన్ని గమనించడం అవసరం. 1947 తర్వాత భారతదేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ స్థాపనతో ప్రజలకు అధికారం అందించినప్పటికీ, 1950 రాజ్యాంగ అమలుతో అది సంస్థాగత రూపం దాల్చింది. మొదటి దశలో సుమారు 70% ప్రజలు రాజకీయాలపై విశ్వాసం కలిగి ఉన్నారని అనేక అధ్యయనాలు సూచించాయి. కానీ కాలక్రమేణా ఈ విశ్వాసం 1990 నాటికి 55% వరకు తగ్గిందని విశ్లేషణలు తెలియజేస్తున్నాయి. 2000 తర్వాత ఆర్థిక సంస్కరణల ప్రభావంతో రాజకీయాల్లో ధన ప్రభావం పెరిగి ఎన్నికల ఖర్చులు 300% వరకు పెరిగినట్లు అంచనాలు ఉన్నాయి. ప్రజల భాగస్వామ్యం పెరిగితేనే వ్యవస్థ బలపడుతుంది. అవగాహన పెంపు కార్యక్రమాలు 50% కంటే ఎక్కువ ప్రజలకు చేరినప్పుడు మాత్రమే నిజమైన మార్పు కనిపిస్తుంది. ఎన్నికల సంస్కరణలు అమలు చేసిన దేశాల్లో 30% వరకు అవినీతి తగ్గినట్లు అంతర్జాతీయ అధ్యయనాలు సూచిస్తున్నాయి. భారతదేశంలో కూడా ఇలాంటి సంస్కరణలు అమలు చేస్తే రాజకీయ వ్యవస్థలో మార్పు సాధ్యమే. ప్రజలలో నైతిక విలువలు పెరిగితే రాజకీయాల్లో కూడా అవి ప్రతిబింబిస్తాయి. నాయకులు పారదర్శకతను పాటిస్తే ప్రజల విశ్వాసం తిరిగి పెరుగుతుంది. 2030 నాటికి ప్రజాస్వామ్య వ్యవస్థపై విశ్వాసం 80% వరకు పెరగాలంటే ఇప్పటి నుంచే చర్యలు అవసరం. ఈ లక్ష్యాన్ని సాధించడానికి ప్రభుత్వం, సంస్థలు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలి. అప్పుడే రాజకీయమొక గాలి దుమారం అనే విమర్శ తగ్గి ప్రజాస్వామ్యం స్థిరమైన మార్గంలో నడుస్తుంది.

ప్రజాస్వామ్య వ్యవస్థలో సురాజకీయం సాధించాలంటే భవిష్యత్ దిశలో స్పష్టమైన కార్యాచరణ అవసరం. 2025 నుండి 2040 వరకు కాలాన్ని కీలక మార్పుల దశగా పరిగణిస్తే, ఈ సమయంలో తీసుకునే నిర్ణయాలు వ్యవస్థ భవిష్యత్తును నిర్ణయిస్తాయి. విద్యా రంగంలో పౌర విద్యను 100% స్థాయిలో అమలు చేయడం ద్వారా యువతలో అవగాహన పెంచాలి. మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని కనీసం 50% వరకు పెంచడం ద్వారా సమానత్వం సాధ్యమవుతుంది. యువత రాజకీయాల్లో పాల్గొనడం 60% వరకు పెరిగితే కొత్త ఆలోచనలు ముందుకు వస్తాయి. సాంకేతికత వినియోగం ద్వారా ప్రభుత్వ సేవలను 95% వరకు డిజిటల్ చేయడం ద్వారా పారదర్శకత పెరుగుతుంది. అవినీతి నియంత్రణ చర్యలను కఠినంగా అమలు చేస్తే 40% వరకు తగ్గుదల సాధ్యమవుతుంది. ప్రజల అభిప్రాయాలను సేకరించే విధానాలను బలోపేతం చేస్తే పాలనలో ప్రజల పాత్ర పెరుగుతుంది. ఈ మార్పులు అమలు అయినప్పుడు ప్రజాస్వామ్య వ్యవస్థలో స్థిరత్వం పెరుగుతుంది. రాజకీయాలు వ్యక్తిగత ప్రయోజనాల కంటే సామాజిక ప్రయోజనాల దిశగా మారుతాయి. ప్రజలు నాయకులను ప్రశ్నించే ధైర్యం పెరుగుతుంది. నాయకులు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తారు. ఈ విధంగా ప్రజాస్వామ్యం ఒక జీవంతమైన వ్యవస్థగా మారుతుంది. సురాజకీయం ఒక సిద్ధాంతంగా కాకుండా వాస్తవంగా నిలుస్తుంది. రాజకీయమొక గాలి దుమారం అనే విమర్శ క్రమంగా తగ్గి ప్రజాస్వామ్యం ప్రజల ఆశయాలను ప్రతిబింబించే వ్యవస్థగా మారుతుంది. ఇదే నిజమైన ప్రజాస్వామ్య పరిపూర్ణతకు దారి చూపే మార్గం.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# ప్రతిరోజు ఒక వార్డు ఓ విప్లవాత్మక అడుగు

- సిఎంసి కమిషనర్ సృజన



**శేరిలింగంపల్లి, మే 5 (జనంసాక్షి) :** ప్రతిరోజు ఒక వార్డు' అనే కార్యక్రమం ఒక విప్లవాత్మకమైన అడుగుగా... వినూత్న కార్యక్రమంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన అభివర్ణించారు. ఈ మేరకు మంగళవారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ స్థానిక నివాసితులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో ముఖాముఖి చర్చించి పౌర సదుపాయాల స్థితిగతులను సమీక్షించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ప్రతిరోజు వాడు కార్యక్రమం 7వ రోజున కొనసాగుతుందని, ఇందులో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ శేరిలింగంపల్లి జోన్ పరిధి శేరిలింగంపల్లి సర్కిల్ గచ్చిబౌలి డివిజన్ లో కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. కాగా మణికొండ చెరువు కలుషితం అవుతుండటంపై పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. చెరువు చుట్టూ అభివృద్ధి పనులతో పాటు, సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్(ఎస్టిపి) సౌకర్యాలను ఏర్పాటుచేసి దీర్ఘకాలిక పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని తనను కోరడం జరిగిందని, సంబంధిత అధికారులకు తగు చర్యల నిమిత్తం పలు సూచనలు చేసినట్లు కమిషనర్ వివరించారు. కార్యక్రమంలో భాగంగా గచ్చిబౌలి డివిజన్ పరిధిలో గుర్తించిన ఖాళీ స్థలాలను అన్ని వసతులతో కూడిన పార్కులుగా అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని సీనియర్ సిటిజన్స్ తన దృష్టికి తేవడం జరిగిందని, తప్పకుండా వాటి విషయంలో మంచి ఫలితాలు ఉంటాయని కమిషనర్ సృజన మీడియాకు వెల్లడించారు. ఎస్ఎన్డిపి ఫేజ్-2 కింద పెండింగ్‌లో ఉన్న వర్షపు నీటి కాలువల విషయంలో అనుసరించవలసిన విధానాల గురించి సీఎం సి కమిషనర్ అధికారులతో చర్చించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని తమ ప్రాంతానికి సమస్యలు రాకుండా నిర్దిష్టమైన ప్రణాళికల ద్వారా ముందస్తు చర్యలు గైకొనాలని కాలనీవాసులు కమిషనర్ దృష్టికి తీసుకొని రాగా సంబంధిత అధికారులకు ఆదేశాలను జారీ చేశారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలో అడ్డగోలుగా వెలుస్తున్న ప్రైవేట్ నిర్మాణాల వల్ల రహదారి స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని, దీనివల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని ఆయా కాలనీవాసులు సూచించగా కచ్చితంగా వాటిపై సమగ్ర సమీక్షను నిర్వహించి అక్కడ ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటానని వారికి హామీని ఇచ్చారు. ప్రతి ఒక్కరూ ఇంటి నుండి బయటకు వచ్చే చెత్తను సేగ్రిగేషన్ చేయాలని, కాలనీలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఓవైపు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కు సహకరించడంతోపాటు పరోక్షంగా వారి ఆరోగ్యాన్ని వారు మెరుగుపరచుకున్నట్లు అవుతుందని ఈ సందర్భంగా కమిషనర్ పేర్కొన్నారు. జనగణన-2026 కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, తద్వారా దేశం నిర్మాణంలో తమ వంతు పాత్రను నిర్వహించాల్సిన ఆవశ్యకతను ఎత్తి చూపారు.

## అమృత్ 2.0 పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలి

- అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్



**వనపర్తి బ్యూరో, మే 5 (జనంసాక్షి) :** అమృత్ 2.0 పనుల నాణ్యత, వేగం, మరియు సమయపాలనపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖిమ్యా నాయక్ ఆదేశించారు. మంగళవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖిమ్యా నాయక్ వనపర్తి మున్సిపాలిటీ మరియు కొత్తకోట మున్సిపాలిటీలలో అమృత్ 2.0 పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఆయన సమీక్షించారు.పనుల నాణ్యత, వేగం, మరియు సమయపాలనపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.అదనంగా, పనుల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రతి దశలో పర్యవేక్షణ పెంచాలని అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశాలు ఇచ్చారు. మున్సిపాలిటీ ఛైర్పర్సన్ మాధవి, కమీషనర్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ప్రణాళిక

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- జలమండలి అధికారులతో సమీక్ష



**పటాన్‌చెరు, మే 5 (జనంసాక్షి) :** ప్రస్తుత వేసవి కాలంలో కాలనీలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని.. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితులను సమీక్షించాలని జలమండలి అధికారులకు పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సూచించారు. మంగళవారం సాయంత్రం పటాన్చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో అమీన్పూర్ సర్కిల్, పటాన్చెరు సర్కిల్ జలమండలి అధికారులతో తాగునీటి పంపిణీ పై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఆటంకాలు లేకుండా తాగునీరు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. సరిపడ నీరు అందించలేని పక్షంలో నూతన బోర్లు వేయడంతో పాటు.. ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని ఆదేశించారు. నూతన కాలనీలకు సైతం మంచినీటి సరఫరా అందించేందుకు పైపులైన్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఇప్పటికే ఈ అంశంపై జలమండలి అండి అశోక్ రెడ్డితో సైతం చర్చించడం జరిగిందని గుర్తు చేశారు. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సరఫరా తీరుపై సమీక్షించాలని కోరారు. మంచినీటి పంపిణీ పై ప్రజల నుండి ఫిర్యాదులు తలెత్తకుండా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. ప్రధానంగా నీటి కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించి, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని తెలిపారు. పాడైన బోర్లు, పైపులైన్‌ల మరమ్మతులు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు అధికారులు స్పందిస్తూ..ఇప్పటికే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. అవసరమైన చోట కొత్త బోర్లు త్రవ్వడం, నిల్వ ట్యాంకుల శుభ్రపరిచే పనులు చేపడుతున్నామని వివరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జలమండలి డీజీఎం లు శివకుమార్, శ్రీనివాసరావు, మేనేజర్లు ప్రవీణ్, శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి

- రైతులు సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలి
- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, మే 5 (జనంసాక్షి) :** రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, రైతులకు ప్రభుత్వం అన్ని విధాల చేయూతనిస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. మంగళవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాస్త్రవేత్తలతో కలిసి చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య మఖ్య అతిథిగా హాజరైననారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరం తరం కృషి చేస్తుందన్నారు. రైతులు ఉద్యాన శాఖ అందిస్తున్న సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయిల్ ఫామ్ సాగు చేసుకునేందుకు రైతులు ముందుకు రావాలని సూచించారు. అయిల్ ఫామ్ సాగు చేసుకోవడంతో రైతులకు ప్రభుత్వం భారీగా సబ్సిడీలను అందిస్తూ ప్రోత్సహిస్తుందన్నారు. రైతులకు ప్రభుత్వం రైతుబంధు పథకం అందిస్తుందని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతులకు పెద్దపీట వేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, చేవేళ్ల ఆర్టీవో పార్టసింహారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగాంటి మధుసూధన్ రెడ్డి, జిల్లా ఎడిహెచ్ కిషన్ రావు, చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య, చేవెళ్ల ఏడీఏ సురేష్బాబు, ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు జ్యోతి, సంతోషిని, కృష్ణవేణి, చేవెళ్ల ఉద్యాన అధికారిణి కీర్తి, మున్సిపల్ చైర్పర్సన్లు సమతావెంకటట్ రెడ్డి, సాత ప్రవీణ్ కుమార్, శాబాద్ సోనియాదర్శన్, మార్కెట్ చైర్మెన్లు పెంటయ్యగౌడ్, పిసరి సురేందర్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారి ఆగి రెడ్డి, మల్గారి జనార్దన్ రెడ్డి, ఏవోలు శంకర్ లాల్, ఏఈవోలు, సర్పంచ్ లు మాధవి రామ్ రెడ్డి, లోంక శ్రీనివాస్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, పడాల ప్రభాకర్, మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, టేకులపల్లి శ్రీనివాస్, నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల రైతులు తదితరులు ఉన్నారు.

## పేదల సొంతింటి కల నెరవేరుస్తున్న ప్రజా ప్రభుత్వం



**సదాశివపేట, మే 5 (జనం సాక్షి) :** నిరుపేద కుటుంబాల సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. సదాశివపేట మండలంలోని మెలిగిరి పేట, వెంకటాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నూతన గృహ ప్రవేశ ప్రారంభోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న టీజీ ఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి కు బ్యాండు భజంత్రీలతో పెద్ద ఎత్తున స్వాగతం పలికారు.నిర్మల జగ్గారెడ్డి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇండ్లకు కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ తాము జీవితంలో ఇండ్లు కట్టుకుంటామని అనే ఊహించుకోలేకపోయామని కాంగ్రెస్ ప్రభుత్వంలో మాకు ఇల్లు ఇచ్చి స్వయంగా టీజీఐఐసీ చైర్మన్ గృహ ప్రారంభోత్సవానికి తమ ఇంటికి వచ్చి అండగా ఉన్నందుకు జీవితాంతం రుణపడి ఉంటామని అన్నారు. అనంతరం నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ పేదల బతుకులు మారాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ వస్తుందని తెలిపారు. గ్రామంలోని ఇండ్లు లేని వారందరికీ విడతల వారీగా ఇండ్లు వస్తాయని ఎవరు అధైర్య పడద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ గడిల రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చాట్ల సిద్ధన్న,మండల అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్,గ్రామ సర్పంచ్ షాబుద్దీన్,ఆయా గ్రామాల సర్పంచులు కలాలి మోహన్, నాయికోటి లావణ్య మధు, మల్లికార్జున్ పటేల్, ఇందూరి భారతమ్మ బాబు, ఉప సర్పంచు యాదయ్య,వార్డు సభ్యులు,మార్కెట్ కమిటీ డైరెక్టర్ మధుకర్ రెడ్డి,నాయకులు, కార్యకర్తలు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## పంపిణీ చేసిన డబల్ బెడ్‌రూమ్ ఇండ్లు వెనక్కి తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం
- భారతీయ జనతా పార్టీ నేతలు



తాండూరు, మే 5 (జనంసాక్షి) : తాండూరు పట్టణ పెద ప్రజలకు అన్యాయం చేయాలని చూస్తన్న సంస్థ వ్యక్తులపై డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల విషయమై తాండూరు బిజెపి నాయకులు వికారాబాద్ కలెక్టర్ నిమర్యాద పూర్వకంగా కలిశారు.గతమూడురోజు క్రితం తాండూరు పట్టణంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఒక ప్రైవేట్ సంస్థకు ప్రత్యేకంగా ఒక్క మైనార్టీ వర్గానికి ఇవ్వడం చట్ట రిత్యా నేరం. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ నేతలు మాట్లాడుతూ తాండూరు పట్టణ ప్రజలందరూ అయోమయానికి గురయ్యారు. కాబట్టి వెంటనే ఇచ్చినటువంటి డబల్ బెడ్ రూమ్ ఇండ్లు వెనక్కి తీసుకొని ఆ సంస్థపై వెంటనే చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా , జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సాహూ శ్రీలత , జిల్లా దిశా నెంబర్ అంతారం లలిత, తాండూరు బిజెపి పట్టణ అధ్యక్షులు ఫ్లోర్ లీడర్ 28వ వార్డు కౌన్సిలర్ నాగారం మల్లేశం, జిల్లా కార్యదర్శి బండారం భద్రేశ్వర్, 33వ వార్డ్ కౌన్సిలర్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు బండారు శ్రీకాంత్, పట్టణ ఉపాధ్యక్షుడు దోమ కృష్ణ తదితరులు ఉన్నారు.

## ఉపాధిహామీ కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలి



**మల్దకల్, మే 5 (జనంసాక్షి) :** తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ సమావేశం మంగళవారము మల్దకల్ మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ జి నర్సింలు మాట్లాడుతూ 100 రోజులు పని చేస్తున్న 300 మంది కూలి కార్మికులు దగ్గరకు వెళ్లి కూలి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడగగా వారు ఈ విధంగా మాట్లాడారు పనిచేస్తున్న పని ప్రదేశమునందు ఓఆర్ఎస్ ప్యాకెట్లు ప్రథమ చికిత్స బాక్స్ పనిచేస్తున్న వారికి పని సామాగ్రి పారా గడపార గంప మొదలగునవి సామాగ్రి తో పాటు నీడ వేసుకోవడానికి టెంటు,నీళు త్రాగడానికి నీళ్లు దొరకపోవడం లేదని ఆయన ఆరోపించారు.నీటి దాహం వలన పొద్దున వెళ్లి సాయంత్రం మూడు గంటల వరకు నీళ్లు త్రాగకుండగా గొంతు ఎండిపోయిన కడుపు తిప్పల కోసం పనిచేయవలసి వస్తుంది పనిచేసిన కూలి డబ్బులు ఇంతవరకు రాలేదు మొబైల్ మానిటరింగ్ ఫోటో క్యాప్చర్ విధానం వలన ఒక్క వ్యక్తి ఫోటో క్యాప్చర్ చేయడానికి కన్ను రెప్పలు సుమారుగా 100కు పైసార్లు కన్నీరెప్పలు కొడితే సెలెక్ట్ కావచ్చు కాకపోవచ్చు కానీ నిలబడి కన్నీరెప్పలు కొడుతుంటే పనిచేసే అలిసిపోయినా కూర్చోడానికి కూడా వీలు లేకుండా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం ఆయన ఆరోపించారు.ఒక వ్యక్తికి ఒక రోజు కూలి 8 పే కమిషన్ ఆధారంగా 920 రూపాయలు ఇవ్వాలి,ఆర్థిక సంవత్సరములో వ్యక్తికి 200 రోజులు పని చేసుకునే జాబ్ కార్డు ఇచ్చి పని కల్పించాలి, పనిచేసిన వేతనాలు 15 రోజుల్లోపే వేతనాలు రావాలి కూలీలకు ప్రమాద బీమా సౌకర్యం తక్షణమే 500000 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## మతాల ఐక్యతను చాటేదే దర్గా

- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ఫరూక్‌నగర్, మే 5 (జనం సాక్షి) :** మతాల ఐక్యతను చాటుకు అందరినీ ఒకే మార్గంలో ఆధ్యాత్మికత వైపు నడిపించేవే దర్గాలు అని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఉప్పరిగడ్డ సర్పంచ్ చందు నాయక్ ఆధ్వర్యంలో దర్గాలో జరిగిన ఉర్సు ఉత్సవాలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్సు ఉత్సవాల ద్వారా అందరికీ మంచి జరగాలని, అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని తాను కోరుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఇద్రీస్, చించోడు అనంతం తదితరులు పాల్గొన్నారు.



# ఆటో, ప్రైవేట్ రవాణా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**ముషీరాబాద్, మే 5 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోని ఆటో, ప్రైవేట్ రవాణా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఆటో, ప్రైవేట్ రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో అన్ని సంఘాలను కలుపుకొని రాష్ట్ర రవాణా బంద్ చేస్తామని సీఎం రేవంత్ ప్రభుత్వానికి బిపిటియంయం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి హెచ్చరిక చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్, ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద తెలంగాణ ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ సర్కార్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు బిపిటియంయం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి, ఉపాధ్యక్షులు తెలంగాణ ప్రబారి గీత సోని , ఆటో టాక్స్ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి పెంటయ్య గౌడ్, టిఎస్ పి టి యం,యం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే శ్రీధర్ రెడ్డి, ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చింతల నందకిషోర్, పి టి ఎం ఎం రాష్ట్ర అధ్యక్షులు లిఖిత్ కుమార్ క్యాబ్ యూనియన్ నాయకులు మీనా,పలువురు యూనియన్ నాయకులు హాజరై మద్దతు తెలిపి మాట్లాడారు. ఈసందర్భంగా రవిశంకర్ అల్లూరి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో డ్రైవర్ల సంక్షేమ విషయంలో హామీలు ఇచ్చి అధికారం చేపట్టాక డ్రైవర్లకు ఇచ్చిన హామీలను మరిచిన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో అస్తవ్యస్త పరిపాలన కొనసాగిస్తుందన్నారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణ వలన ఉపాధి దెబ్బతిన్న ఆటో డ్రైవర్లు ఆర్థిక స్థితి బాగోలేక తమ కుటుంబాలను పోషించుకోలేక తమ ప్రాణలను కోల్పోతుంటే సాక్షాత్తు రవాణా శాఖ మంత్రి చోద్యం చూస్తుంటే ఇటు ముఖ్యమంత్రి ధృతరాష్ట్రుని పాలనకొనసాగిస్తున్నారని అన్నారు. ఓలా ఉబర్ ర్యాపిడో,అక్రమ బైక్ ల వలన అసలే ఆటోలు నడవక డ్రైవర్లు బాధపడుతుంటే తన స్వలాభం కొరకు కొత్త పర్మిట్లు విడుదల చేసి కోట్ల రూపాయలు బ్లాక్ మార్కెట్ కు తేరలేపిన రవాణా శాఖ అధికారులపై అక్రమ ఫైనాన్సర్ల పై చర్యలు శూన్యం సరి కదా అసలు లబ్ధిదారులకు ఆటోలు అందకపోవడం అనేది అన్యాయమన్నారు. ఇక గూడ్స్ వాహనాల డ్రైవర్ల ఉపాధిని దెబ్బతీస్తూ వారి శ్రమను దోపిడీ చేసే పోర్టర్, మువేర్, బ్లోహార్న్, అంకుల్ డెలివరీ ఇలాంటి యాప్ ల పై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. రెడ్ అంబులెన్స్ కార్పొరేట్ కంపెనీ అంబులెన్స్ డ్రైవర్ల ఉపాధి దెబ్బతీస్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆటో డ్రైవర్లకు ఏటా 12 వేలు ఇస్తానని చెప్పి మిస్మరించిన ముఖ్యమంత్రి ప్రైవేట్ రవాణా కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పి మోసం చేశారని పైగా ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకునే విధంగా తన విధానాలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 12 వేలు ఇవ్వాల్సి వస్తుందని రాష్ట్రంలో ఆటో లైసెన్స్ ఎత్తివేసిన మోసగాళ్లు సీఎం రేవంత్ రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే గద్దె దిగాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పోలీస్, ఆర్టీవో అధికారులు చలనాలు అధికంగా వసూలు చేసే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. పార్కింగ్ సౌకర్యం కల్పించడం లేదని, ఉన్న పార్కింగ్ స్థలాలు కబ్జాకు సాక్షాత్తు ప్రభుత్వ అధికారుల అనుమతి ఇవ్వడం అని ఇటువంటి చర్యలు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. జాతీయ ఉపాధ్యక్షురాలు తెలంగాణ ప్రభారి గీతా సోని మాట్లాడుతూ డ్రైవర్ల ముక్కు పిండి చలనాలు వసూలు చేసే ప్రభుత్వాలు రైల్వే స్టేషన్, విమానాశ్రయాల్లో, బస్టాండ్స్ లో ఆటో టాక్సులకు పార్కింగ్ సౌకర్యం కల్పించడంలో విఫలమయని, పార్కింగ్ కల్పిస్తే అక్కడ కూడా వేల రూపాయల దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ప్రైవేట్ ఫైనాన్సర్లు ఆర్థికంగా దోచుకునే వ్యవస్థ పెట్టుబడిదారుల దోపిడీ ను తలపిస్తుందని ఆరోపించారు. ఆటో కనీసం మీటర్ రేటు 50 చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. అధికారపక్షం ప్రతిపక్షం రాజకీయం చేస్తూ డ్రైవర్లను పావులుగా వాడుకుంటున్నారని ఈ పరిస్థితి మారుస్తామని ఇద్దరికీ బుద్ధి చెప్పే రోజు ప్రారంభమైందన్నారు. రాష్ట్రంలో ఉన్న ఆటో డ్రైవర్లు రాజకీయ పార్టీల ఉచ్చులో పడకుండా స్వతంత్రంగా పోరాడి హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. స్టేట్ ఆటో టాక్సీ డ్రైవర్స్ యూనియన్ నాయకులు బి.పెంటయ్య గౌడ్,లిఖిత్ కుమార్ శ్రీధర్ రెడ్డి హబీబ్ మాట్లాడుతూ రాష్ట్రంలో స్థలాలు అప్పనంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం సరికాదన్నారు. హైదరాబాద్ తో పాటు ఇతర నగరాలలో ఆటో నగరాలలో,రవాణా కార్మికుల ఉపయోగం కోసం ట్రాక్, బస్ పార్కింగ్ కొరకు మాత్రమే వాడాలని, డ్రైవర్ల కొరకు మంచినీటి సౌకర్యం సబ్సిడీ క్యాంటీన్, విశ్రాంతి గృహాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ ఆటో యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి అశ్విన్ రాజు, మినీ గూడ్స్ వెహికల్ యూనియన్ శ్రీనివాస్, జహంగీర్, ఆర్ మహేష్, అంబులెన్స్ యూనియన్ నాయకులు సంతోష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- రైతులు వేచి ఉండకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి
- లారీలు,గన్నీ సంచులు సమృద్ధిగా అందుబాటులో ఉండాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల నడిగడ్డ, మే 5 (జనం సాక్షి) :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. మంగళవారం గద్వాల మండలంలోని చెనుగోనుపల్లి, అనంతపురం 1, బసల్ చెరువు ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. కేంద్రాల్లో ధాన్యం నిల్వలు అధికంగా ఉండి,లారీలు తక్కువగా ఉండటం వలన కొనుగోలు ప్రక్రియ ఆలస్యమై రైతులు చాలా రోజుల పాటు వేచి ఉండాల్సి వస్తున్నదని గమనించిన కలెక్టర్, అవసరమైన మేరకు అదనపు లారీలు ఏర్పాటు చేసి వెంటనే మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కేంద్రంకు రోజుకు కనీసం నాలుగు లారీలు పంపించి రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యమును సంబంధిత మిల్లులకు తరలించాలన్నారు. రైతులు ఎండలో ఎక్కువసేపు వేచి ఉండకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధాన్యం ఎక్కువగా వచ్చిన కేంద్రాలకు



ప్రాధాన్యత ఇచ్చి, సమీప మిల్లులకు పంపడం ద్వారా సమయం ఆదా అవుతుందన్నారు. ప్రతి కేంద్రానికి నిర్దిష్టంగా సమీపంలోని మిల్లులను కేటాయించి, అధికారిక ఆదేశాల ప్రకారం మాత్రమే కొనుగోలు చేసిన ధాన్యమును లారీల్లో తరలించాలన్నారు. గన్నీ సంచుల కొరతపై స్పందించిన కలెక్టర్ పాత, దెబ్బతిన్న సంచులను వాడకుండా కొత్త గన్నీలు వెంటనే సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కేంద్రాల వారీగా అవసరాన్ని అంచనా వేసి సరిపడా గన్నీలను పంపిణీ చేయాలని సూచించారు. కేంద్రాల్లోనీ రిజిస్టర్లలో రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలు, మిల్లులకు రవాణా చేసిన వివరాలు, ఫోన్ నంబర్లు, తదితర తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. ప్రతి రోజూ కేంద్రంలో ఉన్న ధాన్యం నిల్వలు, తేమ శాతం వచ్చిన పరిమాణం, పంపిన లోడ్ల వివరాలను నమోదు చేసి అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఏమైనా సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే వాట్సాప్ గ్రూపుల ద్వారా తెలియజేసి సంబంధిత ఉన్నతాధికారులతో తక్షణ పరిష్కారం పొందాలని ఆయా కేంద్రాల ఇన్చార్జిలకు, అధికారులకు సూచించారు. ఆయా కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన ధాన్యం వర్షం పడితే తడవకుండా సాయంత్రం ఇంటికి వెళ్లే ముందు టార్పాలెన్స్ కప్పి వెళ్లాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల పనితీరును సంబంధిత అధికారులు తరచూ పర్యవేక్షణ చేస్తూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే, అవకతవకలకు పాల్పడితే సంబంధిత కేంద్రాల ఇన్చార్జిలు, అధికారులపై తగు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు. అనంతపురం కొనుగోలు కేంద్రం సమీపంలో ఉన్న రైతువేదికలో ఉంచిన గన్ని సంచులు, టార్పాలెన్స్, తదితర కలెక్టర్ పరిశీలించారు. అలాగే ఆయా కేంద్రాల వద్ద ఆరబెట్టిన ధాన్యంను, లారీల్లో మిల్లులకు తరలిస్తున్న ధాన్యం బస్తాలను పరిశీలించి సంబంధిత రైతులతో మాట్లాడారు.ఈ తనిఖీలో డిఆర్డిఏ ఏపీడి శ్రీనివాస్, డిపిఎం అరుణ, ఏఈఓ లు ఉషశ్రీ, రవి, ఇతర అధికారులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకతతో సంక్షేమ పథకాల అమలు..

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్‌చెరు, మే 5 (జనం సాక్షి) :** అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల అందిస్తూ పూర్తి పారదర్శక పాలన అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్చెరు లోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. రామచంద్రాపురం, పటాన్చెరు, అమీన్పూర్ రెవెన్యూ మండలాల పరిధిలోని 226 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు ఆడపిల్ల పెళ్లి భారం కాకూడదన్న సమున్నత లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ అని విప్లవాత్మక పథకాన్ని పెట్టారని గుర్తు చేశారు. పటాన్చెరు నియోజకవర్గం వ్యాప్తంగా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు తొలి ప్రాధాన్యత ఇస్తూ ప్రజల ఆర్థిక అభ్యున్నతికి పాటుపడుతున్నట్లు తెలిపారు.. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయంపై రైతులందరూ దృష్టి సారించాలి

- రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు




**వెల్దుర్తి, మే 5 (జనం సాక్షి) :** సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని శాస్త్రవేత్తలు మహదేవప్ప మరియు పుష్పవల్లి, అన్నారు మంగళవారం రోజున వెల్దుర్తి మండలంలోని హస్తాల్పూర్ గ్రామంలో రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు సలహాలు చెబుతూ ముఖ్యంగా పచ్చి రొట్టె, జీలుగా పొలంలో నాటినట్టయితే భూసారం పెరుగుతుందని అలాగే పంట వైవిధ్దీకరణ, పురుగుల మందులు ఎంత మోతాదులో వాడుకోవాలి మరియు వరి కూరగాయల విత్తన శుద్ధి వేపాదాయుతశలు, డ్రం సీడర్ విధానం, డ్రిప్పు సాగు ద్వారా నీటి సంరక్షణ లాంటి ఎన్నో విషయాల ద్వారా సేంద్రీయ వ్యవసాయంపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నరసింహ రెడ్డి తో పాటు ఏవో ఝాన్సీ ఏఈఓ సాయికిరణ్ మరియు రైతులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలి

- తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

**ఊర్కోండ, మే 5 (జనం సాక్షి) :** ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయడంతో పాటు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని , గ్రామాల్లో నీటి సమస్యలు లేకుండా చూడాలని,పరిశుభ్రత, పచ్చదనం పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ పేర్కొన్నారు. మంగళవారం రోజు ఉదయం ఊర్కొండ మండల పరిధిలోని ఉరుకొండపేట, ముచ్చర్లపల్లి గ్రామాలను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. నిర్మాణాల పురోగతి, నాణ్యత, ప్రభుత్వ నిబంధనల అమలు తదితర అంశాలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడిన కలెక్టర్, ప్రభుత్వం అందించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సొంత ఇంటి కలను నిజం చేసుకోవాలని సూచించారు. పనులను ఆలస్యం చేయకుండా వేగంగా పూర్తి చేయాలని, నిర్మాణంలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే స్థానిక అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన బిల్లులను దశల వారీగా ఆధార్ లింక్ చేసిన



బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారులు త్వరగా గృహప్రవేశాలు చేసుకోవాలని కూడా కలెక్టర్ సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించిన కలెక్టర్, చెత్త నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి వసతులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, అందుకు ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ప్రతి గ్రామం పరిశుభ్రంగా, పచ్చదనంతో కళకళలాడేలా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో చెత్త పేరుకుపోకుండా క్రమం తప్పకుండా శుభ్రపరిచే కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజల్లో కూడా పరిశుభ్రతపై అవగాహన పెంచాలని సూచించారు. ఊరుకొండ పేట లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. అక్కడే క్రీడాకారులతో కాసేపు ముచ్చటించారు. ముచ్చర్లపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్‌కు అక్కడి గ్రామస్తులు పలు సమస్యలను వివరించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల లోపం, మరమ్మత్తుల అవసరం వంటి అంశాలను ఆయన దృష్టికి తీసుకురాగా, వాటిపై వెంటనే స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశిస్తూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. అంతకుముందు గ్రామ సందర్శనలో భాగంగా ఊరుకొండపేటలోని ఆంజనేయ స్వామి ఆలయాన్ని కలెక్టర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, హౌసింగ్ పీడి సంగప్ప, తాహసిల్దార్ యూసుఫ్ అలీ, ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి, మండల స్థాయి వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు అబ్దుల్ రషీద్, మ్యాకల మంజుల శ్రీనివాసులు, వినీత ధర్మేందర్ రెడ్డి,ఉప సర్పంచ్ రేపాని శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

- ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం పెంచాలి
- జిల్లా కలెక్టర్ సీహెచ్. ప్రియాంక

**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 5 (జనం సాక్షి) :** జిల్లాలోని రైతులు ప్రత్యా మ్నాయ పంటల పై దృష్టి సారించేలా అధికారులు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక సూచించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖలు ఇస్తున్న సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.మంగళ వారం జిల్లా కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్ లో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధ్వర్యంలో రైతు వారం (మే 4 నుంచి 9 వరకు) ఉద్యాన పంటల సాగు - ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం పెంపుదల పై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ముందుగా కొంతమంది రైతులు పండించిన కూరగాయలు,పండ్లు, ఆయిల్ ఫామ్ గింజలు, వ్యవసాయానికి ఉపయోగించే వివిధ రకాల యంత్రాల ప్రదర్శనను ఆమె తిలకించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ లో అన్ని శాఖల కార్యకలాపాలను రీ ఫ్రెష్ చేసుకోవాలని తెలిపారు. ఖమ్మం లో రైతులు ఎక్కువగా ఆయిల్ ఫామ్ తోటలను చేస్తారని,తాను అక్కడ విధులు నిర్వహించానని చెప్పారు.మన జిల్లా లో అసక్తి గల రైతులను ఖమ్మం తీసుకువెళ్ళి ఆయిల్ ఫామ్ సాగు ను క్షేత్ర స్థాయిలో




పరిశీలన చేయించాలని తెలిపారు.ఆయిల్ ఫామ్, ఇతర పంటలను చిన్న సన్న కారు రైతులు కూడా పండించాలని ఆమె కోరారు. ప్రస్తుతం జిల్లాలో 206 ఎకరాలలో ఆయిల్ ఫామ్ తోటల సాగు చేస్తున్నారని,10 వేల ఎకరాల్లో సాగు చేస్తే మన జిల్లాలోనే ఫ్యాక్టరీ పెట్టాలని ప్రభుత్వాన్ని కోరడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్, వైస్ చైర్ పర్సన్ మంజుల, మార్కెట్ కమిటీ చైర్మన్ సదా శివారెడ్డి, ఉద్యాన శాఖ అధికారి సాయి బాబా, డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ జయ చంద్రమోహన్, మండల స్థాయి ఉద్యాన శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

- అంగన్వాడి వ్యవస్థ బలోపేతానికి కృషి
- అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ
- దివ్యాంగులకు ఉచిత స్కూటీలు
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**సంగారెడ్డి ప్రతినిధి, మే 5 (జనం సాక్షి) :** అన్ని వర్గాల ప్రజల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మంగళవారం జిల్లా మహిళా, శిశు , దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జోగిపేట-ఆందోల్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంల మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాబోయే రోజుల్లో అన్ని అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంగన్వాడీ టీచర్లు, సూపర్వైజర్లు, ఆయాలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎక్కడైనా నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కనబడితే ప్రభుత్వం ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. అదేవిధంగా, అంగన్వాడీ టీచర్లు, ఆయాల ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని మంత్రి



తెలిపారు. ప్రజలకు ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఈ కార్యక్రమంలో మంత్రి 10 మంది దివ్యాంగులకు ఉచిత స్కూటీలు, 286 మంది అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి లలిత కుమారి, సిడిపిఓలు, అంగన్వాడీ సూపర్వైజర్లు, టీచర్లు, దివ్యాంగులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు

**చేర్యాల, మే 5 (జనంసాక్షి) :** వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయని, దానికి అనుగుణంగా రైతులు ముందుకు వెళ్లి ఆర్థికంగా అబివృద్ధి చెందాలని రాంపూర్ సర్పంచ్ శెట్టె కొమురయ్య, ఆకునూరు సర్పంచ్ కొమ్ము రవి, కాశగుడిశెల సర్పంచ్ షేక్ ఆసియా బేగం అఖిల్ పిలుపునిచ్చారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక, 99 రోజుల ప్రణాళికలో భాగంగా మండలంలోని ఆకునూర్, రాంపూర్, కాశగుడిసెల గ్రామాలకు వ్యవసాయ విస్తరణ అధికారి పూజ తో కలిసి రైతు వేదికలో రైతులకు వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేల ఆరోగ్య పరిరక్షణపై సాయిల్ హెల్త్ కార్డ్ పంపిణీ చేస్తామన్నారు. ఎరువుల వినియోగం, పంట విక్రయం కొరకు, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ది కొరకు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి అన్నారు. వ్యవసాయంలో కేవలం వరి పంట మాత్రమే కాదని ప్రత్యామ్నాయ పంటల సాగువైపు రైతులు వెళ్లి వాణిజ్య పంటలు సైతం సాగు చేసుకోవచ్చని ఆమె సూచించారు. పంట సాగు విషయంలో రైతులు జాగ్రత్తతో వ్యవహరించి నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోని తదనుగుణంగా నారుమడులను సిద్ధం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## రైతులను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం

- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

**మెదక్, మే 5 (జనం సాక్షి) :** 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని మాయ గార్డెన్ లో ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, అధ్యక్షతన నిర్వహించిన ఉద్యానవన పంటల సాగు, ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం పెరుగుదల, ప్రత్యామ్నాయ పంటల సాగు పై అవగాహన సదస్సు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ , వివిధ ప్రజాప్రతినిధులు అధికారులు రైతులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ,రాష్ట్ర గేయాలపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతులను అన్ని విధాల ఆదుకుంటుందని అన్ని రకాల సబ్సిడీలు ఆర్థిక, ఆధునిక సాంకేతిక రంగంలో నూతన పద్ధతుల ద్వారా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరిచే దిశగా రైతులకు మేలు చేసే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటుంది అన్నారు. రైతులు ప్రయత్నం చేయక పోతే భవిష్యత్తులో భూమి మొత్తం నిస్సార మవుతుందని,తక్కువ పెట్టుబడి తో ఎక్కువ పంటలు పండించేలా రైతులు ముందుకెళ్లాలని, ఆర్గానిక్ పంటల సాగు పై రైతులు ద్రుష్టి పెట్టాలన్నారు.భూములను రక్షించి ప్రకృతి వ్యవసాయం చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయం, పై అవగాహనా కలిపించు కోవాలన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ... ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా రైతు వారోత్సవాల కార్యక్రమాలను జిల్లాలో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని, ఒకే పంట కాకుండా పంటల మార్పిడి చేయాలన్నారు. ఒకే పంటతో జరిగిన నష్టాన్ని అధికారులు రైతులకు వివరించాలన్నారు. పండ్లు కూరగాయలు పూలు లతో ఆయిల్ పామ్ పంటలను కూడా పండించడం ద్వారా అధిక లాభాలను అర్జించవచ్చని తెలిపారు. ఆయిల్ ఫామ్ పంటలో ఇతర పంటలను కూడా పండించవచ్చని, కోతుల బెడద నుండి పంటలను కాపాడడానికి ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు మాట్లాడుతూ రైతుల బాగు కోరి ఆయిల్ ఫామ్ పంటను రాష్ట్ర ప్రభుత్వం పరిచయం చేసిందన్నారు ఈ పరిచయం దినదినాభివృద్ధి చెందుతూ. మన జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు



చేసేందుకు రైతులు మొగ్గుచూపుతున్నారు అన్నారు.రైతులు ప్రస్తుతం ఉన్న పంటలే కాకుండా ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపుతూ అభివృద్ధి దిశగా ముందుకు పోవాలన్నారు అంతర్ పంటలు వేస్తూ ఆయిల్ ఫామ్ సాగు చేస్తే లాభాలు బేశరతుగా ఉంటాయని ఈ సందర్భంగా వెల్లడించారు. మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ మాట్లాడుతూ రైతే దేశానికి వెన్నుముక అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని ప్రత్యామ్నాయ ఇతర పంటలపై రైతులు మొగ్గు చూపుతూ సాగు చేస్తూ అధిక లాభాలు ఆర్జించాలని తెలిపారు. అంతకుముందు శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు.

# తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ రూరల్, మే 5 (జనంసాక్షి) :** ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరం లో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తాగునీటి అంశంపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ఎవరికి ఎట్టి పరిస్థితుల్లో తాగునీటి కొరత రాకూడదని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు అంతా గతంలో నీటి సమస్య ఏర్పడిన ప్రాంతాలను గుర్తించి,నీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రోజువారి నీటి సరఫరా లో ఆటంకాలు ఎదురైతే,సమస్యలు తీర్చేందుకు తగు ప్రత్యామ్నాయ మార్గాలను ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అలాగే కడెం ప్రాజెక్టు అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రాజెక్టు గేట్ల మరమ్మత్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వేసవికాలం పూర్తయ్యేలోపు గేట్లకు సంబంధించి ఏవైనా చిన్న చిన్న మరమ్మత్తులు ఉంటే పూర్తి చేయాలని తెలిపారు. ఇప్పటినుంచి గేట్ల మరమ్మత్తుల చర్యలు పూర్తిచేస్తే వర్షాకాలం ఎటువంటి ఇబ్బంది కలగదని తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సందీప్,ఇరిగేషన్ అధికారులు,ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం

- ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్ర ఆగ్రహం



**నిర్మల్, మే 5 (జనంసాక్షి) :** జిల్లా వ్యాప్తంగా యాసంగి వరి ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగడంపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. జిల్లాలో అకాల వర్షాల భయంతో రైతులు కల్లాల వద్ద పడిగాపులు కాస్తుంటే, అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని తెలంగాణ రాష్ట్ర ఆమ్ ఆద్మీ పార్టీ జాయింట్ సెక్రటరీ, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హైదర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.జిల్లా వ్యాప్తంగా 295 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పిన ప్రభుత్వం, ఇప్పటివరకు కేవలం 168 కేంద్రాలను మాత్రమే ప్రారంభించింది. మిగిలిన 127 కేంద్రాలను వెంటనే ప్రారంభించి, రైతుల కష్టాలను తీర్చాలని అన్నారు. హమాలీల కొరత, కూలీల సమస్య, తేమ పేరుతో రైతులను మోసం చేయవద్దని అన్నారు.

# భద్రకాళి బండ్ ప్రారంభించిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ



- పాల్గొన్న ఎమ్మెల్యేలు, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, నగర మేయర్, కార్పొరేటర్లు

వరంగల్ బ్యూరో, మే 05 (జనం సాక్షి)

రూ. 84.20 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో నిర్మించిన వరంగల్ భద్రకాళి ట్యాంక్ బండ్ ను, అలాగే రాణి రుద్రమా ఐరన్ విగ్రహాన్ని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రివర్యులు, జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సంయుక్తంగా ప్రారంభించారు. ఒకపక్క భద్రకాళి దేవాలయం, విశాలమైన చెరువు, పద్మాక్షి, సిద్దేశ్వరుల కొండలు ఇవన్నీ భద్రకాళి బండ్ పర్యాటకానికి వన్నెతెచ్చేలా ఉన్నాయి. నగర ప్రజలు కుటుంబాలతో కలసి అనందించడానికి ఇవన్నీ దోహద పడుతాయి. నగరానికి మణిహారంలా ఉన్న భద్రకాళి బండ్ ప్రజలకు అందుబాటులోకి తీసుక రావడం ఆనందంగా ఉందని మంత్రులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె. ఆర్. నాగరాజు,నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హనుమకొండ కలెక్టర్ మరియు ఇంచార్జ్ మున్సిపల్ కమిషనర్ చాహత్ వాజ్పాయ్ తో పాటు స్థానిక 11,28,30 డివిజన్ల కార్పొరేటర్లు విజయలక్ష్మి, గందె కల్పన, కోమల ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మంచిర్యాల సంక్షేమ శాఖ కార్యాలయంలో ఏసీబీ అధికారుల సోదాలు

- పలు అవకతవకలు జరిగినట్లు నిర్ధారించిన ఏసీబీ అధికారులు



**మంచిర్యాల ప్రతినిధి, మే 5 (జనంసాక్షి) :** మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏసీబీ అధికారుల ఆకస్మిక సోదాలు జరిపారు .అదిలాబాద్ ఏసీబీ అధికారి మధు నేతృత్వంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ సమీకృత భవన సముదాయంలోని సంక్షేమ శాఖ కార్యాలయంలో ఏసీబీ అధికారులు అకస్మిక తనిఖీలు చేపట్టారు .కార్యాలయంలోని పలు రికార్డులను క్షుణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీబీ అదిలాబాద్ డిఎస్పి మధు మాట్లాడుతూ.... ఆఫీసులో అవకతరకలు జరుగుతున్నట్లు వచ్చిన ఫిర్యాదులో భాగంగానే సంక్షేమ శాఖ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు .కొన్ని అవకతవకలను గుర్తించినట్లు ఆయన తెలిపారు .క్యాష్ బుక్ రికార్డులను 2024 నుండి రికార్డులు నమోదు చేయడం లేదని తెలిపారు అలాగే సంక్షేమ శాఖలో వికలాంగులకు కోసం వచ్చిన త్రీ వీలర్స్ వాహనాలను పంపిణీ చేయలేదని పేర్కొన్నారు. ఆడిట్ రికార్డులను కూడా పూర్తి చేయలేదని పేర్కొన్నారు పూర్తిస్థాయి విచారణ అనంతరం సంబంధిత అధికారులకు విచారణ నివేదిక అందజేస్తామని తెలిపారు.

# కాంగ్రెస్ మోసాలను ప్రజలకు తెలిపేందుకే రైతు సదస్సు

- రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చని కాంగ్రెస్
- బీఆర్ఎస్ నేతలు బండా ప్రకాష్, దయాకర్ రావు, వినోద్, వినయ్ భాస్కర్



**హనుమకొండ ప్రతినిధి, మే 5 (జనంసాక్షి) :** రైతుల విషయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు అన్నింటిని విస్మరించిందని, రైతులను గాలికి వదిలివేసిందని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ఆరోపించారు.హంటర్ రోడ్ రైతు సంగ్రామ సదస్సు వేదిక వద్ద మంగళవారం బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ హయాంలో వ్యవసాయం పండుగగా మారిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దండగ గా మారిందన్నారు. రాష్ట్రంలో రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతోందన్నారు. రైతు సంగ్రామ సదస్సు కు పోటీగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు మేళాలు ఏర్పాటు చేశారన్నారు, తమ సదస్సుకు అనేక అవరోధాలు అడ్డంకులు సృష్టించారన్నారు. అవగాహన లేని కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ గురించి మాట్లాడుతున్నారన్నారు. రైతులకు మద్దతుగా సదస్సు పెడుతుంటే మా కార్యకర్తలు కట్టిన పార్టీ తోరణాలు, ఫ్లెక్సీలు తొలగిస్తున్నారన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం బీఆర్ఎస్ పోరాడిందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో వ్యవసాయం పండుగలా మారి 3 లక్షల కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందన్నారు. కేసీఆర్ రైతులను రాజు చేయాలని చూశారన్నారు. రైతుల విషయంలో కాంగ్రెస్ హామీల అమలు అన్ని విస్మరించిందన్నారు. రాష్ట్రంలో పంటల కొనుగోళ్లు లేవని మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ ఆరోపించారు. రైతుల కోసమే రైతు సంగ్రామ నిర్వహిస్తున్నామని దీనికి కేటీఆర్ హాజరవుతున్నారని అన్నారు. మాజీ మంత్రి దయాకర్ రావు మాట్లాడుతూ తెలంగాణ రైతుల గోసను ప్రపంచానికి తెలియజేసేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. మాజీ ఎంపీ వినోద్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికల సమయంలో రైతు డిక్లరేషన్ లో ఇచ్చిన హామీలు గుర్తు చేసేందుకే నిర్వహిస్తున్నామన్నారు. కేసీఆర్ రైతు బంధు పథకాన్ని కేంద్రం, మోడీ సర్కార్ పీఎం కిసాన్ పథకంగా అమలు చేస్తున్నారన్నారు. కేసీఆర్ పథకాలను కేంద్రం ఇప్పటికే అమలు చేస్తోందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాల అమలు విస్మరించారన్నారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఆ హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యం చేసిందన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు ప్రజలు వివరిస్తున్నామన్నారు.ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు మాట్లాడుతూ రైతు సంగ్రామ సదస్సు రేపు ఉదయం 9 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం రైతుల పంటలను కొనుగోలు చేయడం లేదన్నారు.మాజీ శాసనసభ్యుల నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ రైతుల సదస్సును విజయవంతంగానిర్వహిస్తామన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని నాయకులను అరెస్ట్ చేసి సదస్సును కార్యక్రమాన్ని ఫెయిల్ చేయాలని చూస్తున్నారన్నారు. ఏది ఏమైనా సదస్సు నిర్వహించి తీరుతామన్నారు. మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ కేసీఆర్ రైతు పక్షపాతి అన్నారు. రైతులకు కేసీఆర్ ఎంతో చేశారన్నారు. నాడు కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ సమయంలో తాను రాహుల్ గాంధీ పాల్గొన్నానన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ ఉపముఖ్యమంత్రి టి. రాజయ్య, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్,నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవ రెడ్డి,వాసుదేవ రెడ్డి, హరిరమదేవి, సాంబారి సమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

# పంట మార్పిడి చేస్తూ నూతన వంగడాలపై దృష్టి పెట్టాలి

- ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



**భైంసా, మే 05 (జనం సాక్షి) :** రైతులు పంట మార్పిడి చేస్తూ నూతన వంగడాలపై దృష్టి పెట్టాలని,అయిల్ ఫామ్ పంటను వేసి అధిక లాభాలు సాధించాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సూచించారు.మంగళవారం భైంసాలోని శ్రీ బంకెట్ హాల్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు వారోత్సవ కార్యక్రమానికి అయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అయిల్ ఫామ్ పంట వేయాలని రైతులను ప్రోత్సహిస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీని సద్వినియోగం చేసుకొని పంట వేయాల్సిందిగా సూచించారు.. నియోజకవర్గం లో ప్రస్తుతం 4200 ఎకరాల్లో రైతులు పంటను వేశారని, పంట వేసినప్పటినుండి మూడు సంవత్సరాల వరకు అంతర పంటలు వేసుకోవచ్చాన్నారు. 20 వేల ఎకరాల వరకు వరకు పంట వేస్తె భవిష్యత్తు లో మన ప్రాంతం లో అయిల్ ఫామ్ ఇండస్ట్రీ వచ్చే అవకాశం ఉందన్నారు.. పంట మార్పిడి తో రైతులు లాభాల బాట పడతారని ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలని, రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడితే ప్రజల ఆరోగ్యాలకు ప్రమాదకరమన్నారు... అనంతరం కార్యక్రమం లో ఉత్తమ రైతులను సన్మానించారు.. అధికారులు అయిల్ ఫామ్ పంట పై ప్రెజెంటేషన్ ఇచ్చి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్థాళ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తాత్రి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ బాలు నాయక్, ఎడిఎలు వీణ శ్రీనివాస్ రాజు, ఉద్యానవన శాఖ అధికారి జావీద్ పాషా, వ్యవసాయ శాఖ అధికారులు, పలువురు సర్పంచ్ లు రైతులు పాల్గొన్నారు.

# చదువుతోనే సమాజంలో గౌరవం

- వయోజన విద్యాశాఖ రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి
- 265 మంది మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ



కాసిపేట, మే 5 (జనంసాక్షి) : విద్యతోనే సమాజంలో గౌరవంతో పాటు ఆత్మ విశ్వాసం పెరుగుతుందని వయోజన విద్యశాఖ రాష్ట్ర డైరెక్టర్ ఏ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కాసిపేట మండలం (లంబాడితండా (ఎస్) ఉన్నత పాఠశాల ఆవరణలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో వంద రోజుల్లో వంద శాతం అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా వయోజన విద్యా రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ ఏ పురుషోత్తం నాయక్, సర్పంచ్ బోడ బలరాం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కుట్టు శిక్షణలో నైపుణ్యం పొందిన 265 మంది మహిళలకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. రాష్ట్ర వయోజన విద్యాశాఖ డైరెక్టర్ ఏ శ్రీనివాస్ రెడ్డి ఎస్సీఈఆర్టీ ప్రొఫెసర్, మాజీ డీఈవో రవి కాంత్, డిప్యూటీ డైరెక్టర్ ఏ పురుషోత్తం నాయక్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను మహిళలకు అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వయోజన విద్యాశాఖ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వంద రోజుల్లో వంద శాతం అక్షరాస్యత విజయవంతంగా పూర్తి చేయడం పట్ల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, వయోజన విద్య శాఖను అభినందించారు. కుట్టు శిక్షణలో నైపుణ్యం పొందిన వారు నిరక్షరాస్యులకు చదువు నేర్పడం చాలా గొప్ప విషయమన్నారు. చదువుతోనే ప్రత్యేక గుర్తింపు ఉంటుందని, చదువు నేర్చుకోవడంతో పాటు మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు కుట్టు శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్ర వయోజన విద్యాశాఖ రాష్ట్ర ఉప సంచాలకులు ఏ పురుషోత్తం నాయక్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కాసిపేట మండలాన్ని వంద శాతం అక్షరాస్యత కార్యక్రమానిన విజయవంతం చేశామని, చదువు నేర్పిన మహిళలకు ఫలితంగా కుట్టు శిక్షణ నేర్పించామని తెలిపారు. ముందుగా అధికారులకు మహిళలు ఘనంగా శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. గిరిజన సాంప్రదాయ నృత్యాలను ప్రదర్శించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో కిషన్, ఎస్సీ కార్పోరేషన్ డీఈ దుర్గ ప్రసాద్, మండల స్పెషల్ ఆఫీసర్ నిరాటి రాజేశ్వరి, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో శేఖ్ సప్దర్ అలీ, సినియర్ అసిస్టెంట్ ఆకుల లక్ష్మీ నారాయణ, సర్పంచ్ లు బోడ బలరాం, కల్వల శరత్ కుమార్, నీలా రాంచందర్, ఏపీఎం రాజ్ కుమార్, డీఆర్పీలు బండ శాంకరి, సుమన్, జనార్ధన్, ఉప సర్పంచ్ పరుశురాం, మహిళలు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయి కి వెళ్లి పంటలను పరిశీలించి..

- క్షేత్రస్థాయికి వెళ్లి పంటలను పరిశీలించి..




**బోథ్, మే 05 (జనంసాక్షి) :** అగ్నిప్రమాదంలో పంటలు కోల్పోయిన రైతులను ఆదుకుంటామని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అందుకునేలా చూస్తామని ఆదిలాబాద్ జిల్లా పాలనాధికారి రాజర్షి షా రైతులకు భరోసా కల్పించారు.బోథ్ మండలం లోని కనుగుట్ట గ్రామం లో ఆదివారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదంలో జొన్న మొక్కజొన్న పంటలు దాదాపు 50 ఎకరాల వరకు కాలి బూడిద అయ్యాయి.మంగళవారం బాధిత రైతులతో కలిసి కాలిన పంట పొలాలను పరిశీలించారు.అనంతరం రైతులతో మాట్లాడుతూ దెబ్బతిన్న పంటల నష్టాన్ని అడిగి తెలుసుకొని వివరాలు నమోదు చేయాలని అధికారులు ఆదేశించారు. అనంతరం విద్యుత్ అధికారుల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన సౌకర్యాలతో సదుపాయాలు కల్పించాలని లేనియెడల తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు ప్రతి ఒక్క అధికారి అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్,తహసీల్దార్ సుభాస్ చందర్, వ్యవసాయ విద్యుత్ అగ్నిమాక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కారు బోల్తా పడిన ఘటనలో యువకుడు మృతి




**తాండూర్, మే 05 (జనం సాక్షి) :** తాండూర్ సమీపంలో కారు టైరు పేలి బోల్తా పడిన ఘటనలో మహా రాష్ట్రకు చెందిన హర్షల్ దినేశ్ (19) మృతి చెందాడు. ఎస్ఐ ప్రసాద్ వివరాల ప్రకారం.. మంచిర్యాలకు ఓ ఫంక్షన్ నిమిత్తం వచ్చి తిరిగి వెళ్తుండగా మంగళవారం తెల్లవారుజామున ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి బోల్తా పడటంతో దినేశ్ అక్కడికక్కడే మరణించగా, తోటి స్నేహితులకు గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# బచ్చన్నపేటలో బీఆర్ఎస్ పార్టీ మెరుపు ధర్నా



**బచ్చన్నపేట, మే 5 (జనంసాక్షి) :** జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రంలో ఐకెపి, పిఎసిఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్నటువంటి వరి ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు వెంటనే డబ్బులు చెల్లించాలని బిఆర్ఎస్ పార్టీ మండలంలోని చౌరస్తాలో రైతులతో కలిసి మెరుపు ధర్నా రాస్తారోకో నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రైతులను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదని బి ఆర్ ఎస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్లు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



**బెల్లంపల్లి, మే 5 (జనంసాక్షి) :** బెల్లంపల్లి మండలం అంకుశం గ్రామంలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేత్త ఎన్ మహేష్ పాల్గొని రైతులకు యూరియా వినియోగంపై అవగాహన కల్పించారు. యూరియాను సమతుల్యంగా, అవసరానికి అనుగుణంగా వాడాలని సూచించారు. ప్రస్తుత మార్కెట్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సన్నబియ్యం రకాలైన ఆర్ఎన్ఆర్ 15048, కేఎన్ఎం 1638, బీపీటీ 5204, డబ్ల్యూజిఎల్ 44, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్ వరి రకాల సాగు చేయాలని రైతులకు సూచించారు. పంటల విభిన్నీకరణ (క్రాప్ డైవర్సిఫికేషన్) వైపు దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అరుణ, ఉపసర్పంచ్ భానుచందర్, వ్యవసాయ విస్తరణ అధికారి తిరుపతి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి పేదవారికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలి

- **ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**



**యాదాద్రి, కరస్పాండెంట్ మే 5 (జనం సాక్షి) :** అర్హులైన ప్రతి పేదవారికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం ఆలేరు నియోజకవర్గంలోని ఇమ్మడి నరసింహారెడ్డి ఫంక్షన్ హాల్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహనకై నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ప్రజా ప్రభుత్వం అమలు చేసిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేయాలనుకున్న పథకాలు గురించి ప్రజలకు వివరించారు. ప్రస్తుతం ఉన్న సంక్షేమ పథకాలు ఎంతోమంది పేద ప్రజల లబ్ధిదారులకు చేరుతుందని, ప్రభుత్వం ఇస్తున్న పథకాలు ప్రజలకు చేరవేయడంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలన్నారు.అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి పార్టీలకు అతీతంగా అర్హులైన నిరుపేదలకు సంక్షేమ ఫలాలు అందేలా చూడాలన్నారు. ప్రభుత్వ విప్ , ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమాన్ని పేద ప్రజలకు అందించాలని ప్రభుత్వం కంకణం కట్టుకుందని అన్నారు. గ్రామాలలో అభివృద్ధి ముందుకు సాగాలని దానికి ప్రతి ఒక్కరి కలిసి కట్టుగా పనిచేయాలని అన్నారు. సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందించాలనదే ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు.తెలంగాణ రైసింగ్ 2047 లో భాగంగా అభివృద్ధిలో ముందుకు పోవాలన్నారు. సర్పంచులు, వార్డు మెంబర్లు, మున్సిపల్ చైర్మన్లు, జిల్లా యంత్రాంగం అందరూ బాధ్యతాయుతంగా పని చేయాలని అన్నారు. పేద ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని చూడాల్సిన బాధ్యత గ్రామంలోని సర్పంచులు, వార్డు మెంబర్లపై ఉందన్నారు. గత పాలనలో అభివృద్ధి లేదని ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత మహిళలకు అధిక ప్రాధాన్యతమిస్తూ కోటిమంది మహిళలు కోటీశ్వరులను చేయడానికి ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు, గృహజ్యోతి, 200 యూనిట్ల ఉచిత కరెంట్, సన్న బియ్యం పంపిణీ, రైతు భరోసా, అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత గంధ మల్ల రిజర్వాయర్ ద్వారా సాగుకు నియోజకవర్గంలోని చెరువులన్నిటిని నింపేమన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు 100% లబ్ధిదారులకు అందేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. గ్రామాలలో పార్టీలకు అతీతంగా పని చేసి గ్రామాభివృద్ధిలో తోడ్పడాలన్నారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నియోజకవర్గ స్థాయి సంక్షేమ పథకాల అవగాహన కార్యక్రమంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగించుకోవాలన్నారు. మార్చి నెలలో మొదలైన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అవగాహన కార్యక్రమం చాలా కీలకమైనదన్నారు. వివిధ శాఖల ద్వారా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అందులో భాగంగా రాబోవు కార్యచరణలో భాగంగా వ్యవసాయానికి సంబంధించి ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగుపై ప్రజలు అవగాహన కల్పిస్తూ ఆయిల్ ఫామ్ పంటలు వేసుకుంటే అధిక లాభాలు చేకూర్తాయని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆయిల్ ఫామ్ సాగుపై దృష్టి సారించి విదేశాల నుండి దిగుబడి కాకుండా స్వయంగా పంటలను వేస్తే అధిక లాభాలు పొందవచ్చు అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేమెంట్ లో యాదాద్రి జిల్లా ముందుంది అన్నారు. లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ గృహప్రవేశాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం మహిళలను దృష్టిలో పెట్టుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని మహిళలకు అనేక సంక్షేమ పథకాలు ప్రభుత్వం అమలు చేస్తుందని అందులో భాగంగా స్కిల్ డెవలప్మెంట్, తదితర సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. వచ్చే జూన్ మాసం తర్వాత ప్రభుత్వం కొత్త పథకాలు ప్రారంభించాబోతున్నందున పథకాలను సద్వినియోగం చేసుకుంటూ యాదాద్రి భువనగిరి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుండేలా మనందరం కలిసి పనిచేయాలన్నారు. దీనికి జిల్లా యంత్రాంగం మొత్తం సహకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బాలమణి భాస్కర్, మోత్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విమల వెంకటేష్, ప్రజా ప్రతినిధులు, ఎంపీడీవో లు, తహసిల్దార్ లు, సంబంధిత అధికారలు, లబ్ధిదారులు, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తిప్పర్తి, సెట్టిపాలెం, పీఏసీఎస్ కేంద్రాల్లో రాజకీయ నేతల ఇష్టారాజ్యం

- **అధికారుల జాడ శూన్యం..అధికార పార్టీ నేతలే అక్కడ సర్వం..**
- **విసిగిపోయి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మాడుగులపల్లి మండల రైతులు**



**మాడుగులపల్లి, మే 5 (జనం సాక్షి) :** మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ రాజకీయ రంగు పులుముకుంది రైతులకు సేవ చేయాల్సిన సహకార సంఘాలు, అధికార పార్టీ నేతల పాలిట కామధేనువులా మారాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో తిప్పర్తి, సెట్టిపాలెం, పీఏసీఎస్‌ల తీరు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ కేంద్రాల్లో అధికారుల మాట దేవుడెరుగు అంతా అధికార పార్టీ ద్వితీయ శ్రేణి నాయకుల కనుసన్నల్లోనే కొనుగోళ్లు సాగుతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాల్లో పీఏసీఎస్ సిబ్బంది, ఏఈఓలు ఉండి ధాన్యం సేకరణను పర్యవేక్షించాలి కానీ మాడుగులపల్లి మండలంలోని ఈ రెండు పీఏసీఎస్‌ల పరిధిలో అధికారులు ఎక్కడా కనిపించడం లేదు, వినిపించడం లేదు అంతా అధికార పార్టీ నాయకులే అధికారుల సీట్లలో కూర్చుని అనధికార ఏజెంట్లుగా చలామణి అవుతున్నారు ఎవరి ధాన్యం ముందు కొనాలి? ఎవరికి కోతలు పెట్టాలి ? ఏ మిల్లుకు లోడ్ పంపాలి? అన్నది ఈ రాజకీయ నేతలే నిర్ణయిస్తుండటం దారుణం ముఖ్యంగా తిప్పర్తి, సెట్టిపాలెం పీఏసీఎస్ కేంద్రాల్లో సామాన్య రైతుకు చుక్కెదురవుతోంది పార్టీ అండ ఉన్న వారికి, నాయకుల అనుచరులకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తూ కష్టపడి పండించిన సామాన్య రైతును వారాల తరబడి ఎండలో ఎండబెడుతున్నారు తేమ శాతం పేరుతో రైతులను భయపెడుతూ, తరుగు తీయడంలోనూ ఈ నేతలు చక్రం తిప్పుతున్నారని, దీని వెనుక పెద్ద ఎత్తున కమీషన్ల దందా నడుస్తోందని ఆరోపణలు వస్తున్నాయి. ఇంత జరుగుతున్నా స్థానికయంత్రాంగంపట్టించుకోకపోవడంతో, మాడుగులపల్లి మండల రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు కొనుగోలు కేంద్రాల్లో ఉండాల్సింది తూకం వేసే మిషన్లు, అధికారులు కానీ ఇక్కడ రాజకీయ పార్టీ జెండాలు మోసే నాయకులు శాసిస్తున్నారు అని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తిప్పర్తి, సెట్టిపాలెం పీఏసీఎస్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి కొనుగోలు కేంద్రాల పరిసరాల్లో అనధికార వ్యక్తులు, రాజకీయ నాయకులు ఉండకుండా కఠిన చర్యలు తీసుకోవాలి అధికారుల విధుల్లో జోక్యం చేసుకుంటున్న వారిపై కేసులు నమోదు చేసి, రైతులకు న్యాయం చేయాలని మండల రైతాంగం డిమాండ్ చేస్తోంది.

# నాలుగు లేబర్ కోడులను రద్దు చేసే వరకు పోరాడుదాం

**వీపనగండ్ల, మే 6 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండలం బొల్లారంలో మేడే వారోత్సవాల సందర్భంగా గాంధీ విగ్రహం, దేవాలయం వద్ద అరుణ పతాకాలను సీనియర్ నేతలు రంజాన్, వంక గోపాల్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రమేష్ మాట్లాడుతూ కేంద్రం శ్రమజీవుల కష్టాన్ని సంపన్నులకు దోచి పెట్టేందుకు 44 కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడులను తెచ్చి నిర్వీర్యం చేసిందన్నారు. అమెరికా చికాగో అమరుల పోరాటం త్యాగం ఫలితంగా గతంలో ఉన్న గతంలో ప్రపంచవ్యాప్తంగా అమలులో ఉన్న 20 గంటల పరిధిలో ఎనిమిది గంటలకు తగ్గించారన్నారు. బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం చికాగో అమరుల పోరాటాన్ని అపహాస్యం చేస్తూ ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచిందన్నారు.సమ్మె హక్కు సంఘం పెట్టుకునే హక్కు లేబర్ కోడల వల్ల కార్మికులు కోల్పోయారన్నారు.కేంద్ర బిజెపి సంపన్నులకు అనుకూల శ్రమజీవులు వ్యతిరేక ప్రభుత్వం అన్నారు. పని గంటలు పెంచడం ద్వారా పేదల శ్రమను సంపన్నులకు దోచిపెట్టడమేనని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడుల రద్దుకు కార్మిక లోకం ఐక్యంగా కదం తొక్కాలన్నారు.ప్రపంచంలో శ్రమజీవుల పక్షాన పని చేసేది సిపిఐ తదితర వామపక్షాలేనని,ఎర్రజెండా నీడన ఏకమై లేబర్ కోడలు వద్దకు తిరిగి పోరాడి సాధించాలన్నారు. బిజెపి ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందని, ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందన్నారు. శ్రమజీవులు బుద్ధి చెప్పేందుకు సిద్ధం కావాలన్నారు. జిల్లా అధ్యక్షుడు వంక గోపాల్ ఆధ్వర్యంలో డప్పు వైద్యాలతో విప్లవ గీతాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్,తెల్లరాళ్లపల్లి మాజీ



ఉపసర్పంచ్ బాలస్వామి, పానగల్ మండల కార్యదర్శి డంగు కురుమయ్య, వీపనగండ్ల మండల కార్యదర్శి మండ్ల కురుమయ్య, సీనియర్ నేతలు రంజాన్ వేమన్న మండ్ల కృష్ణయ్య ప్రభాకర్ రెడ్డి కావలి తిరుపతయ్య రమేష్ ఆచారి నరసింహ ఆచారి బోరెల్లి రామచంద్రయ్య దేవరపాగ వెంకటయ్యకాకం రాముడు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలి



**సూర్యాపేట ప్రతినిధి, మే 5 (జనంసాక్షి) :** పిపిసి కేంద్రాలలో నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అన్నారు.మంగళవారం వరి ధాన్యం కొనుగోలు కార్యక్రమాల పురోగతిని సమీక్షించుటకు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌తో కలిసి పిల్లలమర్రి కొనుగోలు కేంద్రంను సందర్శించి, అక్కడ రైతులు, పిపిసి సిబ్బందితో ఇంటరాక్ట్ అయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె.నరసింహ, అడిషనల్ డైరెక్టర్ రోహిత్ సింగ్, జనరల్ మేనేజర్ నాగేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ కొండలరావు, డిఎస్ఓ మోహన్ బాబు, డిఎం శ్రీధర్ రెడ్డి, డిసిఓ ప్రవీణ్, డిఎంఓ నాగేశ్వర శర్మ, తహసిల్దార్ కృష్ణయ్య, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగిసిన జనగణన శిక్షణ తరగతులు

**కలెక్టర్ అనురాగ్ జయంతి**

**యాదాద్రి, కరస్పాండెంట్ మే 5 (జనం సాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లాలో జనగణన కార్యక్రమానికి సంబంధించి నాలుగు దఫాలుగా నిర్వహించిన శిక్షణ తరగతులు మంగళవారం నాటితో విజయవంతంగా ముగిసినట్లు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం 1,461 మంది ఎన్యుమరేటర్లు మరియు 258 మంది సూపర్వైజర్లుకి సమగ్ర శిక్షణ పొందడం జరిగిందన్నారు. శిక్షణ పొందిన సిబ్బంది అందరూ మే 11, 2026 నుండి ప్రారంభమయ్యే గృహ గణన కార్యక్రమంలో పాల్గొంటారని, హౌస్ లిస్టింగ్/గృహ గణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిందని తెలిపారు. అదేవిధంగా, ప్రజలు తమకు అనుకూలంగా ఉంటే మే 10, 2026 లోపు స్వీయ గణన పూర్తి చేసుకోవాలని సూచించారు. ముందుగానే స్వీయ గణన పూర్తి చేసుకుంటే, ఎన్యుమరేటర్లు గృహాలకు వచ్చినప్పుడు ప్రక్రియ వేగవంతంగా, సులభంగా పూర్తవుతుందని తెలిపారు. జనగణన వంటి ముఖ్యమైన జాతీయ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో జిల్లా ప్రజలందరూ సహకరించాలని కోరారు.

# రోడ్డెక్కిన రైతన్నలు..

- **నిలిచిన ధాన్యం కొనుగోళ్లు**



**చండూరు, మే 5 (జనంసాక్షి) :** చండూర్ మండలం పుల్లెంల గ్రామంలో ని ఐకేపీ సెంటర్ లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేశారు. లారీల కొరత వేధిస్తుండడం, అకాల వర్షాలతో ధాన్యం తడిసి ముద్దవుతున్నా, అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని మండిపడుతూ చండూర్-ఘట్టుప్పల్ రహదారిపై మంగళవారం రైతులు భారీ ధర్నాకు దిగారు. కేంద్రానికి ధాన్యం తెచ్చి రోజులు గడుస్తున్నా పట్టించుకునే నాధుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఇందుగుల రోడ్డుపై డస్ట్ రాజకీయం

- **కాంట్రాక్టర్ బరితెగింపు అధికారుల మౌనం**
- **నాణ్యతను మింగేసిన కమిషన్ల కక్కుర్తి**
- **సిమెంట్ రోడ్డులో ఇసుకకు మంగళం..**
- **కంకర పొడితోనే కాలక్షేపం**
- **ప్రజాధనం దుమ్ముపాలు జిల్లా యంత్రాంగం**
- **నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందా..?**

**మాడుగులపల్లి, మే 5 (జనం సాక్షి) :** ప్రజాధనం అంటే పాలకులకు లోకువ కాంట్రాక్టర్లకు కాసుల వర్షం.. అధికారులకు కమీషన్ల పండుగ! మాడుగులపల్లి మండలం ఇందుగులలో జరుగుతున్న ఆర్ అండ్ బీ (=డదీ) రోడ్డు పనులే ఇందుకు సజీవ సాక్ష్యం నిబంధనలను తుంగలో తొక్కి, నాణ్యతను గాలికొదిలేసి, కాంట్రాక్టరే సుప్రీం అన్నట్లుగా సాగుతున్న ఈ రోడ్డు పనులు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి

### కప్పిపుచ్చేందుకు బాలకార్మిక నాటకం?

ఇటీవల ఈ రోడ్డు నిర్మాణంలో బాలకార్మికులను వాడుకుంటున్నారని వార్తలు రావడంతో అధికారులు రంగంలోకి దిగారు కానీ, అది కేవలం ఐవాష్ చర్యగానే కనిపిస్తోంది. పనుల నుంచి చిన్నారులను పంపించేసి, చేతులు దులుపుకున్న అధికారులు రోడ్డు నాణ్యత విషయంలో ఎందుకు మౌనం వహిస్తున్నారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న బాలకార్మికుల అంశాన్ని హైలైట్ చేసి, రోడ్డు నిర్మాణంలో జరుగుతున్న లక్షల రూపాయల అవినీతిని కప్పిపుచ్చేందుకు అధికారులు, కాంట్రాక్టర్ కలిసి వ్యూహం పన్నారా? అన్న అనుమానాలు గ్రామస్తుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

### ఇసుక లేదు.. అంతా డస్టే!

సీసీ రోడ్డు నిర్మాణం అంటే ఇసుక, కంకర, సిమెంట్ సరైన నిష్పత్తిలో ఉండాలి కానీ ఇక్కడ సీన్ రివర్స్ ఇసుక వాడకానికి పూర్తిగా మంగళం పాడేశారు ఖరీదైన ఇసుకకు బదులుగా అత్యంత చౌకగా లభించే స్టోన్ డస్ట్ (కంకర పొడి)తో పని కానిచ్చేస్తున్నారు డస్ట్‌తో వేసే రోడ్లు పైకి నునుపుగా కనిపించినా, లోపల పట్టు ఉండదు. వర్షాకాలం వస్తే ఈ రోడ్లు కుంగిపోవడం, బీటలు వారడం ఖాయమని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నా పర్యవేక్షించాల్సిన ఏఈ (ూజు), ఈఈ (జుజు)లు అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

### దౌర్జన్యమే పెట్టుబడిగా..

మా ఇష్టం వచ్చినట్లు చేస్తాం ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి ఇది సదరు కాంట్రాక్టర్ గ్రామస్తులకు ఇస్తున్న సమాధానం అధికారులకు భారీగా మామూళ్లు అందుతున్నాయన్న ధీమాతోనే కాంట్రాక్టర్ ఇంతలా బరితెగిస్తున్నాడని స్థానికులు మండిపడుతున్నారు నాణ్యత గురించి ప్రశ్నిస్తే అంగబలంతో బెదిరింపులకు దిగుతున్నాడని, ప్రశ్నించే గొంతును నొక్కేసే



ప్రయత్నం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కలెక్టర్ గారు దృష్టి సారించండి

కోట్లాది రూపాయల ప్రజల సొమ్ము ఇలా కాంట్రాక్టర్ల జేబుల్లోకి వెళ్తుంటే ఉన్నతాధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారు? ఇప్పటివరకు జరిగిన పనులపై క్వాలిటీ కంట్రోల్ అధికారులతో తక్షణమే విచారణ జరిపించాలి రోడ్డు నిర్మాణంలో వాడుతున్న మెటీరియల్‌ను ల్యాబ్‌కు పంపి పరీక్షించాలి నాణ్యత లేని పనులకు బిల్లులు చెల్లించకుండా తక్షణమే ఆపివేయాలి ఒక కాంట్రాక్టర్ స్వార్థం కోసం ఇందుగుల ప్రజల భవిష్యత్తును బలిపెట్టవద్దని, జిల్లా కలెక్టర్ గారు వెంటనే జోక్యం చేసుకొని ఈ అవినీతి రోడ్డుపై కొరడా ఝుళిపించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టేందుకు సిద్ధమని హెచ్చరిస్తున్నారు.

# సాగు విధానాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలి

- **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట ప్రతినిధి, మే 5 (జనంసాక్షి) :** జిల్లాలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల సమన్వయంతో సాగు విధానాల్లో విప్లవాత్మక మార్పులు రావాలని, ముఖ్యంగా రైతులకు అధిక ఆదాయం అందించే పంటలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖల ఆధ్వర్యంలో పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించిన రైతు వారం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.వ్యవసాయం కేవలం సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, రైతులకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచే విధంగా ఆధునీకరణ చెందాలని ఆకాంక్షించారు. ఉద్యానవన,వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి, క్షేత్రస్థాయిలో రైతుల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు.ప్రస్తుతం మార్కెట్‌లో ఆయిల్ పామ్‌కు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సాగు విస్తీర్ణాన్ని భారీగా పెంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఆసక్తి ఉన్న రైతులను గుర్తించి, ఇప్పటికే సాగు చేస్తున్న తోటలకు ఫీల్డ్ విజిట్ చేయించాలని, తద్వారా సాగు పద్ధతులు, వచ్చే లాభాలపై వారికి ప్రత్యక్ష అవగాహన కల్పించాలని సూచించారు.మండలాల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని, లబ్ధిదారుల జాబితాను తక్షణమే సిద్ధం చేయాలని ఆదేశించారు.జిల్లాలో నీటి వసతి



పుష్కలంగా ఉన్న నేపథ్యంలో, కూరగాయల సాగును లాభసాటిగా మార్చాలని పేర్కొన్నారు. కూరగాయల సాగులో ఆధునిక పద్ధతులు, వ్యవసాయ యంత్రీకరణను జోడించి శ్రమను తగ్గించి దిగుబడిని పెంచాలని తెలిపారు.కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చూడాలన్నారు.నీటి పొదుపుతో పాటు సాగు వ్యయం తగ్గించేందుకు సాంకేతికతను వాడాలని సూచించారు. పర్యావరణానికి మేలు చేసే, తక్కువ ఖర్చుతో కూడిన నానో యూరియా వాడకంపై విస్తృత ప్రచారం చేయాలన్నారు.వరి ఒక్కటే కాకుండా, మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని , ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో రైతులతో సమన్వయం చేసుకుంటూ, వారికి అదనపు ఆదాయం కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూ సాంప్రదాయ పంటలకు స్వస్తి చెప్పి, అధిక ఆదాయాన్నిచ్చే ఆయిల్ ఫామ్ సాగు వైపు రైతులు మొగ్గు చూపాలని పిలుపునిచ్చారు.ఆయిల్ ఫామ్ ఒకసారి నాటితే దాదాపు 25 నుండి 30 ఏళ్ల వరకు నిరంతర ఆదాయాన్ని ఇస్తుందని తెలిపారు. వరి వంటి పంటలతో పోలిస్తే పెట్టుబడి తక్కువని, కూలీల సమస్య కూడా ఉండదని రైతులకు వివరించారు. రైతులు పండించిన గెలలను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే నిర్దేశిత కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుందని, అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని, దళారీల ప్రమేయం ఉండదని భరోసా ఇచ్చారు. మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, ఎరువులు, మార్కెటింగ్ సహాయం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు. ఆసక్తి ఉన్న రైతులు ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ నాగయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, జిల్లా మార్కెట్ అధికారి నాగేశ్వర శర్మ, కెవికె సైంటిస్ట్ నరేష్, తహసిల్దార్ కృష్ణయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

- **రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం..**
- **ఇంటి స్థలం పేరు మార్పిడి కోసం లంచం డిమాండ్**
- **అనిశా అధికారులను ఆశ్రయించిన స్థలం యజమాని**
- **రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని రంగారెడ్డి జిల్లా ఏసీబీ కోర్టుకు తరలింపు**



**తలకొండపల్లి, మే 5 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని వెల్జాల్ పంచాయతీ కార్యదర్శి ఎం.శరత్ ఏసీబీ వలకు చిక్కారు.స్థలం పేరు మార్పిడి కోసం ఓ వ్యక్తి నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు మంగళవారం పట్టుకున్నారు.అనిశా అధికారుల కథనం ప్రకారం..ఓ వ్యక్తి తనకు ఉన్న స్థలాన్ని గ్రామంలో ఉన్న మరో వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేయగా,అట్టి స్థలాన్ని పంచాయితీ రికార్డులో పేరు మార్పిడి చేయాలని పంచాయతీ కార్యదర్శిని కోరగా,అతను రూ,30 వేలు లంచం డిమాండ్ చేశాడు.కాగా రూ,20 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు.లంచం ఇవ్వడం ఇష్టం లేక బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు.వారి సూచనల మేరకు బాధితుడు రూ,20 వేలను మంగళవారం వెల్జాల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శి ఎం.శరత్ కు ఇస్తుండగా రంగారెడ్డి జిల్లా రేంజ్ ఏసీబీ డిఎస్పి ఆనంద్ కుమార్ పట్టుకున్నారు.వెంటనే కార్యదర్శి శరత్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకొని విచారించి,పంచాయతీ కార్యాలయంలో సోదాలు నిర్వహించారు.ఆయనను రంగారెడ్డి జిల్లా ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.ప్రభుత్వ అధికారులు ఎవ్వరు లంచం అడిగిన అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించాలని ఏసీబీ డిఎస్పి ఆనంద్ కుమార్ సూచించారు.

# విపణి

## సైనికుల కోసం నయా అవతార్‌లో
# థార్ రాక్స్
## పోస్ట్ చేసిన ఆనంద్ మహీంద్రా

**న్యూఢిల్లీ:**మహీంద్రా థార్.. దేశీయ మార్కెట్‌లో దీనికున్న క్రేజే వేరు. ముఖ్యంగా ఆఫ్ రోడ్ వావానాలు ఇష్టపడే వారికి థార్ నడపడం ఒక ఎమోషన్. రోడ్డుపై వెళుతుంటే దాని లుక్ చూపరులనూ కట్టిపడేస్తుంది. ఇప్పుడీ థార్ రాక్స్ మరింత రగ్గడ్ లుక్‌తో సరికొత్త అవతార్‌లో రాబోతోంది. మహీంద్రా ఏటీవీ (ఆల్ టెరియన్ వెహికల్) పేరుతో దేశీయ సైనిక అవసరాల కోసం దీన్ని ప్రత్యేకంగా రూపొందించారు. మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా ఈ వాహనాన్ని పరిచయం చేస్తూ సోషల్‌మీడియాలో పోస్ట్ పెట్టారు. బెంగళూరుకు చెందిన ప్రద్ 44 అనే సంస్థతో కలిసి మహీంద్రా దీన్ని రూపొందించింది. సాధారణ కారులా అనవసరమైన అలంకరణలు ఏవీ లేకుండా దీన్ని రూపొందించినట్లు ఆనంద్ మహీంద్రా చెప్పారు. సైనిక అవసరాలను దృష్టిలోపెట్టుకుని పనితీరు, సామర్థ్యంపై దృష్టి కేంద్రీకరించినట్లు తెలిపారు. మెటల్ బాడీతో రూపొందిన ఈ వాహనం.. ఎయిర్‌డ్రాప్‌ను సైతం తట్టుకోగలదని తెలిపారు. ఎలాంటి కఠిన వాతావరణ పరిస్థితుల్లోనైనా ప్రయాణించగలదని పేర్కొన్నారు. ఈ మేరకు మహీంద్రా ఏటీవీ చిత్రాలను ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.మహీంద్రా ఏటీవీ విషయానికొస్తే.. థార్ రాక్స్ డీజిల్ వెర్షన్ ఆధారంగా ఇది రూపొందింది. ఇందులో 2.2 లీటర్ ఇంజిన్ ఉంది. ఇది 172 హెచ్‌పీ శక్తిని, 400 ఔవి టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఆయుధాలను అమర్చుకోవడానికి వీలుగా గన్ మౌంట్ ఉంది. యుద్ధ సమయాల్లో విమానాల నుంచి పారాచూట్ సాయంతో నేరుగా కిందకు వదిలినా తట్టుకోగలిగేలా దీన్ని రూపొందించారు. వాహనం కింది భాగం దెబ్బతినకుండా అండర్ బాడీ ప్రొటెక్షన్ ఇచ్చారు. విండ్‌షీల్డ్ ప్రొటెక్టర్ కూడా ఉంది. వెనుక భాగంలో అదనపు టైర్లు, ఇంధనం/ నీరు పెట్టుకునే సదుపాయం ఉంది. అతి ఎక్కువ గ్రౌండ్ క్లియరెన్స్‌తో వస్తోంది.



# మళ్లీ యుద్ధం రగడ

## నష్టాల్లో ముగిసిన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో మళ్లీ ఘర్షణ వాతావరణం నెలకొనడంతో నిన్నటి లాభాలకు గండిపడింది. 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్' కింద రెండు నౌకలను హర్మూజ్ జలసంధి దాటించినట్లు అమెరికా ప్రకటించింది. ఈ క్రమంలోనే తమ జలాల్లోకి ప్రవేశించిన అమెరికా నౌకపై దాడి చేసినట్లు ఇరాన్, తమ కార్యకలాపాలు అడ్డుకోవడానికి ప్రయత్నించిన ఇరాన్ చిన్న నౌకలను ధ్వంసం చేసినట్లు అమెరికా ప్రకటించడం ఆందోళనకు కారణమైంది. మరోవైపు యూఏఈ లక్ష్యంగా ఇరాన్ దాడి చేయడం మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. ముఖ్యంగా బ్యాంక్, రియాలిటీ, ఆయిల్ అండ్ గ్యాస్ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి .సెన్సెక్స్ ఉదయం 77,103.72 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,269.40) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 76,515.03 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 251.61 పాయింట్ల నష్టంతో 77,017.79 వద్ద ముగిసింది. నిఫ్టీ 86.50 పాయింట్ల నష్టంతో 24,032 వద్ద స్థిరపడింది.



డాలరుతో రూపాయి మారకం విలువ 95.25గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఐసీఐసీఐ బ్యాంక్, ఎటర్నల్, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్ స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, ఇన్ఫోసిస్ స్టాక్స్ లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 112 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4552 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## స్వల్పంగా పెరిగిన తయారీ రంగ వృద్ధి

**దిల్లీ:** భారత తయారీ రంగ వృద్ధి ఏప్రిల్‌లో స్వల్పంగా పెరిగింది. కొత్త ఆర్డర్ల రాక ఇందుకు తోడ్పడింది. తయారీ రంగ పనితీరును అంచనా వేసే హెచ్ఎస్‌బీసీ ఇండియా తయారీ పర్చేజింగ్ మేనేజర్స్ సూచీ (పీఎంఐ) మార్చిలో 53.9 పాయింట్ల వద్ద ఉండగా.. ఏప్రిల్‌లో 54.7 పాయింట్లకు పెరిగింది. గత నాలుగేళ్లలోనే తయారీ రంగ వృద్ధిలో ఇది రెండో కనిష్ఠ పెరుగుదల కావడం గమనార్హం. పీఎంఐ పరిభాష ప్రకారం.. సూచీ 50 పాయింట్ల ఎగువన ఉంటే ఆ రంగంలో వృద్ధి ఉన్నట్లు, 50 పాయింట్ల దిగువన ఉంటే క్షీణతగాను పరిగణిస్తారు. 'అమ్మకాలు, ఉత్పత్తికి



ప్రకటనలు, గిరాకీలో స్థిరత్వం తోడ్పడ్డాయి. అయితే పోటీ పరిస్థితులు, పశ్చిమాసియా యుద్ధం, కొటేషన్లను ఆమోదించడానికి క్లయింట్లు విముఖత చూపడం లాంటివి తయారీ రంగ వృద్ధికి అవరోధంగా నిలిచాయ'ని సర్వే తెలిపింది. ముఖ్యంగా పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రతికూలతలు ద్రవ్యోల్బణం రూపంలో ప్రభావం చూపాయని హెచ్ఎస్‌బీసీ ఇండియా ముఖ్య ఆర్థికవేత్త ప్రంజుల్ భండారి తెలిపారు.

### శాంసంగ్ పరిమితకాలపు ఆఫర్..
## రూ.9వేల వరకు తగ్గింపు!

ప్రముఖ మొబైల్ తయారీ కంపెనీ శాంసంగ్ మొబైల్ కొనుగోలుదారులకు గుడ్‌న్యూస్ చెప్పింది. ఎంపిక చేసిన మోడళ్లపై పరిమితకాలపు డిస్కౌంట్‌ను ప్రకటించింది. మే 3 నుంచి 27 వరకు డీలర్ ప్రోత్సాహక పథకాన్ని తీసుకొచ్చింది. దీంతో కొనుగోలుదారులకు ప్రయోజనం కలగనుంది. గత నెల కొన్ని స్మార్ట్‌ఫోన్లపై ధరలు పెంచిన శాంసంగ్.. ఇప్పుడు డిస్కౌంట్ ప్రకటించడం గమనార్హం.శాంసంగ్ ఎస్26 అల్ట్రాపై గరిష్ఠంగా రూ.9 వేలు తగ్గింపు ఇస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది. గెలాక్సీ 26 స్మార్ట్‌ఫోన్ మీద రూ.8 వేలు తగ్గింపు ఇస్తున్నట్లు శాంసంగ్ ప్రకటించింది. మిడ్‌రేంజ్ సెగ్మెంట్‌లో లభించే గెలాక్సీ ఏ57పై రూ.7వేలు తగ్గనుంది. దీంతో రూ.56వేలు ఉన్న ఈ ఫోన్ రూ.49,999కు తగ్గనుంది. గెలాక్సీ ఏ37 మోడల్‌పై రూ.5 వేలు చొప్పున తగ్గిస్తున్నట్లు శాంసంగ్ ప్రకటించింది. దీంతో ఈ ఫోన్ ధర రూ.36,999కు లభించనుంది.ప్రస్తుతం ఈ స్మార్ట్‌ఫోన్లపై లభిస్తున్న బ్యాంక్ ఆఫర్, ఎక్స్ఛేంజీ బోనస్‌కు ఈ డిస్కౌంట్ అదనం. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కొనుగోళ్లపై ఈ డిస్కౌంట్లు లభ్యమవుతాయి. అయితే, డీలర్‌ను బట్టి డిస్కౌంట్‌లో మార్పులుండొచ్చు. ఇన్వెంటరీ క్లియర్ చేయడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.



### మేనకోడలికి
## బయోకాన్ బాధ్యతలు..
### వారసురాలిని ప్రకటించిన మజుందార్ షా

దిల్లీ: బయోటెక్నాలజీ సంస్థ బయోకాన్ వ్యవస్థాపకురాలు, ఛైర్‌పర్సన్ మజుందార్ షా వారసత్వ ప్రణాళికను ప్రకటించారు. మజుందార్ షా తర్వాత బయోకాన్ సంస్థను ఆమె మేనకోడలు క్లైయిర్ మజుందార్ నడిపించనున్నారు. ఈ మేరకు ఫార్చ్యూన్ ఇండియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మజుందార్ షా ఈ అంశంపై మాట్లాడారు. నాలుగు దశాబ్దాల క్రితం బయోకాన్‌ను నెలకొల్పిన మజుందార్ షాకు పిల్లలు లేరు. దీంతో తన కంపెనీని తదుపరి దశకు తీసుకెళ్లే బాధ్యతను తన మేనకోడలు క్లైయిర్ మజుందార్‌కు అప్పగించనున్నట్లు తెలిపారు. కంపెనీని విజయవంతంగా నడిపే సత్తా ఆమెకున్నట్లు విశ్వాసం వ్యక్తంచేశారు.వారసత్వ ప్రణాళికను ప్రకటించినప్పటికీ.. మరికొన్నాళ్ల పాటు బయోకాన్ ఛైర్‌పర్సన్‌గా ఉండనున్నట్లు మజుందార్ షా వెల్లడించారు. వారసురాలి ప్రకటన గురించి మీడియాలో వార్తలు వచ్చిన నేపథ్యంలో ఆమె ఎక్స్‌వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. ఇప్పటికిప్పుడు బయోకాన్ బాధ్యతల నుంచి వైదొలిగే ఉద్దేశమేదీ లేదని అందులో తెలిపారు. దశలవారీగా క్లైయిర్‌కు బాధ్యతల అప్పగిస్తానని అందులో పేర్కొన్నారు. ప్రస్తుతం క్లైయిర్ మజుందార్ షా నాస్‌డాక్ లిస్టెడ్ కంపెనీ అయిన బైకారా థెరప్యూటిక్స్‌కు సీఈఓగా వ్యవహరిస్తున్నారు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.25 | ₹ 5.27 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 1,37,900 | ₹ 1,50,440 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,65,000

# 30 రంగాలకు చమురు పోటు

**పలు ఉత్పత్తుల తయారీలో ముడి సరకుగా వాడటం వల్లే ప్రపంచంలోనే అతిపెద్ద ఇంధన సంక్షోభానికి కారణమైన పశ్చిమాసియా యుద్ధం ప్రారంభమై రెండు నెలలు మించింది. సంప్రదింపులు కొనసాగుతున్నా.. ఉద్రిక్తతల తగ్గుముఖంపై అనిశ్చితి వీడటం లేదు. హర్మూజ్ జలసంధి మీదుగా సరకు రవాణాకు అంతరాయాలు కొనసాగుతున్నాయి. ఫలితంగా రవాణా, బీమా వ్యయాలు.. సరఫరా సమయాలు పెరుగుతున్నాయి.**




**న్యూఢిల్లీ:**ముడిచమురు కొరత వల్ల సిరామిక్స్ దగ్గర నుంచి ఎఫ్ఎమ్‌సీజీ వరకు దాదాపు 30 రంగాలపై ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావం పడుతోంది. ఎరువుల ఉత్పత్తి క్షీణిస్తోంది. విమానయాన సంస్థల ఆదాయాలు-మార్జిన్లు పడిపోతున్నాయి.మనదేశ ముడి చమురు దిగుమతుల్లో 35-50% హర్మూజ్ జలసంధి మీదుగానే వస్తుంటాయి. గల్ఫ్ దేశాల నుంచి ఇవి దిగుమతి అయ్యేవి. యుద్ధం ప్రారంభమయ్యాక రష్యా నుంచి ముడి చమురు సరఫరా మళ్లీ పెంచుకున్నా, రవాణాకు అధిక సమయం, వ్యయాలు అవుతున్నాయి. హర్మూజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలు ఏప్రిల్ మధ్యలో మెరుగుపడినా, యుద్ధానికి ముందు స్థాయుల్లో 14 శాతమే కావడం ఆందోళన కలిగించే అంశం. ఇంధన వనరుగానే కాకుండా... 6,000కి పైగా తయారీ ఉత్పత్తులకు కీలక ముడి పదార్థంగా ముడి చమురు ఉపయోగపడుతోంది. ఆరోగ్య సంరక్షణ (వైద్య ఉత్పత్తుల పాలీమర్లు), వ్యవసాయం (నైట్రోజన్ ఆధారిత ఎరువులు), సాంకేతికత (సర్క్యూట్ బోర్డు రెసిన్‌లు) వంటి పలు రంగాలు పెట్రోలియం ఉత్పత్తులపై ఆధారపడి ఉన్నాయి. ఇంధన సంక్షోభం దీర్ఘకాలం కొనసాగితే, చాలా రంగాల ఆదాయాలు ప్రమాదంలో పడొచ్చు. సరఫరా అంతరాయాలతో వ్యయాలు పెరిగితే.. ద్రవ్యోల్బణం అధికమై, గిరాకీపై ప్రతికూల ప్రభావం పడొచ్చు. ఆర్థిక వృద్ధి నెమ్మదించేందుకూ ఇది దారి తీయొచ్చు.

**ధరలు పెరుగుతూ.. గిరాకీ తగ్గుతూ**

సహజవాయువు కొరత కారణంగా దేశీయంగా మార్చిలో ఎరువుల ఉత్పత్తి 2025 ఇదేనెలతో పోలిస్తే





24.6% క్షీణించిందని క్రిసిల్ విశ్లేషించింది. ఈ రంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వ జోక్యం అవసరమని సూచించింది. కొన్ని దేశాల గగనతల ఆంక్షలు, విమాన ఇంధన ధరల పెరుగుదల, రూపాయి విలువ క్షీణత వల్ల విమానయాన సంస్థల నిర్వహణ మార్జిన్‌లు మూడింట ఒక వంతు కంటే ఎక్కువగా తగ్గే అవకాశం ఉంది. ఎల్ఎన్‌జీ, ప్రొపేన్‌పై అధికంగా ఆధారపడిన సిరామిక్స్ రంగంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం పడుతోంది. ఈ రంగ ఆదాయాల్లో 35%, నిర్వహణ మార్జిన్‌లో 50% క్షీణత ఉండొచ్చన్నది అంచనా. ఇంధన, ముడి సరకు ఖర్చులు పెరగడం వల్ల సిమెంట్, పాలీవినైల్ క్లోరైడ్ పైపులు, సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు లాభాల మార్జిన్లలో ఒత్తిడి ఎదుర్కొంటున్నాయి. సిమెంటు తయారీ కంపెనీల వ్యయాల్లో 15% వాటా ఇంధనానిదే. బొగ్గు వైపునకు మారడం, బలమైన బ్యాలెన్స్ షీట్లను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఈ ప్రభావాన్ని సిమెంటు కంపెనీలు కొంత తగ్గించుకోవచ్చు. ద్రవ్యోల్బణం అధికమై, వినియోగదారు సెంటిమెంటు బలహీనపడితే ఎఫ్ఎమ్‌సీజీ, ద్విచక్ర వాహనాలు, కార్ల అమ్మకాలపై ప్రతికూల ప్రభావం ఉండొచ్చు. తగ్గిన డిమాండు, పెరుగుతున్న ఖర్చులకు తగ్గట్లుగా స్థిరాస్తి, ఆతిథ్య రంగాలు సిద్ధమవుతున్నాయి. రంగులు, రహదారులు, వంతెనలు, టైర్ల పరిశ్రమల ఆదాయాలూ నెమ్మదించొచ్చు. ఈ పరిశ్రమల్లో తారు, సింథటిక్ రబ్బరు వంటి ముడి చమురుతో ముడిపడిన ముడి పదార్థాలు వాడుతుండటం, రిఫ్రిజరెంట్ వాయువుల ధర పెరగడం ఇందుకు కారణం.

**భారత్‌కు సవాలే...**

ప్రత్యామ్నాయ విపణుల నుంచి ఇంధన సరఫరా పెంచుకునేందుకు భారత ప్రభుత్వం ప్రయత్నిస్తున్నా.. చమురు ధర అధికంగా ఉండటం, సరకు రవాణా సమయం - వ్యయాలు- బీమా ఛార్జీలు పెరగడం, ఆయిల్ ట్యాంకర్ల కొరత, షిప్పింగ్, ట్రాన్సిట్ వ్యయాలు అధికం కావడం ఇబ్బంది పెడుతున్నాయి. ఇప్పటివరకు పెట్రోల్, డీజిల్ రిటెయిల్ ధరలను ప్రభుత్వం పెంచనందున.. ప్రభుత్వ రంగ చమురు విక్రయ సంస్థలే నష్టపోతున్నాయి. ఇకపై కొంత భారాన్ని ప్రజలకు మళ్లించే అవకాశాలు కనిపిస్తున్నాయి. పెట్రో ధరల పెంపును కొట్టేయలేమని కేంద్రప్రభుత్వం సంకేతాలు ఇవ్వడం ఇందుకు నిదర్శనం. పెట్రో ధరలు పెరిగితే, ఆ ప్రభావం సేవలు - ఉత్పత్తుల ధరల రూపేణ వినియోగదార్లకు అదనపు భారం అవుతుంది.

# అరుదైన వైరస్ కలకలం..



## సముద్రంలో నిలిచిన నౌక

**న్యూఢిల్లీ:**ఒక క్రూజ్ నౌకలో అరుదైన వైరస్ కలకలం సృష్టిస్తోంది. దాంతో అందులో ఉన్న ప్రయాణికులు సముద్రంలో సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. వారంతా అట్లాంటిక్ మహా సముద్రంలో కేప్ వెర్డే తీరానికి సమీపంలో వేచిఉన్నారు. ఇప్పటికే ముగ్గురు ప్రయాణికులు మృతి చెందడం.. మరో ముగ్గురు తీవ్ర అనారోగ్యానికి గురవడంతో వారు ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ , షిప్ ఆపరేటర్ వెల్లడించిన వివరాల ప్రకారం డచ్‌షిప్ దాదాపు 150 మంది ప్రయాణికులతో అర్జెంటీనా నుంచి బయల్దేరింది. వాస్తవంగా అంటార్కిటికా, అట్లాంటిక్ మహా సముద్రంలో వారం రోజుల పాటు ఈ యాత్ర కొనసాగాల్సి ఉంది. అయితే అంతలోనే వైరస్ వ్యాప్తి చెందడంతో కేప్ వెర్డే తీరంలోకి వచ్చిన తర్వాత సహాయం కోసం నౌక నుంచి స్థానిక అధికారులకు అభ్యర్థన వెళ్లింది. అయితే అందులోని వారు దిగేందుకు అనుమతి లభించలేదు. ప్రజారోగ్య ఆందోళనల దృష్ట్యా తమ రేవులో ఆ నౌకను నిలిపేందుకు ప్రస్తుతానికి అనుమతివ్వలేదని కేప్ వెర్డే ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది. తమ తీరానికి దూరంగా సముద్ర జలాల్లో అది నిలిచిఉందని పేర్కొంది. నౌకలోని ప్రస్తుత పరిస్థితికి అరుదైన హంటా వైరస్ కారణమని అనుమానిస్తున్నారు ఇది ఎలుకల ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఇది ఒకరి నుంచి మరొకరికి సోకే ప్రమాదం ఉందని గతంలోనే ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. అయితే క్రూజ్ షిప్‌లోకి ఈ వైరస్ ఎలా వ్యాపించిందనే దానిపై మాత్రం స్పష్టత లేదు.మే 4 నాటికి 7 హంటా వైరస్ కేసులు వెలుగులోకి వచ్చాయి. వైద్య పరీక్షల్లో రెం డు కేసులు ధ్రువీకరణ అయ్యాయి. ఇప్పటికే ముగ్గురు మర ణించగా.. మరొకరిలో తీవ్ర లక్షణాలు కనిపిస్తున్నాయి. మిగతా ముగ్గురిలో లక్షణాలు స్వల్పంగా ఉన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. ఆ నౌకలో 88 మంది ప్రయాణికులు, 60 మంది వరకు సిబ్బంది ఉన్నారు. మృతి చెందిన జర్మన్ జాతీయుడి మృతదేహం ఇప్పటికీ ఆ షిప్‌లోనే ఉందని మీడియా కథనాలు వెల్లడించాయి.

## ఇద్దరు భారతీయ జర్నలిస్టులకు పులిట్జర్

చాలా సునిశితంగా ప్రజెంట్ చేశారు. చాలా బలమైన విజువల్స్‌తో ఆ కథనాన్ని ప్రసారం చేశారు. దక్షిణాసియాలో సైబర్ నేరగాళ్ల ముఠా ఎలా పనిచేస్తుందన్న కోణంలో ట్రాప్డ్ కథనంలో చూపించారు. న్యూయార్క్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో పులిట్జర్ ప్రైజ్ విజేతలను ప్రకటించారు. ఆరితేరిన సైబర్ నేరగాళు ఎలా ఓ భారతీయ న్యూరాలజిస్టును బోల్తా కొట్టిస్తారో ట్రాప్డ్ స్టోరీలో ప్రజెంట్ చేశారు. ఇన్వెస్టిగేట్ జర్నలిజం విధానంలో ఈ కథనం సాగుతుంది. కథనంలో ఎడిటోరియల్ గాఢత ఎక్కువగా ఉన్నట్లు పులిట్జర్ బోర్డు ప్రశంసించింది. ట్రాప్డ్ ప్రాజెక్టు కోసం ముంబై ఆర్టిస్టు ఆనంద్ ఆర్కే బొమ్మలను గీశారు. గ్రాఫిక్ స్టోరీటెల్లింగ్‌లో అతను మాస్టర్. గతంలో ఆయన 2021లో ఈస్నర్ అవార్డు గెలుచుకున్నారు. బ్లూ ఇన్ గ్రీన్ అనే గ్రాఫిక్ నవలకు ఆ అవార్డు వచ్చింది. ఇక జర్నలిస్టు సుపర్ణ శర్మ ఈ కథనానికి రిపోర్టింగ్ చేశారు. బ్లూమ్‌బర్గ్‌కు చెందిన టోక్యో రిపోర్టర్ నటాలీ ఒబికో పియర్సన్ కూడా ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్ చేశారు. అంతర్జాతీయ రిపోర్టింగ్ కేటగిరీలో మరో భారతీయ జర్నలిస్టు అనిరుద్ధ్ ఘోసల్ పులిట్జర్ ప్రైజ్ గెలిచారు. అమెరికా బోర్డర్ పెట్రోలింగ్ పోలీసులకు చెందిన నిఘా వ్యవస్థల టెక్నాలజీ గురించి ఇన్వెస్టిగేట్ చేశారు.

## కాసేపు లాక్‌డౌన్‌లో వైట్‌హౌస్ ..

**వాషింగ్టన్:**అమెరికా అధ్యక్ష కార్యాలయం వైట్‌హౌస్ సమీపంలో మరోసారి భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది భద్రతా బలగాలపై ఓ సాయుధుడు కాల్పులకు దిగడంతో.. సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు ఎదురుకాల్పులు జరిపారు. ఆ సమయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శ్వేతసౌధంలోనే ఉన్నారు. దాంతో వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది కొంతసేపు వైట్‌హౌస్‌ను మూసివేశారు. ఈ కాల్పులు జరగడానికి కొంతసేపటికి ముందే ఆ రోడ్డులో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కాన్వాయ్ వెళ్లినట్లు అధికారులు తెలిపారు. జేడీ వాన్స్ లక్ష్యంగా కాల్పులు జరిగాయని తాము భావించడం లేదని యూఎస్ సీక్రెట్ సర్వీస్ (జూూూ) డిప్యూటీ డైరెక్టర్ మాథ్యూ క్విన్ పేర్కొన్నారు. ఇటీవల వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌లో నిర్వహించిన వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్‌లో ఓ దుండగుడు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. డొనాల్డ్ ట్రంప్, ఆయన సతీమణి మెలానియాతోపాటు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్,



రక్షణశాఖ మంత్రి పీట్ హెగ్సెత్, విదేశాంగ శాఖ మంత్రి మార్కో రుబియో ఆ ఈవెంట్‌లో ఉన్న సమయంలో ఆ ఘటన జరిగింది. దానికి తాజా ఘటనతో ఏదైనా సంబంధం ఉందా..? అనేది ఇప్పుడే చెప్పలేమని క్విన్ వెల్లడించారు.

## హైడ్రా భారీ ఆపరేషన్

ఆదాయానికి గండి పడుతుందన్న సంబంధిత శాఖల ఫిర్యాదుల మేరకు పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి అక్రమ మైనింగ్‌కు ఫుల్‌స్టాప్ పెట్టింది.తహైడ్రా మంగళవారం భారీ ఆపరేషన్ చేపట్టింది. అనుమతులు లేకుండా మైనింగ్, క్రషింగ్, ఆర్?ఎంసీ యూనిట్లను నడుపుతున్న వారిపై చర్యలకు దిగింది. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, మైనింగ్ శాఖల నుంచి ఫిర్యాదు అందగానే రంగంలోకి దిగిన హైడ్రా, ఈరోజు ఉదయం ఒకేసారి 6 ప్రాంతాల్లో బుల్డోజర్లతో దాడులు చేసి అక్రమ మైనింగ్‌కు ఫుల్‌స్టాప్ పెట్టింది. 12 ఆర్?ఎంసీ ప్లాంట్లను తొలగించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం వట్టినాగులపల్లి, శేరిలింగంపల్లి మండలంలోని గౌలిదొడ్డి, శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ ప్రాంతాల్లో ఈ దాడులు చేసింది.ఇష్టానుసారం క్వారీలు తవ్వి, స్టోన్ క్రషింగ్‌తో దుమ్ము రేపి, పరిసరాలను నాశనం చేసే వారిపై హైడ్రా చర్యలు తీసుకుంది. విపరీతమైన దుమ్ముతో వాతావరణాన్ని కాలుష్యం చేయడాన్ని నియంత్రించింది. బండ రాళ్లను పేల్చి పరిసర ప్రాంతాల్లోని నివాసాలకు ముప్పుగా పరిణమించిన అక్రమ మైనింగ్?కు ఫుల్?స్టాప్? పెట్టిన హైడ్రా, 6 చోట్ల స్టోన్ క్రషింగ్ యూనిట్లను నేల కూల్చింది. భవిష్యత్తులో అక్కడ స్టోన్ క్రషింగ్ చేయడానికి వీలు లేకుండా యంత్ర సామగ్రిని తొలగించింది. గతంలో మైనింగ్, పీసీబీ శాఖల హెచ్చరికలను పట్టించుకోకుండా యథేచ్ఛగా సాగుతున్న అక్రమ మైనింగ్‌కు హైడ్రా మంగళవారం శాశ్వతంగా చెక్ పెట్టింది.అందరూ బడాబాబులే : రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం వట్టినాగుల పల్లి, శేరిలింగంపల్లి మండలంలోని గౌలిదొడ్డి, శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడలో అక్రమ మైనింగ్‌కు పాల్పడిన వారంతా బడా సంస్థలకు చెందిన వారే కావడం గమనార్హం. అక్రమ మైనింగ్ జరుగుతున్న యూనిట్లను డిస్మాంటల్ చేయమని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హైడ్రాకు విజ్ఞప్తి చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా మైనింగ్‌కు పాల్పడుతున్న యూనిట్లను తొలగించాలని కోరారు. గౌలిదొడ్డిలో గ్రేట్ ఇండియా మైనింగ్ సంస్థ, వట్టినాగులపల్లిలోని మూడు చోట్ల పరమేశ్ సింగ్ స్టోన్ క్రషర్, శ్రీ లక్ష్మీ కన్‌స్ట్రక్షన్స్, పృథ్వీ స్టోన్ క్రషర్, కొత్వాల్‌గూడలో స్టోన్ క్రషర్ సంస్థలు అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డాయి. ఈ సంస్థలకు తోడు మక్తా భగత్‌సింగ్ అనే వ్యక్తి స్టోన్ క్రషింగ్‌ను పెద్దఎత్తున చేపట్టారు.

# షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న పంటలు దగ్ధం





## రెండు చోట్ల అగ్నిప్రమాదాలు, రైతులకు భారీ నష్టం

- వావిలాలలో 50 ఎకరాలు బూడిద
- వేంపల్లిలో 1.5 ఎకరాల పంట నష్టం.. నష్టపరిహారం అందిస్తామన్న హామీ

**జమ్మికుంట/మల్లాపూర్, మే 5 (జనంసాక్షి):** విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా రెండు వేర్వేరు ప్రాంతాల్లో మొక్కజొన్న పంటలు అగ్నికి ఆహుతై రైతులకు భారీ నష్టం వాటిల్లింది. జమ్మికుంట మండలం వావిలాల గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు 50 ఎకరాల మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైంది. ఈ సందర్భంగా వావిలాల గ్రామ సర్పంచ్ కొండ అర్జున్ మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లముందే బూడిద కావడం బాధాకరమన్నారు. బాధిత రైతులు ఎవరూ అధైర్యపడవద్దని, ఈ కష్ట సమయంలో తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం లేదా సాంకేతిక లోపం కారణంగా జరిగిన ఈ ఘటనపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వం ద్వారా తగిన నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఇదిలా ఉండగా మల్లాపూర్ మండలం వేంపల్లి గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో మరో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సుమారు 1.5 ఎకరాల మొక్కజొన్న పంట దగ్ధమైందని ఆర్ఐ అశోక్ తెలిపారు. బాధిత మహిళా రైతు గుమ్ముల లత మాట్లాడుతూ ఈ ప్రమాదంతో సుమారు రూ.1.50 లక్షల వరకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. పునరావృతమవుతున్న ఇలాంటి ఘటనలపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తుండగా, సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# మొక్కజొన్నలు అమ్ముకునేందుకు అరిగోస

- రసమయి బాలకిషన్‌కు సమస్యలు వివరించిన కేషన్నపల్లి రైతులు
- ఎకరానికి 26 క్వింటాళ్ల కొనుగోలుతో నష్టం
- మిగిలిన పంటను దళారులకు తక్కువ ధరకు అమ్మకాలు
- 35 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయాలని డిమాండ్



**ఇల్లంతకుంట, మే 5 (జనంసాక్షి):** ఇల్లంతకుంట మండలం కేషన్నపల్లి గ్రామ రైతులు మొక్కజొన్న పంటను పండించినప్పటికీ అమ్ముకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ దృష్టికి తీసుకువచ్చారు.

ఇల్లంతకుంట నుంచి బెజ్జంకి వైపు వెళ్తున్న సమయంలో కేషన్నపల్లి వద్ద మొక్కజొన్న కంకులు ఏరుతున్న రైతులను గమనించిన రసమయి బాలకిషన్, వాహనం ఆపి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, ప్రభుత్వం ఎకరానికి 26 క్వింటాళ్ల దిగుబడినే కొనుగోలు చేస్తుండటంతో మిగిలిన పంటను దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని కన్నీటి పర్యంతమయ్యారు. గతంలో సాగునీటి సౌకర్యం లేక పత్తి పంటకే పరిమితమయ్యామని, అయితే అనంతగిరి డ్యాం, కాల్వల నిర్మాణంతో ఇప్పుడు సంవత్సరానికి మూడు పంటలు పండిస్తున్నామని తెలిపారు. అయినప్పటికీ సరైన ధరలు లేక తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నా మని వాపోయారు. ఈ సందర్భంగా రసమయి బాలకిషన్ మాట్లాడుతూ, ప్రభుత్వం రైతులకు అనుకూలంగా వ్యవహరించడం లేదని విమర్శించారు. ఎకరానికి కనీసం 35 క్వింటాళ్ల వరకు మొక్కజొన్నలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను సులభంగా విక్రయించుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాల్లో సరైన ఏర్పాట్లు చేసి, రైతులు దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి రాకుండా చూడాలని ఆయన పేర్కొన్నారు.

# పాల్వంచ పీపీసీని సందర్శించిన జిల్లా కలెక్టర్

**కామారెడ్డి ప్రతినిధి, మే 05 (జనం సాక్షి) :** మంగళవారం జిల్లా కలెక్టర్ పాల్వంచ మండలంలోని పీఏసీఎస్ మాచారెడ్డి పరిధిలో కొనసాగుతున్న పాల్వంచ పీపీసీ వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో వరి కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుండగా, ఒక లారీ లోడింగ్ పూర్తయినట్లు పరిశీలించారు. జిల్లా కలెక్టర్ డీసీవో, డీఎంసీఎస్, డీసీఎస్ఓ అధికారులకు తూకం ప్రక్రియను వేగవంతం చేయాలని, రైతుల ధాన్యం త్వరితగతిన కొనుగోలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే సరిపడా రవాణా సౌకర్యాలు కల్పించి, రైస్ మిల్లుల వద్ద వాహనాల అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పీపీసీల వద్ద అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని, వరి కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సూచించారు. వరి కొనుగోలు పూర్తిగా ఎఫ్ఏక్యూ నిబంధనల ప్రకారం చేపట్టాలని, ధాన్యసేతు యాప్‌లో కొనుగోలు వివరాలను నమోదు చేయాలని, రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరించాలని తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో ఎలక్ట్రీషియన్ మృతి

**శేరిలింగంపల్లి, మే 05 (జనంసాక్షి) :** రోడ్డు ప్రమాదంలో ఓ ఎలక్ట్రీషియన్ దుర్మరణం పాలైన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి 11:30 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. ఈ మేరకు రాయదుర్గం సీఐ మంగళవారం వెల్లడించిన వివరాల ప్రకారం... ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బాల్య ప్రాంతానికి చెందిన షహజాద్(28) బ్రతుకు తెరువు నిమిత్తం నగరానికి వచ్చి గచ్చిబౌలి పరిధి డైమండ్ హిల్స్ ప్రాంతంలో నివాసం అంటూ ఎలక్ట్రిషన్ గా జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 4వ తేదీ రాత్రి 11:30 ప్రాంతంలో తన పనులను ముగించుకొని మై హోమ్ ట్విట్జా భవనం వద్ద ఓ గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టడంతో తీవ్ర గాయాల పాలై రక్తస్రావం జరిగి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. డైమండ్ హిల్స్ ప్రాంతానికి చెందిన అతని బంధువు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రాయదుర్గం సిఐ వెల్లడించారు.

# మోదీ సభను డైవర్ట్ చేసేందుకే సీబీఐ డ్రామాలు

- వడ్ల కొనుగోళ్లలో రైతుల ఇబ్బందులపై ఆగ్రహం
- ఐదు రాష్ట్రాల ఫలితాల చర్చను మళ్లించే ప్రయత్నమని ఆరోపణ
- కొనుగోలు కేంద్రాల్లో రైతుల అరిగోసపై విమర్శలు
- ఖాజీపూర్ కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్



**కరీంనగర్ బ్యూరో, మే 05 (జనంసాక్షి) :** ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు, ఈనెల 10న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరగనున్న ప్రధాని సభపై జరుగుతున్న చర్చను దారి మళ్లించేం దుకే రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణ పేరుతో డ్రామాలు ఆడుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. మండుటెండలో వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. కరీంనగర్ జిల్లా ఖాజీపూర్‌లోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన, రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వడ్ల కొనుగోలు ఆలస్యం అవుతుండటంతో రోజులు తరబడి కేంద్రాల వద్దే ఉండాల్సి వస్తోందని, తాలు, తరుగు పేరుతో బస్తాకు 4-5 కిలోల వరకు కోతలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళారులు టోకెన్ల కోసం కమీషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇందుపై స్పందించిన కేంద్ర మంత్రి, రైతులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రతి గింజకు కేంద్రం చెల్లింపులు చేస్తోందని, అయినా రాష్ట్రం కొనుగోళ్లలో ఆలస్యం చేయడం సరికాదన్నారు. అలాగే సీబీఐ విచారణ అంశంపై స్పందిస్తూ, కేసీఆర్‌ను అరెస్ట్ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వానికి సామర్థ్యం లేదని ఒప్పుకుని కేంద్రానికి లేఖ రాయాలని సూచించారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఘనంగా సబితా ఇంద్రారెడ్డి జన్మదిన వేడుకలు

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లో ఉత్సాహభరిత కార్యక్రమం
- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, కార్యకర్తలు



**రాజేంద్రనగర్, మే 5 (జనంసాక్షి):** బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి జన్మదిన వేడుకలను రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. బండ్లగూడ మెయిన్ రోడ్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద జరిగిన ఈ కార్యక్రమాన్ని సర్కిల్ అధ్యక్షుడు రావులకోల్ల నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు బాణాసంచా పేల్చి, కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలియజేశారు. సర్కిల్ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ, సబితా ఇంద్రారెడ్డి ప్రజాసేవలో అంకితభావంతో పనిచేస్తూ రాజేంద్రనగర్ అభివృద్ధికి విశేష కృషి చేశారని పేర్కొన్నారు. పేద ప్రజలకు అండగా నిలుస్తూ "చేవెళ్ల చెల్లెమ్మ"గా ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని అన్నారు. కార్యనిర్వాహక అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ వి. రాముడు యాదవ్ మాట్లాడుతూ, ఆమె నాయకత్వం, సేవా దృక్పథం పార్టీ కార్యకర్తలకు స్ఫూర్తిదాయక మని తెలిపారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగాని రవికుమార్, కోశాధికారి శాంతి కుమార్, బీసీ సెల్ అధ్యక్షుడు పెంటయ్య యాదవ్, బండ్లగూడ టౌన్ అధ్యక్షుడు సుధాకర్ గౌడ్ తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# వరి ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలి

## కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాలు... కొనుగోలు కేంద్రంపై ఆకస్మిక తనిఖీ

**మల్యాల, మే 5 (జనంసాక్షి):** మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. కేంద్రంలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.

ధాన్యం తూకం, నిల్వ, రవాణా ప్రక్రియల్లో నిర్లక్ష్యం లేకుండా చూడాలని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అకాల వర్షాల పరిస్థితుల్లో గన్ని సంచులు, టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచుకుని ధాన్యాన్ని రక్షించాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి, రైతుల ఖాతాల్లో సకాలంలో చెల్లింపులు జమ అయ్యేలా చూడాలని ఆదేశించారు. అలాగే మిల్లుల వద్ద త్వరితగతిన అన్‌లోడింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ పరిశీలనలో ఆర్డీవో మధుసూదన్, మండల తహసీల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## శామీర్‌పేట్ డివిజన్‌లో మౌలిక వసతులపై

# జోనల్ కమిషనర్ పరిశీలన

- 'మీ సమస్య - మా పరిష్కారం" కార్యక్రమానికి స్పందన
- గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై సమీక్ష



**శామీర్‌పేట్, మే 5 (జనంసాక్షి):** మల్కాజ్గిరి కార్పొరేషన్ జోనల్ కమిషనర్ సంచిత్ గంగావర్ శామీర్‌పేట్ డివిజన్ పరిధిలో మౌలిక వసతులపై విస్తృతంగా పరిశీలన నిర్వహించారు. మహిళా శక్తి "మై వాయిస్" సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన "మీ సమస్య -- మా పరిష్కారం" కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు సమర్పించిన వినతిపత్రానికి స్పందించి ఆయన ఈ పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ బృందం సింగాయిపల్లి, హకీంపేట్, పోతాయిపల్లి, శామీర్‌పేట్ గ్రామాల్లో సుడిగాలి పర్యటన నిర్వహించి రోడ్లు, డ్రైనేజీ సమస్యలను స్థానికులతో కలిసి పరిశీలించింది. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకొని, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా శక్తి మై వాయిస్ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు హైమారెడ్డి, కోశాధికారి అంబటి రమేష్, స్థానికులు చంద్రశేఖర్, మచ్చేందర్, భిక్షపతి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ హ్యాండ్‌బాల్‌లో తెలంగాణకు రజత, కాంస్య పతకాలు

## కరీంనగర్ క్రీడాకారుల ప్రతిభకు కలెక్టర్ చిత్ర మిశ్రా ప్రశంసలు

కరీంనగర్ టౌన్, మే 5 (జనంసాక్షి): హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హన్మకొండ లో నిర్వహించిన 41వ సౌత్ జోన్ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్లు ప్రతిభ చాటాయి. పురుషుల జట్టు రజత పతకం, మహిళల జట్టు కాంస్య పతకం సాధించి రాష్ట్రానికి గౌరవం తీసుకొచ్చాయి. ఈ విజయాల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఎస్. అమరేందర్, ఏ. సాయి కృష్ణ, జె. రాజు, టి. జితేందర్, ఏ. సంపూర్ణ, బి. యోగేశ్వరీలు తెలంగాణ జట్టులో కీలక పాత్ర పోషించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా అభినందిస్తూ, క్రీడాకారుల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వీర్ల వెంకటేశ్వర్ రావు, కార్యదర్శి బసరవేణి లక్ష్మణ్, డీవైఎస్ఓ శ్రీనివాస్ గౌడ్, ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులు నందెల్లి మహిపాల్, జనార్ధన్ రెడ్డి తదితరులు విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

# అక్రమ క్రషింగ్ యూనిట్లపై హైడ్రా చర్యలు





- అనుమతి లేని ఆర్ ఎంసీ ప్లాంట్లనూ తొలగింపు
- పీసీబీ, మైనింగ్ శాఖల ఫిర్యాదుతో ఒకే రోజు 4 చోట్ల హైడ్రా ఆపరేషన్లు

**శంషాబాద్, మే 5 (జనంసాక్షి) :** అనుమతిలేని క్రషింగ్ యూనిట్లపై హైడ్రా చర్యలు తీసుకుంది. వేర్వేరు ప్రాంతాల్లో మంగళవారం 8 క్రషింగ్ యూనిట్లతో పాటు, 13 ఆర్ఎంసీ ప్లాంట్లలో మూడింటిని నేలమట్టం చేసింది. మిగిలిన 10 ఆర్ఎంసీ ప్లాట్లను తొలగించాల్సి ఉంది. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ), మైనింగ్ తో పాటు.. రెవెన్యూ శాఖల ఫిర్యాదు మేరకు మంగళవారం హైడ్రా ఈ చర్యలు తీసుకుంది. మెన్ అండ్ మెషనరీ కావాలని పీసీబీ, మైనింగ్, రెవెన్యూ అధికారులు కోరడంతో హైడ్రా రంగంలోకి దిగి ఈ ఆపరేషన్‌ను చేపట్టింది. పీసీబీ, మైనింగ్, రెవెన్యూ అధికారుల సమక్షంలో... రంగారెడ్డి జిల్లా గౌలి దొడ్డి, వట్టినాగులపల్లి, గోపన్నపల్లి, శంషాబాద్‌లోని కొత్వాల్‌గూడ లో ఏళ్లుగా నడుస్తున్న క్రషింగ్ యూనిట్లను తొలగించింది. బినామీ పేర్లతో.. బడా సంస్థల అండదండలు, బడాబాబులు వెనకుండి నడిపిన యూనిట్లు నేలమట్ట మయ్యాయి. ఇందులో ఏ ఒక్క క్రషింగ్ యూనిట్‌కూ మైనింగ్‌తో పాటు, పీసీబీ అనుమతులు లేకపోవడం గమనించాల్సిదగ్గ అంశం. పీసీబీ నోటీసులు, రెవెన్యూ శాఖ ఆదేశా లు, మైనింగ్ శాఖ అభ్యంతరాలు ఏవీ పట్టించుకోకుండా నడుస్తున్న యూనిట్లు హైడ్రా చర్యలతో మంగళవారం నేల మట్టమయ్యాయి.

### కొండల్ని కాజేశారు...

సహజసిద్ధమైన కొండలు.. చిట్టడవిని తలపించే విధంగా ఉన్న గుట్టలను ఎలాంటి అనుమతి లేకుండా ధ్వంసం చేస్తున్నారని పీసీబీ, రెవెన్యూ, మైనింగ్ శాఖలు హైడ్రాకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నా యి. ప్రకృతి విధ్వంశానికి పాల్పడ్డాయని తెలిపాయి. రాత్రీ పగలూ అనే తేడా లేకుండా.. క్రషింగ్ చేసి దుమ్ము రేపి వాయు కాలుష్యానికి కారణమయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నాయి. ఇదంతా ఓఆర్ ఆర్ పరిధిలోనే జరుగుతుండడం గమనార్హం. అక్రమంగా నడుస్తున్న క్రషింగ్ యూనిట్లతో పాటు.. వర్కింగ్ లైసెన్సు లేని ఆర్ ఎం సీ (రెడీ మిక్స్ కాంక్రీట్) యూనిట్లను కూడా హైడ్రా తొలగించింది. భవిష్యత్తులో అక్కడ స్టోన్ క్రషింగ్ చేయడానికి వీలు లేకుండా.. పరికరాలను నేలమట్టం చేసింది. భగత్‌సింగ్ స్టోన్ క్రషర్, ఎస్‌వీకే, పరమేశ్వర్ స్టోన్, ప్రథ్వి, గ్రేట్ ఇండియా మైనింగ్, ఆర్ మిల్లర్, తిరుమల మెటల్ ఇండస్ట్రీకి చెందిన క్రషింగ్ యూనిట్లతో పాటు.. బీఎస్ ఆర్, అల్ట్రాటెక్, ఏసీసీ రెడీమిక్స్ ప్లాంట్లు ఇందులో ఉన్నాయి.

### బినామీ పేర్లతో.. ..

ఈ ప్లాంట్లు ఎవరివి అంటే సరైన చిరునామా లేకుండా సాగిపోతున్నాయి. ఎన్నిఎకరాలు లీజుకు తీసుకున్న వివరాలు లేవు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని కొత్వాల్‌గూడలో దాదాపు 16 ఎకరాల మేర విస్తరించి అందులో 7 ఎకరాల వరకూ కొండల్ని పిండి చేసినట్టు ఆనవాళ్లు కనిపించాయి. తిరుమల మెటల్ ఇండస్ట్రీకి చెందిన క్రషింగ్ యూనిట్ ఇక్కడ నడుస్తోంది. దీనిని మొత్తం తొలగించడమైంది.

ఇక్కడే మరో రెండు ఆర్ ఎంసీ ప్లాంట్లను కూడా హైడ్రా మంగళవారం తొలగించింది. బడాసంస్థల అండదండలతో.. బినామీ పేర్లతో నడుస్తున్నట్టు పీసీబీ, రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు చెబుతున్నారు. ఔటర్ రింగు రోడ్డుకు ఆనుకుని ఈ యూనిట్లు ఉన్నాయి. ప్రకృతి విధ్వంసం ఆపిన హైడ్రాను అభినందించారు.

# ఆన్‌లైన్‌లో ఫ్రీల ఉచ్చులో చిక్కకండి : సైబర్ క్రైమ్స్ డిసిపి

**శేరిలింగంపల్లి, మే 05 (జనంసాక్షి) :** మొబైల్ ఫోన్లు, పర్సనల్ కంప్యూటర్లు, లాప్టాప్ లను వినియోగించేవారు వాటిలో తరచుగా కనిపించే ఫ్రీ డౌన్లోడ్, ఇతర ఆకర్షణీయమైన ఆన్లైన్ ప్రకటనల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ సైబర్ క్రైమ్స్ డిసిపి వివరించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. మాదాపూర్ పరిధిలోని ఓ వ్యక్తి తన మొబైల్ ఫోన్లో ఫేస్ బుక్ ను చూస్తూ అందులో కనిపించిన 'లేటెస్ట్ సినిమాలను ఫ్రీగా చూడండి' అనే ప్రకటనకు ఆకర్షితుడై ఆప్ డౌన్లోడ్ చేసుకోవడం జరిగింది. సదరు ఆప్ ను స్త్రసజూతీ.బఎఱ్‌జ అనే వెబ్సైట్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవడం జరిగింది. చౌకగా దొరికిందని ఏకంగా ఓ సినిమాను కూడా అతను చూడడం జరిగింది. సినిమా చూస్తున్న సమయంలోనే సంబంధం లేని ఓ సాఫ్ట్వేర్ ఆటోమేటిగ్గా డౌన్లోడ్ కావడం, కొంతసేపటి తర్వాత యూపీఐ సేవలు, ఇతర కీలకమైన ప్రక్రియలు నిలిచిపోవడంతో అనుమానం వచ్చి తన బ్యాంకు ఖాతాను సరిచూసుకోగా అందులో నుండి 80 వేలు, తన తల్లి ఖాతా నుండి మరో 95 వేలు డెబిట్ అయినట్లు గుర్తించడం జరిగింది. తీరా జరిగిన మోసాన్ని నెమరేసుకుంటే ఆన్లైన్ ద్వారా తాను డౌన్లోడ్ చేసుకున్నది నిజమైన వెబ్సైట్ కాదని, సైబర్ నేరస్తులు విసిరిన ఓ సాఫ్ట్వేర్ మాల్వేర్ వల అని తెలుసుకున్నాడు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోవడంతో లబోదిబోమని ముట్టుకోవడం అతనివంతైందని డిసిపి తెలియజేశారు. ప్రజలు దీనిని ఒక పాఠంగా తీసుకొని సోషల్ మీడియా ద్వారా వచ్చే లింకులను అంత సులువుగా నమ్మవద్దని, ఏపీకె ఫైళ్లను, గుర్తుతెలియని లింకులను ఓపెన్ చేయకూడదని సూచించారు. మొబైల్ ఆపరేటింగ్ సిస్టం అప్డేట్ లను అధికారిక ఫోన్ సెట్టింగ్స్ ద్వారానే చేసుకోవాలని, ఒకవేళ ఏదైనా మోసానికి గురైతే వెంటనే ఇంటర్నెట్ కనెక్షన్ ను నిలుపుదల చేయాలని, అనుమానాస్పద యాప్లను ఫోన్ నుండి తొలగించాలని, తరచుగా బ్యాంక్ పాస్వర్డ్లు, యూపీఐ పిన్ నెంబర్లను మార్చాలని డిసిపి సూచించారు. 1930 సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ కు కాల్ చేసి నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా తమకు జరిగిన అన్యాయాన్ని నమోదు చేయాలని డిసిపి సూచించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
6 మే 2026

# పంట మార్పిడి,సేంద్రీయ సాగుతో అధిక దిగుబడులు

- మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను రైతులు సాగు చేయాలి
- తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, కరీంనగర్ వ్యవసాయ శాస్త్రవేత్తలు డా హరికృష్ణ, డా కె. మదన్ మోహన్ రెడ్డి



**చిగురుమామిడి మే05 (జనంసాక్షి) :**
కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ముల్కనూర్ గ్రామంలో రైతులు పంట మార్పిడి విధానాన్ని పాటించాలని,దీని ద్వారా నేల సారవంతత పెరుగుతుందని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం,కరీంనగర్ వ్యవసాయ శాస్త్రవేత్తలు డా.హరికృష్ణ మరియు డా.కె.మదన్ మోహన్ రెడ్డి సూచించారు.యూరియా వినియోగం, సేంద్రీయ వ్యవసాయం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో ముల్కనూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో రైతులకు వివిధ పంటల సాగు పద్ధతులు,నేల ఆరోగ్యం మెరుగు పరచడం,సేంద్రీయ ఎరువుల వినియోగం వంటి అంశాలపై వివరించారు.
రైతులు నిరంతరం ఒకే పంట వేయడం వల్ల నేలలో పోషకాలు తగ్గిపోతాయని, పంట మార్పిడి ద్వారా ఆ లోటును భర్తీ చేయవచ్చని తెలిపారు.పంటల ఎంపికలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్,హుస్నాబాద్ కంది తిరుపతి రెడ్డి మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువులు, ముఖ్యంగా యూరియా వాడకాన్ని తగ్గించి సేంద్రీయ పద్ధతిలో పంటలను పండించాలని కోరారు. ముల్కనూర్ సర్పంచ్ భారతమ్మ కొమురయ్య మాట్లాడుతూ రైతులు శాస్త్రవేత్తల సలహాలు పాటిస్తూ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేస్తూ అధిక లాభాలు పొందాలని సూచించారు. తదనంతరం ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. రైతులకు పంటల మార్పిడి విధానం వల్ల లభించే లాభాలను వివరించారు.అదనంగా,పంటల సాగులో ఆధునిక పద్ధతులను అనుసరించడం ద్వారా దిగుబడులు పెంచుకోవచ్చని సూచించారు.అలాగే మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వరి రకాలు వేయాలని రైతులకు సూచించారు.తదనంతరం ప్రజాపాలన ఉత్సవాలలో భాగంగా మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో సాయిల్ హెల్త్ కార్డ్‌లను రైతులకు అందజేశారు.అలాగే మండల వ్యవసాయ అధికారి టీ పున్నం చందర్ రెడ్డి మట్టి నమూనా సేకరణ విధానాన్ని రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పి.వెంకటేష్ గౌడ్,విత్తన ధృవీకరణ అధికారి పి. నవీన్ రెడ్డి,వ్యవసాయ విస్తరణ అధికారి.ప్రణయ్,రైతులు పాల్గొన్నారు.

# స్వశక్తి మహిళలు వృత్తిలో నైపుణ్యం పెంచుకోవాలి

**రామగుండం నగరపాలక కమిషనర్ అరుణశ్రీ**



**గోదావరిఖని, జనంసాక్షి :** మహిళలు ఎంచుకున్న రంగంలో ఎదిగేందుకు ఆ రంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ నైపుణ్యాశీ పెంపొందించుకోవాలని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సమస్త కమిషనర్ జె. అరుణశ్రీ అన్నారు. విధ్యార్థుల యూనిఫామ్ కుట్టడంలో నైపుణ్యం పెంపొందించడానికి మెప్మా, ఎపి ప్రొడక్టివిటీ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో జమ్మికుంటలో నిర్వహించిన శిక్షణా కేంద్రంలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న యాభయ్ మంది స్వశక్తి మహిళలకు రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో మంగళ వారం నిర్వహించిన కార్యక్రమంలో ధృవీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ. టైలరింగ్ వృత్తిలో ఉన్న మహిళలను గుర్తించి వృత్తి నైపుణ్యం మెరుగుపరచడానికి ఈ శిక్షణ ఇవ్వడం జరిగిందని అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు యూనిఫామ్ కుట్టడానికి ఆర్డర్ ఇవ్వడంలో ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అర్హత ఉన్న స్వశక్తి మహిళలు వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవడానికి అవసరమైన సహకారం మెప్మా ఆధ్వర్యంలో ఉచితంగా అందిస్తామని అన్నారు, కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో రామగుండం నగర పాలక సంస్థ సెక్రెటరీ మహేశ్వర్ రెడ్డి, మెప్మా టిఎంసి మౌనిక, సిఓలతో పాటు ఎపి ప్రొడక్టివిటీ కౌన్సిల్ కో ఆర్డినేటర్ శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోళ్లపై తహసీల్దార్ ఆకస్మిక తనిఖీ

**లారీల కొరతతో రైతుల ఆవేదన**

**సిరికొండ, మే 5 (జనంసాక్షి):** సిరికొండ మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో వడ్ల కొనుగోలు ప్రక్రియ, నిల్వ పరిస్థితులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. తనిఖీ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. లారీల కొరత కారణంగా కొనుగోలు చేసిన వడ్లు గోదాములకు తరలించ లేక సంచుల్లోనే ఎండలో పడివున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొందూరు, సిరికొండ గ్రామాల్లో నాలుగు రోజుల క్రితమే తూకం వేసిన వడ్లు ఇంకా తరలింపుకాకపోవడంతో నాణ్యత దెబ్బతింటోందని తెలిపారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే లారీలు ఏర్పాటు చేసి వడ్లను గోదాములకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

# జహీరాబాద్ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం

**చేవెళ్లకు చెందిన ఇద్దరు యువకులు మృతి, నలుగురికి తీవ్ర గాయాలు**



**చేవెళ్ల, మే 5 (జనంసాక్షి):**
జహీరాబాద్ శివారులో జాతీయ రహదారి-65పై మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో చేవెళ్ల మండలానికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన జహీరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పస్తాపూర్ ఫ్లైఓవర్ వద్ద ఉదయం సుమారు 5 గంటలకు జరిగింది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మున్సిపాలిటీ కేసారం వార్డుకు చెందిన కాసుల మహేష్ గౌడ్ (27) తన స్నేహితులు, బంధువులతో కలిసి మహారాష్ట్రలోని తుల్జాపూర్ భవానీ మాత దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వీరు ప్రయాణిస్తున్న హుందాయి వెన్యూ కారు (టీఎస్ 07 జీవై 4934) రోడ్డుపై నిలిపి ఉంచిన టాటా ట్రాలీ ఆటో (ఎంహెచ్ 25 ఏజే 3369)ను వెనుక నుండి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ముందు సీట్లో ఉన్న కాసుల మహేష్ గౌడ్ (27), వెనుక సీట్లో ఉన్న మైలాపురం రోహిత్ కుమార్ (17) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ఉన్న నాంపల్లి కార్తీక్ (27), ఆతేంద్ర సాయి (9), నితిన్ గౌడ్ (6), కె.నర్సింలు (32) తీవ్రంగా గాయపడగా, వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని కాంటినెంటల్ దవాఖానకు తరలించారు. ట్రాలీ ఆటో డ్రైవర్ ఎలాంటి హెచ్చరిక సూచనలు లేకుండా నిర్లక్ష్యంగా వాహనాన్ని రోడ్డుపై నిలిపివేయడం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడు మహేష్ గౌడ్ తండ్రి కాసుల సుదర్శన్ గౌడ్ ఫిర్యాదు మేరకు జహీరాబాద్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సొసైటీల పదవీకాలం పొడిగిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

జమ్మికుంట, మే 5 (జనం సాక్షి):తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాత పాలక కమిటీల పదవి కాలాన్ని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2025 ఫిబ్రవరి 14వరకు ఉన్న మేనేజింగ్ కమిటీలను ప్రస్తుతం పి ఐ సి (పాత పాలక వర్గం) కమిటీలుగా కొనసాగించనుంది. ప్రభుత్వం సహకార ఎన్నికలపై తుది నిర్ణయం తీసుకునే వరకు పాత కమిటీలు కొనసాగించాలని హైకోర్టు తీర్పు వెల్లడించిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.ఈ మేరకు జమ్మికుంట సొసైటీ చైర్మన్ గా పొనగంటి సంపత్ మంగళవారం బాధ్యతలు తీసుకున్నట్లు తెలిపారు.

# ప్రాణహిత-చేవెళ్లకు జాతీయ హోదా కల్పించాలి

- ప్రధాని మోడీకి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి
- రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం తీసుకోవాలి
- పంట వ్యర్థాలను కాల్చకుండా బయో గ్యాస్ ప్లాంట్‌లకు తరలించి రైతులు అదనపు ఆదాయం పొందండి
- ఆధునిక సాగు పద్ధతులను అవలంబించడం ద్వారానే వ్యవసాయం పండుగలా మారుతుంది
- గంభీరావుపేటలో కంప్రెస్ట్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల సమక్షంలో శంకుస్థాపన





**గంభీరావుపేట మే 05(జనం సాక్షి) :**
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తక్షణమే జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు విజ్ఞప్తి చేశారు. సిరిసిల్లా జిల్లా గంభీరావుపేట గ్రామంలోని పంతులుగారి తోటలో బయోస్ట్రాటమ్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటేడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి మంగళవారం డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్క మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్ తో కలిసి భూమి పూజ చేశారు. అలాగే సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి నియోజక వర్గం లోని 11 ప్రాంతాలలో 30 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 33/11 కేవీ సబ్ స్టేషన్ లకు శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి ఉప ముఖ్యమంత్రి మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణలోని ఒక ప్రధాన సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని కోరారు. తెలంగాణలో రైతులు పండించే ప్రతి పంటను కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం మొత్తం తీసుకోవాలని కోరారు. రైతులకు అనేక రకాల ప్రోత్సహకాలు అందించి రైతులకు అండగా నిలబడిందన్నారు. వ్యవసాయ రంగంలో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతూ వరి గడ్డిని ముడిసరుకుగా ఉపయోగించి బయో గ్యాస్ ఉత్పత్తి చేసే బృహత్తర ఆలోచనను రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం కార్యరూపంలోకి తెస్తోందన్నారు. సాధారణంగా పంట కోతల అనంతరం రైతులు పొలాల్లోనే గడ్డిని కాల్చివేయడం వల్ల వాతావరణం కలుషితమై ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ పడిపోతున్న తరుణంలో, ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. దీనివల్ల పర్యావరణానికి రక్షణ కలగడమే కాకుండా, రైతులకు వ్యర్థాల ద్వారా అదనపు ఆదాయం లభించే అవకాశం ఉందని వివరించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న నేపథ్యంలో, అభివృద్ధి చెందిన దేశాల బాటలో మన రైతాంగం కూడా అడుగులు వేయాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోందన్నారు. సమాజానికి ఆహారాన్ని అందించే రైతు, ఆరోగ్యకరమైన గాలిని కూడా అందించాలనే ఉద్దేశంతో పంట వ్యర్థాలను కాల్చకుండా బయో గ్యాస్ ప్లాంట్‌లకు సరఫరా చేయాలని కోరారు.
మరోవైపు, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు పంట మార్పిడి విధానాన్ని రైతులు పాటించాలని కోరారు. కేవలం వరి మీదనే ఆధారపడకుండా ఉద్యానవన పంటలు, చిరుధాన్యాలు, ఆయిల్ పామ్ వంటి లాభదాయకమైన పంటల వైపు రైతులు దృష్టి సారించినప్పుడే ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని తెలిపారు. వీటి సాగు వల్ల రైతులకు ఆదాయం పెరగడమే కాకుండా సమాజానికి పోషక విలువలతో కూడిన ఆహారం అందించిన వారవుతారని చెప్పారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వం, పండించిన ప్రతి గింజకూ కనీస మద్దతు ధర కల్పించేందుకు కృతనిశ్చయంతో ఉందని. మద్దతు ధర ప్రకటించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన వ్యవస్థను ఏర్పుట చేసిందన్నారు. పాత పద్ధతులకు స్వస్తి పలికి, ఆధునిక సాగు పద్ధతులను అవలంబించడం ద్వారానే వ్యవసాయం పండుగలా మారుతుందని, ఈ మార్పులో రైతులందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, డీఎస్పీ నాగేంద్రాచారి, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచ్ మల్లుగారి పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి మూడు నెలలకు ఒకసారి జాబ్ మేళాలు

**నిరుద్యోగులకు అవకాశాల కల్పనపై కలెక్టర్ చిత్రా మిశ్రా దృష్టి**

**విజయవంతమైన మెగా జాబ్ మేళా.. 90 కంపెనీలో 997 మందికి ప్రాథమిక ఎంపిక**




**కరీంనగర్, మే 5 (జనంసాక్షి):**
జిల్లాలో ప్రతి మూడు నెలలకు ఒకసారి జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో జాబ్ మేళాను విజయవంతంగా నిర్వహించారని ప్రశంసించారు. రాబోయే రోజుల్లో ఇదే స్ఫూర్తితో మరిన్ని జాబ్ మేళాలను నిర్వహించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. హైదరాబాద్‌తో పాటు స్థానిక కంపెనీల్లో కూడా అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మెగా జాబ్ మేళాకు నిరుద్యోగ యువత నుంచి అనూహ్య స్పందన లభించింది. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల నుంచి సుమారు 3,000 మంది యువతీ యువకులు హాజరయ్యారు. ఐటీ, నాన్-ఐటీ, హెల్త్‌కేర్, అగ్రికల్చర్, డైరీ తదితర రంగాలకు చెందిన సుమారు 90 కంపెనీలు పాల్గొని నియామక ప్రక్రియ చేపట్టాయి.
ఈ సందర్భంగా 997 మంది అభ్యర్థులు వివిధ ఉద్యోగాలకు ప్రాథమికంగా ఎంపిక కాగా, మరో 478 మందిని కంపెనీలు తక్షణమే ఎంపిక చేసి త్వరలో నియామక పత్రాలు అందజేయనున్నాయి. అభ్యర్థుల సౌకర్యార్థం 95 స్టాల్స్ ఏర్పాటు చేసి, హెల్ప్‌డెస్క్‌ల ద్వారా సందేహాలు నివృత్తి చేశారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కూలర్లు, తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు మజ్జిగ పంపిణీ చేసి అభ్యర్థులకు ఉపశమనం కల్పించారు. మొత్తం కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కే. మహేశ్వర్, జిల్లా ఉపాధి కల్పన అధికారి తిరుపతిరావు, డివైఎస్ఓ శ్రీనివాస్ గౌడ్, పరిశ్రమల శాఖ జీఎం సాల్మన్ రాజు, పీడీ మెప్మా స్వరూపరాణి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి తదితరులు పాల్గొన్నారు

# రూ.కోటి సీఎస్ఆర్ నిధులతో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు

- నాల్కో సహకారంతో జిమ్‌లను ఏర్పాటు చేసిన మలయప్ప ఫౌండేషన్
- దుర్శేడు, కిసాన్ నగర్‌లో ప్రారంభించిన కేంద్ర మంత్రి బండి సంజయ్



**కరీంనగర్ బ్యూరో, మే 05 (జనంసాక్షి) :**
ప్రధానమంత్రి నరేంద్రమోదీ "ఫిట్ ఇండియా' నినాదాన్ని పురస్కరించుకుని కరీంనగర్ ప్రజలకు ఓపెన్ జిమ్‌లు అందుబాటులోకి వచ్చాయి. దాదాపు కోటి రూపాయల వ్యయంతో 17 డివిజన్లలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటవుతున్నాయి. నాల్కో సంస్థ అందిస్తున్న సీఎస్సార్ నిధుల సహకారంతో మలయప్ప ఫౌండేషన్ నిర్వాహకులు ఈ ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం రోజు నగరంలోని కిసాన్ నగర్ అంబేద్కర్ యూత్ క్లబ్ సమీపంలో, దుర్శేడులో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు ఓపెన్ జిమ్‌లను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్ప, స్థానిక కార్పొరేటర్ల తో కలిసి ఆయా ఓపెన్ జిమ్ లను కేంద్ర మంత్రి ప్రారంభించారు. కేంద్ర మంత్రి సహకారంతో పూర్తిగా ప్రైవేట్ సంస్థలు అందిస్తున్న సీఎస్సార్ నిధులతోనే ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసినట్లు మలయప్ప ఫౌండేషన్ డైరెక్టర్లు డాక్టర్ గడ్డం అరుంజయ్, గడ్డం అనూష తెలిపారు. నిత్యం ఉరుకులు పరుగులతో ఉద్యోగాల్లో బిజీగా ఉంటూ శారీరక ఫిట్‌నెస్‌ను కోల్పోతున్న వారికి ఈ ఓపెన్ జిమ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కరీంనగరలో మొత్తం 17 డివిజన్లలో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. కరీంనగర్ ప్రజలంతా ఈ ఓపెన్ జిమ్‌లను ఉపయోగించుకుని శారీరక ధృఢత్వాన్ని పెంచుకోవాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచించారు.

# కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకో.. లేదంటే కాంగ్రెస్ కార్యకర్తలు గట్టి బుద్ధి చెప్తారు

- అంతర్రాష్ట్ర దొంగలకు సీఎంకి లింక్ పెడతావా? : మంత్రి అడ్లూరి
- గత ప్రభుత్వ దోపిడీలు, హత్యలకు కేసీఆర్ బాధ్యత వహిస్తాడా?
- పీఎంజే జ్యువెల్లరీ బాధితులను పరామర్శించిన మంత్రి



**కరీంనగర్ బ్యూరో, మే 05 (జనంసాక్షి):**
బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని, లేదంటే రాష్ట్రం లోని 33 జిల్లాల కాంగ్రెస్ కార్యకర్తల నుంచి తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హెచ్చరించారు. కరీంనగర్‌లో పీఎంజే జ్యువెల్లరీ షాప్‌లో ఆదివారం జరిగిన దొంగతనం, కాల్పుల ఘటనలో గాయపడిన బాధితులను మంగళవారం ప్రైవేటు ఆసు పత్రిలో మంత్రి అడ్లూరి పరామర్శించారు. అనంతరం రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్ జ్యువెల్లరీ దొంగతనం కేసు దురాదృష్టకరమని మంత్రి అన్నారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠా రెక్కీ చేసి పక్కా ప్రణాళిక ప్రకారం దొంగతనం చేసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలిందని వివరించారు. నిందితులను పట్టుకోవడానికి 15 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, ఇతర రాష్ట్రాల పోలీసుల సహకారం తీసుకుంటున్నామని తెలిపారు. బాధితులను పరామర్శించడానికి వచ్చిన కేటీఆర్ నోటికి వచ్చినట్లు మాట్లాడారని మంత్రి మండిపడ్డారు. అంతర్రాష్ట్ర దొంగలకు ముఖ్యమంత్రికి లింక్ ఉందని కేటీఆర్ చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. 2014 నుంచి 2023 వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కాలంలో జరిగిన దోపిడీలు, దొంగతనాలు, హత్యలకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ బాధ్యత వహిస్తాడా అని ప్రశ్నించారు.
కేటీఆర్ అక్రమంగా సంపాదించుకొని జన్వాడలో ఫామ్‌హౌస్ నిర్మించుకున్న విషయాన్ని రేవంత్ రెడ్డి డ్రోన్ కెమెరా ద్వారా బయటపెట్టినప్పుడు అక్రమ కేసు పెట్టి జైలుకు పంపించారని గుర్తు చేశారు. నేడు అంతర్రాష్ట్ర దొంగలకు ముఖ్యమంత్రికి సంబంధాలు ఉన్నాయని మాట్లాడటం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు.
కరీంనగర్ జ్యువెల్లరీ దాడి ఘటనలో గాయపడిన వారిని పరామర్శించడానికి కాంగ్రెస్ నాయకులు రాలేదని కేటీఆర్ చేసిన ఆరోపణలు అసత్యమని మంత్రి స్పష్టం చేశారు. సంఘటన జరిగిన రోజే సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, వెలిచాల రాజేందర్ రావు తదితరులు పరామర్శించారని గుర్తు చేశారు. మంథనిలో జరిగిన జంట హత్యలు, కొండగట్టు బస్సు ప్రమాదం, సిరిసిల్లలో దళితులపై థర్డ్ డిగ్రీ వంటి ఘటనల్లో బీఆర్ఎస్ నాయకులు ఎందుకు బాధితులను పరామర్శించలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం కేసులో సీబీఐ ద్వారా కేసీఆర్‌కు నోటీసులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ఫలితాలపై స్పందిస్తూ గెలుపు-ఓటములు సహజమని, ఎన్టీఆర్‌కు కూడా ఓటమి తప్పలేదని గుర్తు చేశారు. బీజేపీ దళితులు, బీసీల రిజర్వేషన్లను ఎత్తివేయడానికి కుట్ర చేస్తోందని ఆరోపించారు. కరీంనగర్ జ్యువెల్లరీ నిందితులను త్వరలోనే పట్టుకొని చట్టపరంగా శిక్షిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.



# నదిపై ఇసుక మాఫియా ఆరాచకం

## నిబంధనలు తుంగలో తొక్కి అక్రమ తవ్వకాలు

- అధికారుల మౌనం అనుమానాలకు తావు
- భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి.. రైతులు ఆందోళన

**బాన్సువాడ, మే 5 (జనంసాక్షి):**
నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలో పోతంగల్ మండలంలో మంజీరా నదిపై ఇసుక మాఫియా దందా రోజురోజుకు విస్తరిస్తూ స్థానికుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. నిబంధనలను బేఖాతరు చేస్తూ రాత్రింబవళ్లు అక్రమ తవ్వకాలు, రవాణా కొనసాగుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికంగా రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖల కొంతమంది అధికారులతో కుమ్మక్కై మాఫియా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. భారీగా ముడుపులు చెల్లిస్తూ అక్రమ రవాణాను నిరభ్యంతరంగా కొనసాగిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.
ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకే తవ్వకాలు, రవాణా జరగాలి. అయితే తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు టిప్పర్లు, లారీలతో ఇసుకను తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. హైదరాబాద్, మహారాష్ట్ర ప్రాంతాలకు పెద్ద ఎత్తున అక్రమంగా సరఫరా జరుగుతోందని సమాచారం. అక్రమ ఇసుక తవ్వకాల వల్ల మంజీరా నదిలో భూగర్భ జలాలు ప్రమాదకరంగా తగ్గిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోర్లు ఎండిపోవడం, సాగునీటి కొరత పెరగడం వల్ల వేల ఎకరాల సాగుభూమి ఎడారిగా మారే పరిస్థితి ఏర్పడుతోందని వారు అంటున్నారు.
ఇసుక క్వారీల ద్వారా వచ్చే ఆదాయంలో 50 శాతం గ్రామపంచాయతీ ఖాతాల్లో జమ కావాల్సి ఉన్నా, పోతంగల్ గ్రామపంచాయతీకి ఒక్క రూపాయి కూడా చేరలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం మరింత అనుమానాలకు తావిస్తోంది. అక్రమ రవాణాపై గ్రామస్తుల ఫిర్యాదుతో పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య స్పందించినట్లు సమాచా రం. నిబంధనలకు విరుద్ధంగా రాత్రి రవాణా జరుగుతుంటే ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అక్రమాల్లో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా మైనింగ్ శాఖ అధికారులు స్పందించకపోవడం ప్రజల్లో అనుమానాలు రేకెత్తిస్తోంది. పలుమార్లు ఫిర్యాదులు చేసినా చర్యలు లేకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక మాఫియాను అరికట్టేందుకు రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖలు సంయుక్తంగా ప్రత్యేక దాడులు నిర్వహించాలని, అక్రమ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని గ్రామస్తులు, రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే భవిష్యత్తులో సాగునీటి సంక్షోభం మరింత తీవ్రంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
6 మే 2026

# రవీంద్రుని జయంతి రోజు ప్రమాణస్వీకారం



- కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై బిజెపి స్పష్టత
- సిఎం అభ్యర్థిని ఎంపికచేయనున్న అధిష్టానం

**కోల్‌కతా, మే 5 (జనంసాక్షి) :** పశ్చిమబెంగాల్‌లో మే 9న భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయనుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య వెల్లడించారు. నోబెల్ పురస్కార గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా ఆ రోజున నూతన సీఎం ప్రమాణస్వీకారం చేస్తారని తెలిపారు. ఠాగూర్ ఆశీర్వాదంతో రాష్ట్రంలో ఒక కొత్త ఆరంభానికి నాంది పలకడానికి ఈ తేదీని నిర్ణయించామన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన పనులు చేస్తున్నామన్నారు. కాగా బెంగాల్ ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపట్టనున్నారనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. బెంగాల్ ఎన్నికల ఫలితాల అధికారిక గెజిట్ నోటిఫికేషన్‌ను ఈసీ ఉన్నతాధికారులు.. ప్రధాన ఎన్నికల అధికారి మనోజ్ కుమార్ అగర్వాల్‌కు అందజేయ నున్నారు. బుధవారం ఈ అధికారిక పత్రాలను సీఈసీ.. గవర్నర్ ఆర్.ఎన్.రవికి ఇస్తారు. అనంతరం ఆయన రాజీనామా సమర్పించాల్సిందిగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ఆహ్వానిస్తారు. కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసేవరకు మమత తాత్కాలిక ముఖ్యమంత్రిగా కొనసాగుతారు. ఇదిలావుంటే బెంగాల్‌లోని అసన్‌సోల్ ప్రాంతంలో గత కొన్నేళ్లుగా మూసిఉన్న దుర్గాదేవి ఆలయం సోమవారం తిరిగి తెరుచుకుంది. వివిధ వర్గాల మధ్య ఉద్రిక్తతలు, పరిపాలనాపరమైన ఆంక్షల వల్ల ఈ ఆలయం చాలాకాలంగా మూసేసి ఉంది. దుర్గా పూజ, లక్ష్మి పూజ వంటి వేడుకల కోసం మాత్రమే దీనిని తెరిచేవారు. తాను గెలిస్తే ఆలయాన్ని తెరిపిస్తానని అసన్‌సోల్ ఉత్తర్ స్థానం నుంచి పోటీ చేసిన భాజపా ఎమ్మెల్యే కృష్ణేందు ముఖర్జీ ప్రజలకు వాగ్దానం చేశారు.

# ఒకే ఒక్క ఓటుతో మాజీమంత్రి ఓటమి

**టివికె చేతిలో ఒక్క ఓటుతో ఓడిన పెరియకరుప్పన్**



**చెన్నై, మే 5 (జనంసాక్షి) :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ సృష్టించిన ప్రభంజనంలో పలువురు చిత్తయ్యారు. విజయ్ నేతృత్వంలోని ఆ పార్టీ 108 సీట్లు సాధించి.. అత్యధిక స్థానాలు గెలిచిన పార్టీగా అవతరలించింది. డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు తర్వాత స్థానాల్లో నిలిచాయి. అయితే విజయ్ వేవ్‌లో డీఎంకే నేతలు చెల్లాచెదురయ్యారు. ఆ రాష్ట్ర సహకార శాఖ మాజీ మంత్రి కేఆర్ పెరియకరుప్పన్ అనూహ్య రీతిలో ఓటమిపాలయ్యారు. ఆయన కేవలం ఒకే ఒక్క ఓటు తేడాతో ఓటమి చెందారు. తిరుప్పత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తమిళగ వెట్రి కజగం పార్టీ నుంచి సీనివాస సేతుపథి పోటీ చేశారు. అయితే తాజా ఫలితాల్లో టీవీకే నేతకు 83, 375 ఓట్లు పోలయ్యాయి. ఇక రెండవ స్థానంలో పెరియకరుప్పన్‌కు 83,374 ఓట్లు పడ్డాయి. చాలా ఆసక్తికరంగా ఈ రేస్ కొనసాగింది. చివరి రౌండ్ వరకు పోటీ నువ్వానేనా అన్నట్లుగా సాగింది. చివరి రౌండ్ కన్నా ముందు రౌండ్‌లో 30 ఓట్ల ఆధిక్యంలో డీఎంకే నేత పెరియకరుప్పన్ ఉన్నారు. కానీ అనూహ్యమైన రీతిలో మాజీ మంత్రికి షాక్ తగిలింది. చివరి రౌండ్‌లో టీవీకే నేత సీనివాస సేతుపథ పుంజుకుని విజయాన్ని నమోదు చేశారు. పెరియకరుప్పన్ కన్నా ఒక్క ఓటు ఎక్కువ ఆర్జించారు. దీంతో టీవీకే నేత థ్రిల్లింగ్ విక్టరీ నమోదు చేశారు. తిరుప్పత్తూరు స్థానం నుంచి పోటీ చేసిన బీజేపీ నేత కేసీ తిరుమరన్ మూడవ స్థానంలో నిలిచారు. ఆయనకు 29,054 ఓట్లు పోలయ్యాయి.

# సామాన్యులను అక్కున చేర్చుకున్న ఓటర్లు

**ప్రజల్లో ఆదరణతో బెంగాల్‌లో పనిమనిషి గెలుపు**



కోల్‌కతా, మే 5 (జనంసాక్షి) :పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల్లో ఓ మహిళ విజయం ఆసక్తికరంగా మారింది. భాజపా తరఫున పోటీ చేసిన కలితా మాఝీ అనూహ్యంగా రాజకీయ యవనికపై దూసుకు వచ్చి ఎమ్మెల్యే అయ్యారు. ఓ సామాన్యురాలని చట్టసభకు తీసుకుని వచ్చిన ఘనత బిజెపిదే అని చెప్పకతప్పదు. ఔస్‌గ్రామ్ నియోజకవర్గంలో ఆమె గెలుపొందారు. టీఎంసీ అభ్యర్థిపై 12,535 ఓట్లతో విజయం సాధించారు. మాఝీ.. గతంలో పలు ఇళ్లల్లో పనిమనిషిగా పనిచేశారు. నెలకు రూ.2,500 సంపాదించేవారు. ఆస్తులు, అంతస్తులు లేకపోయినప్పటికీ.. తన మంచితనంతో ఆమె ఇంతటి భారీ విజయాన్ని సాధించడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. గుస్కారా మున్సిపాలిటీకి చెందిన మాఝీ రాజకీయాల్లోకి రాకముందు పలు ఇళ్లల్లో సహాయకురాలిగా పని చేశారు. 2021 ఎన్నికల్లో భాజపా ఆమెకు సీటు ఇవ్వడంతో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన అభేదానంద థాండర్ చేతిలో ఓడిపోయారు. అయినప్పటికీ స్థానికులతో ఆమెకున్న సంబంధాలపై విశ్వాసంతో భాజపా మరోసారి తాజా ఎన్నికల్లో అవకాశం ఇవ్వడంతో ఈసారి ఆమె తన నమ్మకాన్ని నిలబెట్టుకున్నారు. సాధారణ పౌరులు సైతం ఎన్నికల్లో విజయం సాధించవచ్చని నిరూపించారు. మాఝీ విజయం బెంగాల్ రాజకీయాల్లో ఒక నిర్మాణాత్మకమైన మార్పును సూచిస్తోంది. మరోవైపు తమిళనాడులోనూ ఓ ఆటోడ్రైవర్ టీవీకే తరఫున ఎన్నికల్లో పోటీ చేసి ఎమ్మెల్యే అయ్యాడు. టీవీకే అధినేత విజయ్ కారు డ్రైవర్ కుమారుడు కూడా ఈ ఎన్నికల్లో భారీ విజయం సాధించాడు. ఇలా పలుచోట్ల పలు రకాలుగా వార్తలు వస్తున్నాయి.

# మైనర్ల ట్రాప్ కేసులో వెలుగులోకి సంచలన విషయాలు

**ఇన్‌స్టా వేదికగా వల విసరి లోబర్చుకున్న బ్రదర్స్**
- ఖరీదైన కార్లలో తిప్పుతూ అత్యాచారాలు
- కేసులో ఆజాద్ తల్లి, మేనమామల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన కమిషనర్ సజ్జన్నార్

**హైదరాబాద్, మే 5 (జనంసాక్షి) : జూబ్లీహిల్స్ బాలికల ట్రాప్, చీటింగ్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో ఇద్దరు అన్నదమ్ములు.. 19 మంది మైనర్లను ట్రాప్ చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను మీడియాకు హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ వెల్లడించారు. నిందితులను విచారించామని.. ఈ విచారణలో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్‌లో మూడుగంటల పాటు నిందితులను సీపీ ప్రశ్నించారు.**



అర్జున్ అలియాస్ చంద్రశేఖర్ ఆజాద్, ప్రవీణ్‌లను అరెస్ట్ చేసి కస్టడీకి తీసుకున్నట్లు చెప్పారు. రిచ్ కిడ్స్‌ను అర్జున్, ఆయన సోదరుడు ప్రవీణ్ టార్గెట్ చేశారని సజ్జనార్ వెల్లడించారు. మైనర్లను ట్రాప్ చేసి ఖరీదైన కార్లలోనే లైంగిక చర్యలకు అర్జున్ పాల్పడ్డాడని తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఎస్కార్ట్‌గా ఉంటూ మైనర్లకు వల విసిరారని చెప్పారు. అర్జున్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో 150 మంది అమ్మాయిలు ఫాలో అవుతున్నారన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రస్తుతం అర్జున్ ప్రొఫైల్‌ను తాము లాక్ చేశామని తెలిపారు. ఇద్దరు నిందితులకు వారి తల్లి మీనాకుమారి కూడా సహకరించినట్లుగా గుర్తించామని అన్నారు. నిందితుల కుటుంబం గుంటూరుకు చెందినదిగా తమ దర్యాప్తులో తేలిందన్నారు. బాలికలు అట్రాక్ట్ అయ్యేలా ఇన్‌స్టాగ్రామ్‌లో అర్జున్ రీల్స్ చేశాడని అన్నారు. ఇక్కడి నుంచి బాలికలను ట్రాప్ చేసి రిచ్‌గా కారులో షికారు అంటూ హైదరాబాద్ రోడ్లపై అర్జున్ అన్నదమ్ములు తిప్పారని చెప్పారు. తమతో ఫిజికల్ రిలేషన్ పెట్టుకునేలా బాలికలపై ఒత్తిడి చేశారన్నారు. ఆ వీడియోలను కూడా నిందితులు రికార్డు చేశారని.. సమయం చూసి తాము ఓ బిజినెస్ మొదలుపెడతామని బాధితులను నమ్మించి డబ్బు అడిగేవారని తెలిపారు. అలా ఓ బాలిక ఇంట్లో తెలియకుండా రూ. 13 లక్షలను నిందితులకు ఇచ్చిందన్నారు. గత ఏడాది కూడా ఇలాగే మరో మైనర్‌ను అర్జున్ ట్రాప్ చేశారని తెలిపారు. ఈ కేసులో మూడు రోజుల పాటు జైల్లో ఉండి ఆయన బయటకు వచ్చారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. ఇకపోతే యువతులను బెదిరించి డబ్బులు కాజేసిన ఈ కేసులో మరో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఆజాద్ తల్లితోపాటు మేనమామను జూబ్లీహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఖరీదైన కార్లలో తిరుగుతున్న ఫొటోలను ఇన్‌స్టాలో పోస్టు చేసిన ఆజాద్.. స్టార్టప్ కంపెనీ నిర్వహిస్తున్నట్లు ప్రచారం చేసుకున్నాడు. యువతులకు దగ్గరై.. ఫొటోలు బహిర్గతం చేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఓ మైనర్ బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో గత నెలలో ఆజాద్, అతడి సోదరుడిని పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు అనుమతితో నాలుగు రోజులు కస్టడీకి తీసుకొని విచారించారు. మోసపోయిన వారిలో ఎక్కువ మంది మైనర్లు ఉన్నట్లు గుర్తించారు. యువతుల నుంచి కాజేసిన సొమ్మును తల్లి, మేనమామ ఖాతాల్లో జమచేసినట్లు విచారణలో తేలింది. దీంతో తాజాగా వారిద్దరినీ పోలీసులు అరెస్టు చేశారు.

# మిల్లుల వద్ద అన్‌లోడింగ్ పెంచాలి

- ధాన్యం తరలించేందుకు లారీలు పెంచాలి
- నల్లగొండలో ఆకస్మిక పర్యటన చేసిన స్టీఫెన్ రవీంద్ర



**నల్లగొండ, మే 5 (జనంసాక్షి) :** రబీ ధాన్యం సేకరణలో భాగంగా మిల్లుల వద్ద అన్‌లోడింగ్ పెంచాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశించారు. అన్‌లోడింగ్ తోపాటు, వెహికల్ రోటేషన్, కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం తరలించడం, లారీలు, హమాలీలను పెంచాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఆయన నల్గొండ జిల్లా, చిట్యాల మండలం, పెద్దకాపర్తి లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెదకాపర్తి కేంద్రానికి ఇప్పటివరకు వచ్చిన దాన్యం వివరాలు, హమాలీలు, ,ట్రక్ షీట్లు, మిల్లుల ట్యాగింగ్ చేసిన వాహనాలు, టార్పాలిన్లు, తదితర వివరాలను జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, కేంద్రం నిర్వాహకుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కాగా ఇప్పటివరకు ఈ కేంద్రానికి 25 వేల క్వింటాళ్ల దాన్యం వచ్చిందని, ఇందులో 7000 క్వింటాళ్లు కొనుగోలు చేయడం జరిగిందని, ట్యాబ్ ఎంట్రీ కూడా పూర్తి చేశామని, ఇంకా కొనుగోలు కేంద్రంలో 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నట్లు అధికారులు వివరించారు. పెదకాపర్తి కేంద్రం పెద్ద సెంటర్ అయినందున అన్ని పెద్ద సెంటర్లలో 10 నుండి 20 వరకు ఎక్స్ట్రా లారీలు ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సివిల్ సప్లై కమిషనర్ కు వివరించారు. హమాలీల కొరత లేకుండా మిల్లర్లకు ముందే సమాచారం ఇవ్వడం జరిగిందని, ఒక్కొక్క కొనుగోలు కేంద్రంలో 30 వరకు హమాలీలు ఉన్నారని, అదేవిధంగా మిల్లుల్లో సైతం 30 నుండి 35 వరకు హమాలీలను ఉంచడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ కమిషన్ మాట్లాడుతూ ట్యాబ్ ఎంట్రీ నూటికి నూరు శాతం కావాలని, కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని శుభ్రపరిచేందుకు డ్రయ్యర్లు, శుభ్రం సిస్టం ద్వారా ధాన్యం వివరాల అప్లోడింగ్ ,ట్యాబ్ ఎంట్రీ వివరాలను ఆయన పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేస్తున్నామని చెప్పారు. ట్యాబ్ ఎంట్రీ పెండింగ్ ఉన్న కొనుగోలు కేంద్రాలపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని, మిల్లులలో స్థలం లేకుంటే ఇంటర్మీడియట్ గోడౌన్లకు తరలించాలని, ధాన్యం తరలింపు తో పాటు, మరిన్ని వాహనాలు ఏర్పాటు చేయాలని ట్రాన్స్పోర్ట్ శాఖ డిప్యూటీ కమిషనర్ వాణిని సివిల్ సప్లైస్ కమిషనర్ ఆదేశించారు. పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ రోహిత్ సింగ్, జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, పౌరసరఫరాల శాఖ జీఎం నాగేశ్వర రావు, ట్రాన్స్పోర్ట్ డిప్యూటీ కమిషనర్ వాణి, పౌరసరఫరాల శాఖ వెంకటేశం జి ఎం. రాంపతి నాయక్, డిసీఓ పత్యా నాయక్, మార్కెటింగ్ శాఖ ఎడి ఛాయాదేవి, చిట్యాల తహసిల్దార్ విజయ్, తదితరులు ఉన్నారు.



# ప్లాస్టిక్ గోదామ్‌లో అగ్నిప్రమాదం

హైదరాబాద్, మే 5 (జనంసాక్షి) :బాలాపూర్ పరిధిలోని కొత్తపేట గాలిబ్ కాలనీలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ప్లాస్టిక్ గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గమనించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణాపాయం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# కరీంనగర్ బంగారం షాపు చోరీ కేసులో పురోగతి

**ధర్మపురి లాడ్జిలో దొంగల బస**

**సిసి ఫుటేజ్ ఆధారంగా దొంగలను గుర్తించే పనిలో పోలీసులు**



**కరీంనగర్, మే5 (జనంసాక్షి) :** కరీంనగర్‌లోని బంగారం షాపు చోరీ కేసులో దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలోని ఒక లాడ్జిలో దుండగుల ముఠా బస చేసినట్లు గుర్తించారు. గోదావరి తీరం పక్కనే ఉన్న ప్రైవేట్ లాడ్జిలో వారు రెండు రోజులు ఉన్నట్లు పోలీసులు కనుగొన్నారు. మే 3వ తేదీ ఉదయం లాడ్జిని ఖాళీ చేసిన ఈ ముఠా.. బైక్‌లపై మట్టి రోడ్డు ద్వారా కరీంనగర్ చేరుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ధర్మపురి నుంచి బయలుదేరిన ఈ ముఠా.. ధర్మారం, పెగడపల్లి, రామడుగు మండలాల మీదుగా కరీంనగర్‌కు చేరుకుందని సీసీ కెమెరాల ద్వారా పోలీసులు నిర్ధారించుకున్నారు. ఈ సందర్భంగా ధర్మపురిలో వీరు బస చేసిన లాడ్జిని పోలీసులు తనిఖీ చేశారు. అలాగే సీసీ టీవీ ఫుటేజ్‌ను పోలీసులు జల్లెడ పడుతున్నారు. అదే సమయంలో వారి ఫోన్ కాల్స్‌ను సైతం పోలీసులు పరిశీలిస్తున్నారు. పక్కాగా రెక్కీ చేసిన తర్వాతే కరీంనగర్‌లోని పీఎంజే దుకాణంలో చోరీ చేసి.. సిబ్బందిపై కాల్పులు జరిపినట్లు పోలీసులు ఒక నిర్ధారణకు వచ్చారు. మే 3వ తేదీన కరీంనగర్‌లోని పీఎంజీ జ్యువెలరీ షాపులో భారీగా బంగారం చోరీ జరిగింది. బైక్‌లపై సాధారణ కస్టమర్లలాగా వచ్చిన ఐదుగురు నిందితులు.. షాపులో క్షణాల్లో బీభత్సం సృష్టించారు. తుపాకులతో సిబ్బందిని బెదిరించడంతో పాటు.. వారిపై కాల్పులు జరిపారు. దీంతో పలువురు గాయపడ్డారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి.. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వారిని పట్టించిన వారికి నగదు బహుమతిగా ఇస్తామని పోలీసులు ప్రకటించారు.

# ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల రాస్తారోకో

**యాదాద్రి భువనగిరి, మే 5 (జనం సాక్షి) :** ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. చేతికొచ్చిన పంట కండ్ల ముందే వర్షార్పణం అవుతుంటే కడుపుమండిన రైతులు రోడ్లపై కొచ్చి ఆందోళనలు చేపడుతున్నారు. తాజాగా యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తక్షణమే ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# ఐపిఎస్ విశాల్ గున్నికి హైకోర్టు షాక్

**క్యాట్ ఉత్తర్వులపై స్టే విధిస్తూ ఆదేశం**

**అమరావతి, మే5 (జనంసాక్షి) :** ఐపీఎస్ అధికారి విశాల్ గున్నికి ఆంధప్రదేశ్ హైకోర్టు షాక్ ఇచ్చింది. క్యాట్ ఉత్తర్వులపై స్టే విధించింది. పూర్తి వివరాల్లోకి వెళితే.. సినీ నటి కాదంబరి జత్వాని అక్రమ అరెస్ట్, అధికార దుర్వినియోగం కేసులో విశాల్ గున్నిని ప్రభుత్వం సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. అయితే, ఈ అంశంపై విశాల్ గున్ని క్యాట్‌ను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలోనే విశాల్ గున్ని సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దు చేసి ఆయనను వెంటనే విధుల్లోకి తీసుకుని పోస్టింగ్ ఇవ్వాలని గత ఏడాది ఆగస్టు 28వ తేదీన క్యాట్ ఉత్తర్వులు జారీ చేసింది. క్యాట్ ఉత్తర్వులను రాష్ట్ర చీఫ్ సెక్రటరీ, డీజీపీ హైకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. డీజీపీ, సీఎస్ తరఫున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. సస్పెన్షన్ కాల పరిమితి ముగియక ముందే ఉత్తర్వులను క్యాట్ రద్దు చేసిందని, దాని కారణంగా విచారణ ముందుకు వెళ్లలేదని అడ్వకేట్ జనరల్ కోర్టుకు తెలిపారు. ఇక, విశాల్ గున్ని తరుపున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ వాదనలు వినిపించారు. ఇరు వర్గల వాదనలు విన్న అనంతరం క్యాట్ ఉత్తర్వులపై స్టే విధిస్తూ హైకోర్టు నిర్ణయం తీసుకుంది.

# మహిళ మెడలో గొలుసు చోరీ ఘటనలో ఆటోడ్రైవర్ సాహసం



**హైదరాబాద్, మే5 (జనంసాక్షి) :** ఓ సామాన్య ఆటో డ్రైవర్ అసామాన్య ధైర్య సాహసాలు ప్రదర్శించాడు. మహిళ మెడలో గొలుసు లాక్కుని పారిపోతున్న రౌడీ షీటర్‌ను తన ఆటో సాయంతో అడ్డుకున్నాడు. కత్రతో దాడి చేస్తున్నా బెదరకుండా అతడిని పట్టుకున్నాడు. రౌడీ షీటర్ అరెస్ట్ అవ్వడానికి ఎంతో కృషి చేశాడు. ఆటో డ్రైవర్ ధైర్యసాహసాలకు సరైన గుర్తింపు దక్కింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆటో డ్రైవర్‌ను సన్మానించారు. ఆ పూర్తి వివరాల్లోకి వెళితే.. మార్చి 4వ తేదీ తెల్లవారుజామున బేగం బజార్ జిన్సీ చౌరాహా ప్రాంతంలో మంజు ఓమ్లతా తన కోడలితో కలిసి మార్నింగ్ వాక్‌కు వెళ్లారు. హిందీ మర్వాడీ విద్యాలయ స్కూల్ వద్ద ఊహించని పరిణామం చోటుచేసుకుంది. డబీర్‌పురకు చెందిన రౌడీ షీటర్ మహ్మద్ సోహేల్ ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆ క్రమంలో అతడి స్కూటీ అదుపుతప్పి కిందపడిపోయింది. బాధితురాలు గట్టిగా కేకలు వేసింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఆటో డ్రైవర్ మహమ్మద్ జాహెర్ సైడ్ వ్యూ మిర్రర్ ద్వారా ఆ దృశ్యాన్ని చూశాడు. వెంటనే ఆటోను రివర్స్ చేశాడు. రౌడీ షీటర్ స్కూటీని పైకి లేపి అక్కడినుంచి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. జాహెర్ ఆటోతో స్కూటీని ఢీకొట్టాడు. దీంతో మహ్మద్ సోహేల్ కిందపడిపోయాడు. జాహెర్ వెంటనే కిందకు దిగి సోహేల్‌ను పట్టుకున్నాడు. తర్వాత అటు వైపు వెళుతున్న వారు కూడా జాహెర్‌కు సాయం చేశారు. రౌడీ షీటర్‌ను పోలీసులకు పట్టించారు. అనంతరం జాహెర్ అక్కడినుంచి వెళ్లిపోయాడు. ఈ సంఘటనకు సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఎలాంటి ప్రతిఫలం ఆలోచించకుండా.. తన ప్రాణాలకు తెగించి రౌడీ షీటర్‌ను పోలీసులకు పట్టించిన జాహెర్‌ను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ మంగళవారం బంజారాహిల్స్, టీజీఐసీసీసీలోని తన ఛాంబర్‌లో ప్రత్యేకంగా సన్మానించారు. ప్రశంసా పత్రంతో పాటు నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో గోల్కొండ జోన్ డీసీపీ జీ చంద్ర మోహన్, గోషామహల్ ఎస్‌హెచ్‌ఓ శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370